www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




కోడిపందేలు చూడాలంటే
టికెట్ రూ.5 వేలు
పశ్చిమలో కొన్ని బరుల నిర్వాహకుల దూకుడు
2

శుక్రవారం | 12-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 268 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి మ. 2.25 తదుపరి విదియ; నక్షత్రం: ఉత్తరాషాఢ మ.3.19 తదుపరి శ్రవణం; వర్జ్యం: రా. 6.54-8.20; దుర్ముహూర్తం: ఉ. 9.05-9.49, మ. 12.46-1.30; అమృతఘడియలు: ఉ. 9.32-10.59; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 5.55 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బాదుడులో బాద్షా!



● ఎడాపెడా నిలువు దోపిడీ..

జగన్ వరుస దెబ్బలతో జనం విలవిల

అలుమగలు, ఇద్దరు పిల్లలున్న కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుంటే ఆ ఇద్దరు పిల్లల్లో ఒకరికి అమ్మఒడి అమలవుతుంది. అంటే, నాలుగేళ్లలో రూ.60 వేలు అందించి ఉంటారు. ఇంట్లో మహిళకు చేయూత అందితే ఆయా కులాలనుబట్టి రూ.60 వేల నుంచి రూ.75 వేలు అందే అవకాశం ఉంది. పొలం ఉండి రైతు భరోసా అందితే ఒక్కో ఏడాది రూ.13,500 చొప్పున నాలుగేళ్లలో రూ.54 వేలు దక్కే వీలుంది. సగటు కుటుంబానికి ఇవన్నీ దక్కితేనే ఈ నాలుగేళ్లలో రూ.1.74 లక్షలు నవరత్నాల ద్వారా అందినట్లు! కానీ, పన్నులు పిండి.. విద్యుత్ చార్జీలు బాది.. మద్యం బడ్జెట్‌ను పెంచేసి.. ఈ 54 నెలల్లో సగటు కుటుంబంపై మోపిన అదనపు భారం రూ.2,67,516.

నిత్యావసరాల నెల బిల్లుతో గుండె గుభేల్

పప్పుల నుంచి విద్యుత్ దాకా అన్నీ డబుల్

- బాదుడే బాదుడంటూ ఎన్నికల్లో జగన్ ప్రచారం
- ఇప్పుడేమో ప్రతి సభలోనూ ఏడుపే ఏడుపు
- కానీ బాదుడులో జగన్‌కు పోటీ లేదంటున్న జనం
- గత నాలుగేళ్లలో సామాన్యుడి బతుకు బేజారు
- చెత్త నుంచి ఆస్తి పన్ను వరకు వరుస బాదుళ్లు
- కరెంటు నుంచి మద్యం వరకు పిండేయడమే
- భారీగా పెరిగిన నెలవారీ ఖర్చులు
- రాష్ట్రంలో సగటు పౌరుడి బతుకు ఛిద్రం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

బాదుడే బాదుడు అంటూ నాటి చంద్రబాబు ప్రభుత్వంపై ఎన్నికల ప్రచారంలో వైఎస్ జగన్ విరుచుకుపడేవారు. ఇప్పుడేమో ఏడుపే ఏడుపు అంటూ ప్రతి సభనూ తన ఏడుపులతో నింపేస్తున్నారు. కానీ, జగన్ పాలనను చంద్రబాబుతో పోల్చుకుంటున్న సామాన్యుడి నోట మాత్రం ఒకటే మాట. జగనన్న బాదుడులో బాద్షా! వైసీపీ సర్కారు వచ్చినప్పటి నుంచే సామాన్యుల బతుకు ఛిద్రమై పోయింది. నవరత్నాలతో రాష్ట్ర ప్రజలను ఉద్ధరిస్తామన్న జగన్...బటన్ నొక్కి ఇచ్చినదాని కంటే పేదల నుంచి లాక్కొన్నదే ఎక్కువగా ఉంది. నవరత్నాలు అనే ఎర వేసి భారీగా ప్రజల నుంచి పన్నులు పిండేశారని గణాంకాలు చెబుతున్నాయి. జగన్ అధికారంలోకి వచ్చిన 54 నెలల్లో ఒక్కో కుటుంబంపై సరాసరి అక్షరాలా రూ.2,67,516 అదనపు భారం మోపారు. గతంలో చంద్రబాబు

మిగతా 2వ పేజీలో...

నవరత్నాలన్నీ అందిన కుటుంబానికి లబ్ధి **1.74** లక్షలు

ఇది మామూలు బాదుడు కాదయా..

అదే కుటుంబం నుంచి దండుకుంటున్నది **2.67** లక్షలు

టీచర్లకూ ఎన్నికల డ్యూటీ!





వారి వివరాలను పంపండి
జగన్ ప్రభుత్వానికి సీఈసీ కళ్లెం

- జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు
- జాబితా పంపే పనిలో అధికారులు
- ఏ హామీ తీర్చని సర్కారుపై టీచర్ల ఆగ్రహం
- ఎన్నికల్లో దెబ్బ తీస్తారేమోనని గుబులు
- అందుకే 'బోధనేతర' సాకుతో వారిని ఎన్నికల విధులకు దూరంపెట్టేలా సర్కారు ఎత్తు
- సచివాలయాల సిబ్బందితో గట్టెక్కే యత్నం
- ఈసీ భేటీలో చంద్రబాబు, పవన్ ఫిర్యాదు
- టీచర్ల వివరాలూ కోరిన ఎన్నికల సంఘం

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులకు టీచర్లను దూరంగా పెట్టాలన్న జగన్ సర్కార్ ఎత్తులను కేంద్ర ఎన్నికల సంఘం చిత్తు చేసింది. ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్న టీచర్లను పక్కనపెట్టి.. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో ఈసారి ఎన్నికల్లో గట్టెక్కాలనుకున్న జగన్ ఎత్తుగడకు ఈసీ కళ్లెం వేసింది. టీచర్లను ఎన్నికల ప్రక్రియలోకి తీసుకువచ్చే కార్యాచరణను ప్రారంభించింది. ప్రిసైడింగ్ ఆఫీసరు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసరు, ఇతర పోలింగ్ విధుల్లో టీచర్ల నియామకానికి వివరాలు పంపాలని ఆదేశించింది. ఇతర శాఖల ఉద్యోగులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల వివరాలతోపాటు టీచర్ల వివరాలూ పంపాలని స్పష్టం చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లను సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా ఆదేశించారు. జగన్ సర్కారు టీచర్లను పోలింగ్ విధులకు

మిగతా 12వ పేజీలో...

అవే జిత్తులు.. ఏమార్చే ఎత్తులు

- వైసీపీ విజయంలో దొంగ ఓట్లే కీలకం.. గత ఎన్నికల అక్రమాలు ఒక్కొక్కటి వెలుగులోకి
- 2019లో 30 చోట్ల ఆఖరున చేర్పులు.. నెల్లూరు సిటీలో కొత్తగా 47 వేల ఓట్లు జాబితాలోకి
- గెలుస్తారనుకున్న నారాయణ కొద్ది తేడాతో ఓటమి.. నమ్మకమే పెట్టుకోని అనిల్‌కు అనుకోని విజయం
- వైసీపీ కుట్రను నాడు పసిగట్టలేకపోయిన టీడీపీ.. అదే దొంగదారిలో ఇప్పుడూ జగన్ ప్రయత్నాలు

11



కోనసీమ జిల్లా పాశర్లపూడి వైనతేయ నదిలో జలదీక్ష చేస్తున్న అంగన్వాడీలు

మాతో పెట్టుకుంటే కుర్చీ లాగేస్తాం!

12

- హెచ్చరించిన అంగన్వాడీలు.. కొనసాగిన ఆందోళనలు
- నేడు అంగన్వాడీ సంఘాలతో మంత్రుల కమిటీ చర్చలు

సమస్యలా.. మతమా?

తేల్చుకోవాలని ప్రజలకు చెబుతాం



- మత ప్రాతిపదికన బీజేపీ ప్రచారం రాజ్యాంగ వ్యతిరేకం
- "హిందుత్వ" అంశం ఆ పార్టీ సొత్తు కాదని వివరిస్తాం
- బడ్జెట్ సమావేశాల తర్వాత ఇండియా కూటమి ప్రచారం
- రామ మందిర ప్రారంభానికి వ్యూహాత్మకంగానే దూరం
- 140 స్థానాల్లో కాంగ్రెస్ విజయం ఖాయం: సీనియర్‌నేత

న్యూఢిల్లీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆచితూచి ఆలోచించిన తర్వాతే అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి హాజరుకాకూడదని కాంగ్రెస్ అగ్ర నేతలు నిర్ణయించారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇది ముమ్మాటికీ బీజేపీ- ఆర్ఎస్ఎస్ కార్యక్రమమేనని స్పష్టం చేశాయి. ఆహ్వానాలు సహా పలు అంశాల్లో ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ నేతలు చురుగ్గా పాల్గొనడమే నిదర్శనమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒకరు గురువారం వెల్లడించారు. ఆలయ ప్రారంభాన్ని రాజకీయం చేసేందుకు స్వయంగా ప్రధాని మోదీనే ప్రయత్నించారని, జనవరి 22న ఇంటింటా దీపాలు వెలిగించమని ప్రజలకు

మిగతా 2వ పేజీలో...

31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

ఫిబ్రవరి 9 వరకు నిర్వహణ.. మహిళా రైతులపై వరాల జల్లుకు చాన్స్

కుటుంబ కథా చిత్రమ్!



వైసీపీకి అభ్యర్థులు దొరక్క ఒకే కుటుంబంలో పలువురికి సీట్లు

బొత్స కుటుంబానికి జాక్‌పాట్

- భార్య, మేనల్లుడికి రెండు ఎంపీ సీట్లు
- మంత్రి సురేశ్, సోదరుడూ అసెంబ్లీ బరికి
- కారుమూరి కొడుక్కి ఏలూరు లోక్‌సభ
- 6 ఎంపీ, 15 అసెంబ్లీ పేర్లతో జాబితా
- పార్థసారథికి మొండిచేయి
- పెనమలూరులో మంత్రి జోగి
- రాయదుర్గానికి గోవిందరెడ్డి
- దర్శిలో బూచేపల్లికి మళ్లీ చాన్సు
- చిత్తూరుకు విజయానందరెడ్డి
- ఎంపీ గురుమూర్తికి సత్యవేడు
- మంత్రి జయరాం కర్నూలు లోక్‌సభకు
- రాజంపేట అసెంబ్లీకి ఆకేపాటి పోటీ
- రోజంతా సీఎం జగన్ కసరత్తు

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి వైసీపీ ఇన్‌చార్జుల మూడో జాబితా ఎట్టకేలకు విడుదలైంది. ఆరు లోక్‌సభ, 15 అసెంబ్లీ స్థానాలకు ఇన్‌చార్జులను ఖరారు చేస్తూ గురువారం రాత్రి వైసీపీ ప్రకటన విడుదల చేసింది. అయితే ఆ పార్టీకి అభ్యర్థులు దొరక్క ఒకే కుటుంబంలో రెండేసి టికెట్లు ఇచ్చిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యా మంత్రి బొత్స సత్యనారాయణ భార్య ఝాన్సీలక్ష్మిని విశాఖ లోక్‌సభ స్థానానికి, ఆయన మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావును విజయనగరం ఎంపీ స్థానానికి ఇన్‌చార్జులుగా నియమించారు. కుటుంబం నుంచి ఒక్కరికే అవకాశమని చెబుతూ వచ్చిన జగన్.. అభ్యర్థుల కొరత కారణంగా దీనిని పక్కనపెట్టారు. అలాగే కొండపిలో

మిగతా 2వ పేజీలో...

జనసేనలోకి ముద్రగడ!

- జగన్‌కు కాపు ఉద్యమ నేత షాక్!!
- వైసీపీలోకే వస్తారని కొంతకాలంగా అధికార పక్షం ప్రచారం
- ఆయన ద్వారా టీడీపీ, జనసేన ఓట్లకు గోదావరిలో గండికొట్టాలని సీఎం ప్లాన్
- జాబితాల ప్రకటనతో ముద్రగడ ఫైర్
- పైగా గెలవలేరన్న కామెంట్లపై కినుక
- 2 రోజులున్నా దొరకని జగన్ దర్శనం
- ఇది అవమానించడమేనని లోలోపల ముద్రగడ ఆగ్రహం

11

సాయిప్రసాద్ అవుట్!



రెవెన్యూ స్పెషల్ సీఎస్‌గా తొలగింపు
జగన్ బాధితుల జాబితాలో మరో 'అన్న'

- ప్రస్తుతం సెలవులో ఉన్న సాయిప్రసాద్
- ముగిశాక ఆ పోస్టుతో పాటు సీసీఎల్ఏగా కొనసాగుతారని తొలుత ఉత్తర్వులు
- అప్పటిదాకా ఇంతియాజ్‌కు అప్పగిస్తూ 4న జీవో జారీ
- వారం తిరగకముందే తెరపైకి జైన్
- ఆయనకు రెవెన్యూ అదనపు బాధ్యతలు
- సాయిప్రసాద్ వెనక్కి తిరిగొచ్చాక మళ్లీ సీసీఎల్ఏ ఇస్తారా..?
- రెవెన్యూ స్పెషల్ సీఎస్‌గా ఉంటారా?
- ఐఏఎస్ వర్గాల్లో ఇప్పుడిదే చర్చ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎల్వీ ప్రసాదన్న, సవాంగన్న, రమేశన్న, నీరబ్‌కుమారన్న.. ఇప్పుడు సాయిప్రసాదన్న. జగన్, ఆయన కార్యాలయ వేధింపులకు గురయిన బాధితుల జాబితాలో కొత్తగా సాయి ప్రసాద్ అన్న కూడా చేరారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ (1991 బ్యాచ్) జి.సాయిప్రసాద్‌ను ఆ పోస్టు నుంచి తొలగిస్తూ సర్కారు తాజాగా ఉత్తర్వులు (జీవో 76) జారీ చేసింది. అదే బ్యాచ్‌కు చెందిన మరో సీనియర్ ఐఏఎస్ అధికారి అజయ్ జైన్‌కు అదనంగా ఆ బాధ్యతలు అప్పగిస్తూ

మిగతా 3వ పేజీలో...

ఎస్పీ కాదు.. వాళ్లమ్మ మొగుడికి చెప్పు!

మద్యం పట్టుకుంటే రోజూ స్టేషనుకు వస్తా

- ప్రొద్దుటూరు ఎస్ఈబీ అధికారులపై ఎమ్మెల్యే రాచమల్లు ఆగ్రహం
- స్టేషనులోనే నిలబెట్టి ఎస్ఐపై గద్దింపు

12

అక్రమార్జనలో తోపులు!

ఆయన అధికార పార్టీ ప్రజాప్రతినిధి. ప్రజలను కాపు కాయడం ఏమోకానీ.. అందిన కాడికి దోచుకోవడంలో మాత్రం తోపుగా గుర్తింపు పొందారు. అనంతలో ఈయన అవినీతి భారీ ఎత్తున ప్రకాశిస్తోందని సొంత నేతలే గుసగుసలాడుతున్నారు. ఆయనతోపాటు ఇద్దరు సోదరులు.. చేతి వాటం.. నోటి వాటంతో కోట్లు కూడబెట్టుకున్నారు. తమను మించిన తోపులు ఎవరంటూ అక్రమ సంపాదనలో దూసుకుపోతున్నారు. ఎమ్మెల్యే సోదరుల భూదందాలు, దౌర్జన్యాలు, అరాచకాలకు అంతేలేదని, వాళ్లను మించిన తోపులు లేరని టాక్!!

వీళ్లు మామూలు తోపులు కాదు.. బ్రో!

ఆ ఎమ్మెల్యే చెప్పేవన్నీ శ్రీరంగనీతులే. ఎవరన్నా ఏమన్నా అంటే నా రేంజే వేరంటారు. సీఎం తరువాత సీఎం లాంటివాణ్నంటూ కాలర్ ఎగరేస్తారు. ఇరిగేషన్ టాపిక్ అయితే పోలవరం నుంచి పిల్లకాలువల వరకూ తనకు తెలిసినట్లుగా మరెవరికీ తెలియదన్నట్లుగా లెక్చర్లిస్తుంటారు. పార్టీ సభలు, సమావేశాల్లో ఉపన్యాసాలతో ఊదరగొడుతుంటారు. మీడియా సమావేశం ఏర్పాటు చేశారా... విలేకరులకు తలలు బొప్పి కట్టాల్సిందే!!

అనంతలో అవినీతి ప్రకాశాలు
సోదరులిద్దరూ షాడో ఎమ్మెల్యేలు

రెండుసార్లు ఓటమితో ఆర్థికంగా కుదేలైన ఈ తోపు.. మూడోసారి గాలివాటంతో గెలుపొందారు. అయితే.. రెండు ఓటమి ఎఫెక్టులతో అప్పులపాలైన ఈ ప్రజాప్రతినిధి ఒక్క చాన్స్ దక్కడంతో సొమ్ములు పోగేసుకుని అప్పుల నుంచి బయటపడడమే కాదు.. ఏకంగా రూ.500 కోట్ల మేర ఆస్తులను సంపాదించుకున్నారు. వందల ఎకరాలు సొంతం చేసుకున్నారు. పొరుగు రాష్ట్ర రాజధానిలోనూ ఆస్తులు కూడబెట్టుకున్నారు.



- వివాదాస్పద భూములు హస్తగతం
- రియల్టర్ల నుంచి కప్పం వసూళ్లు
- దౌర్జన్యాలు, బెదిరింపులతో కోట్ల ఆర్జన
- షాడో ఎమ్మెల్యేల దెబ్బతో పరిశ్రమలు పరార్
- మహిళల నుంచి వసూళ్లు.. వడ్డీ వ్యాపారం
- అప్పుల్లో నుంచి రూ.వందల కోట్లకు పడగ

(అనంతపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన నియోజకవర్గాల వరుసలోనే ఆ నియోజకవర్గం ఉంటుంది. ఫ్యాక్షన్ ఆనవాళ్లు ఉన్న నియోజకవర్గం కూడా! ఆ ఎమ్మెల్యే ఈ నియోజకవర్గం నుంచి ముచ్చటగా మూడుసార్లు పోటీచేసి.. రెండు సార్లు చతికిలపడి.. మూడోసారి గాలి వాటంగా గట్టెక్కారు. రెండుసార్లు ఓటమితో అప్పుల్లో ఉన్న ఆ ఎమ్మెల్యే కుటుంబం.. అధికారం అండతో రూ.కోట్లకు పడగలెత్తింది. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దోచుడు... దాచుడే ఆ ఎమ్మెల్యే

మిగతా 12వ పేజీలో...

స్వగ్రామానికి వస్తే అరెస్టు చేసే అవకాశం ఉంది

చట్ట నిబంధనలు పాటించేలా పోలీసులను ఆదేశించండి

హైకోర్టును ఆశ్రయించిన ఎంపీ రఘురామ

11

*401# కాల్స్‌తో జాగ్రత్త!

- మీ కాల్స్ ఇంకొకరికి వెళ్లిపోతాయి
- సైబర్ నేరగాళ్ల కాల్‌ఫార్వార్డింగ్ మోసం
- ప్రజలకు టెలికామ్ శాఖ హెచ్చరిక



న్యూఢిల్లీ, జనవరి 11: 'హలో.. నమస్తే సార్/మేడమ్.. మేము మీ టెలికామ్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నాం.. మా సేవలను మీరు ఆనందిస్తున్నారా..? నెట్‌వర్క్ సమస్యలు ఏమైనా ఉన్నాయా..? ఉంటే.. మీ మొబైల్‌లో *401# తర్వాత మేము సూచించిన మొబైల్ నెంబర్ టైప్ చేసి డయల్ చెయ్యండి. మీ సమస్య పరిష్కారం అవుతుంది" అని ఎవరైనా ఫోన్ చేసి మీకు చెబితే.. తొందరపడకండి.. అలా చెయ్యమని ఏ టెలికామ్ సంస్థ మి మ్మల్ని కోరదు. సైబర్ నేరగాళ్ల నయా మోసం ఇది. ఒక వేళ అపరిచిత వ్యక్తి చెప్పినట్టుగా *401# తర్వాత గుర్తు తెలియని నంబర్ టైప్ చేసి డయల్ చేస్తే అంతే సంగతి. మీ సిమ్‌కు రావాల్సిన ఫోన్ కాల్స్ ఆ గుర్తు తెలియని నంబర్‌కు వెళ్లేందుకు అవసరమైన కాల్ ఫార్వార్డ్‌కు మీకు తెలియకుండా మీరు అనుమతించినట్టే. ఇక, ఆ కాల్స్‌ను రిసీవ్ చేసుకున్న వాళ్లు వాటితో సులువుగా మోసాలకు పాల్పడతారు. మీరు బుక్కైపోతారు జాగ్రత్త.. ఈ *401# మోసం పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని టెలికామ్ శాఖ గురువారం ఓ హెచ్చరిక జారీ చేసింది. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపింది. వినియోగదారులు తమ ఫోన్ సెట్టింగ్స్‌లో కాల్ ఫార్వార్డింగ్ ఆప్షన్ ఇనేబుల్‌లో ఉంటే వెంటనే డిసేబుల్ చేసుకోవాలని సూచించింది.

31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు!

- ఫిబ్రవరి 9 వరకు నిర్వహణ

న్యూఢిల్లీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు రంగం సిద్ధమవుతుంది. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 9 వరకు బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. 31న బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ సమావేశాల్లో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. ఈ బడ్జెట్‌లో మహిళా రైతులపై కేంద్రం వరాలు జల్లు కురిపించే అవకాశం కనిపిస్తుంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద మహిళా రైతులకు ఇచ్చే నగదు సాయాన్ని ఈ బడ్జెట్‌లో రెట్టింపు చేయనున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా, బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) ఏ క్షణమైనా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది.

లోకం తీరు



కుటుంబ కథాచిత్రమ్!

(మొదటి పేజీ తరువాయి)

పోటీచేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేశ్ సోదరుడు సతీశ్‌కు కర్నూలు జిల్లా కోడుమూరు (ఎస్సీ) టికెట్ లభించింది. తాజా జాబితాలో తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్యవేడు(ఎస్సీ) అసెంబ్లీ స్థానానికి పంపారు. అక్కడి సిటింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తిరుపతి లోక్‌సభ ఇన్‌చార్జి అయ్యారు. అలాగే గతంలో శ్రీకాకుళం లోక్‌సభకు పోటీచేసిన దువ్వాడ శ్రీనివా‌స్‌ను టెక్కలి అసెంబ్లీకి.. టెక్కలి అసెంబ్లీకి పోటీ చేసిన పేరాడ తిలక్‌ను శ్రీకాకుళం లోక్‌సభకు ఇన్‌చార్జులుగా నియమించారు. ఏలూరులో ఎంపీ కోటగిరి శ్రీధర్ పోటీకి నిరాసక్తత చూపడంతో.. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్‌కు చాన్సిచ్చారు. ఇక టీడీపీ విజయవాడ ఎంపీ కేశినేని నానికి అక్కడే టికెట్ ఇచ్చారు. ఇంతకాలం వైసీపీలో కొనసాగుతున్న పొట్లూరి వరప్రసాదరావును పక్కనపెట్టి.. ఇంకా అధికారికంగా పార్టీ కండువా కూడా కప్పుకోని నానికి అవకాశమిచ్చారు. కర్నూలు లో బీసీ నేత సంజీవ్‌కుమార్‌కు అనుకున్నట్లుగానే మొండిచేయి చూపారు. అక్కడ మంత్రి గుమ్మనూరు జయరాంను ఇన్‌చార్జిగా నియమించారు.

పార్థసారథి అవుట్..

మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి సీఎం జగన్ టికెట్ నిరాకరించారు. ఆయన స్థానంలో మంత్రి జోగి రమేశ్‌ను ఇన్‌చార్జిగా ప్రకటించారు. పెడనలో మంత్రి ఓటమి ఖాయమని సర్వే నివేదికలు చెప్పడంతో.. అయన్ను పెనమలూరుకు బదిలీ చేశారు. పార్థసారథి కూడా ఓడిపోతారని సర్వేల్లో తేలడంతో ఈ దఫా ఆయన్ను మచిలీపట్నం లోక్‌సభ బరిలోకి దించాలని జగన్ తొలుత నిర్ణయించారు. ఆయన్ను తాడేపల్లి పిలిచి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. పెనమలూరు తప్ప ఇంకెక్కడా పోటీచేయనని ప్రకటించినా జగన్ లెక్కచేయలేదు. ఇక చింతలపూడి (ఎస్సీ) ఎమ్మెల్యే ఎలీజాకు హ్యాండిచ్చారు. ఆయన స్థానంలో కంభం విజయరాజుకు అవకాశమిచ్చారు. రాయదుర్గంలో తొలి నుంచి జగన్‌ను నమ్ముకున్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిని కాదని.. ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డికి అవకాశం ఇచ్చారు. రాజంపేటలో సిటింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిని కాదని.. ఎంపీ మిధున్‌రెడ్డి సిఫారసు చేసిన ఆకేపాటి అమర్‌నాథరెడ్డికి అవకాశం కల్పించారు. చిత్తూరులో ఆర్టీసీ చైర్మన్ విజయానందరెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు. సిటింగ్ ఎమ్మెల్యే శ్రీనివాసులుకు నిరాకరించారు.

కుటుంబ కథాచిత్రమ్

వైసీపీ నుంచి పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో.. వైసీపీ మూడో జాబితా కుటుంబ కథా చిత్రమ్‌గా మార్చేశారు. మంత్రి బొత్స ఇప్పటికే చీపురుపల్లి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన సోదరుడు బొత్స అప్పలనరసయ్య గజపతి నగరం ఎమ్మెల్యేగా ఉన్నారు. బొత్స బంధువు బడ్డుకొండ అప్పలనాయుడు నెల్లిమర్ల ఎమ్మెల్యేగా ఉన్నారు. వీరికి మళ్లీ టికెట్లు ఖాయమేనంటున్నారు. మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా, విజయనగరం జిలా పరిషత్ చైర్మన్‌గానూ కొనసాగుతున్నారు. ఇక్కడ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను కాదని మజ్జికి తాజాగా అవకాశమిచ్చారు. విశాఖపట్నం ఎంపీగా బొత్స భార్య ఝాన్సీలక్ష్మికి అవకాశం కల్పించారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే, మంత్రి ఆదిమూలపు సురేశ్‌ను కొండపి ఇన్‌చార్జిగా నియమించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయన సోదరుడు సతీశ్‌ను కోడుమూరు(ఎస్సీ) ఇన్‌చార్జిగా నియమించారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తణుకు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన కుమారుడు కారుమూరి సునీల్‌కుమార్‌కు ఏలూరు లోక్‌సభ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన కుమారుడు మిధున్‌రెడ్డి రాజంపేట ఎంపీగా, పెద్దిరెడ్డి సోదరుడు ద్వారకానాథరెడ్డి తంబళ్లపల్లె ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈ ముగ్గురికీ టికెట్లు దాదాపు ఖాయమే. శ్రీకాకుళం జిల్లాలో ప్రస్తుతం శ్రీకాకుళం అసెంబ్లీ నుంచి మంత్రి ధర్మాన ప్రసాదరావు, నరసన్నపేట నుంచి ఆయన సోదరుడు కృష్ణదాస్ ఎమ్మెల్యేలుగా ఉన్నారు.

పైకి ధీమా..లోలోన డైలమాలో

సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రమంతా దున్నేస్తామని.. 175 అసెంబ్లీ స్థానాల్లోనూ విజయం సాధిస్తామంటూ నేతలతో అంతర్గత సంభాషణల్లో జగన్ ధీమాగా చెబుతున్నారు. ప్రజల్లో వ్యతిరేకత ఉన్న 92 మంది ఎమ్మెల్యేలను మార్చేస్తానని అన్నారు. అయితే సిటింగ్‌ల తిరుగుబాట్లు, వారు ఇతర పార్టీల వైపు చూస్తుండడంతో.. పూర్తి డైలమాలో పడిపోయారు. 175 స్థానాలకు ఒకేసారి ఇన్‌చార్జులను ప్రకటిస్తామని.. విపక్షాలకు అవకాశమే ఇవ్వకుండా ప్రచార రంగంలోకి దూకుదామని పార్టీ నేతలకు చెప్పిన ఆయన.. మూడు విడతల్లో 50 మంది అసెంబ్లీ ఇన్‌చార్జులను, పది మంది లోక్‌సభ ఇన్‌చార్జులను మాత్రమే నియమించగలిగారు. ప్రతి రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, సీఎంవో అధికారి ధనుంజయరెడ్డి తదితరులతో మంతనాలు సాగిస్తున్నారు. ఇదే సమయంలో పలువురు సిటింగ్‌లు, ఆశావహులు తాడేపల్లి చుట్టూ తిరుగుతున్నారు. గురువారం ఎమ్మెల్యేలు బిజేంద్రరెడ్డి(ఆళ్లగడ్డ) చిర్ల జగ్గిరెడ్డి(కొత్తపేట), జక్కంపూడి రాజా(రాజానగరం), కాసు మహేశ్‌రెడ్డి(గురజాల), నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి(కోవూరు), అదీప్‌రాజ్(పెందుర్తి), పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి (మాచర్ల), గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి(నరసరావుపేట), కిలివేటి సంజీవయ్య(సూళ్లూరుపేట), చెట్టి ఫాల్గుణ(అరకు), ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చారు. మంత్రులు కారుమూరు, జోగి రమేశ్ కూడా సీఎంవోకు వచ్చి చర్చించారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలుకు ఈసారి టికెట్ ఇవ్వకూడదనే ఆలోచనతో ఎమ్మెల్యేలు కాసు మహేశ్‌రెడ్డి, పిన్నెల్లి, గోపిరెడ్డిల అభిప్రాయాలు తెలుసుకున్నారు. లావుకు ఇవ్వడమే మంచిదని పిన్నెల్లి, గోపిరెడ్డి సూచించినా.. రాష్ట్ర విద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాగార్జున యాదవ్‌కు ఇస్తే బాగుంటుందని జగన్ అనుకుంటున్నట్లు తెలిసింది.

లోక్‌సభ ఇన్‌చార్జులు వీరే..

లోక్‌సభ నియోజకవర్గం	గత అభ్యర్థి	ప్రస్తుత ఇన్‌చార్జి
శ్రీకాకుళం	దువ్వాడ శ్రీనివాస్	పేరాడ తిలక్
విశాఖపట్నం	ఎంవీవీ సత్యనారాయణ	బొత్స ఝాన్సీ లక్ష్మీ
విజయవాడ	పొట్లూరి వరప్రసాద్	కేశినేని నాని
కర్నూలు	సంజీవ్‌కుమార్	గుమ్మనూరు జయరాం
తిరుపతి	మద్దిల గురుమూర్తి	కోనేటి ఆదిమూలం
ఏలూరు	కోటగిరి శ్రీధర్	కారుమూరి సునీల్ కుమార్ యాదవ్

15 మంది అసెంబ్లీ ఇన్‌చార్జులు..

అసెంబ్లీ నియోజకవర్గం	గత అభ్యర్థి	ప్రస్తుత అభ్యర్థి
ఇచ్ఛాపురం	పిరియా సాయిరాజ్	పిరియా విజయ
చింతలపూడి	ఎలీజా	విజయరాజు
దర్శి	మద్దిశెట్టి వేణుగోపాల్	బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
టెక్కలి	పేరాడ తిలక్	దువ్వాడ శ్రీనివాస్
రాయదుర్గం	కాపు రామచంద్రారెడ్డి	మెట్టు గోవిందరెడ్డి
పూతలపట్టు (ఎస్సీ)	ఎం.బాబు	మూతిరేవుల సునీల్‌కుమార్
చిత్తూరు	ఆరణి శ్రీనివాసులు	విజయానందరెడ్డి
రాజంపేట	మేడా మల్లికార్జునరెడ్డి	ఆకేపాటి అమర్నాథరెడ్డి
ఆలూరు	గుమ్మనూరు జయరాం	బూసిన విరూపాక్షి
కోడుమూరు (ఎస్సీ)	జరదొడ్డి సుధాకర్	డాక్టర్ సతీశ్
గూడూరు (ఎస్సీ)	వరప్రసాదరావు	మేరిగ మురళి
సత్యవేడు	కోనేటి ఆదిమూలం	మద్దిల గురుమూర్తి
పెనమలూరు	కొలుసు పార్థసారథి	జోగి రమేశ్
పెడన	జోగి రమేశ్	ఉప్పాల రాము
మదనపల్లె	మహమ్మద్ నవాజ్‌బాషా	నిస్సార్ అహ్మద్

చప్పుడు చేయని సూపర్ సానిక్!

కొత్త తరం విమానం ఎక్స్-59.. రూపొందించిన నాసా, లాఖీడ్ మార్టిన్

- శబ్దాన్ని నియంత్రించే డిజైన్.. 75 డెసిబిల్స్‌కు పరిమితం
- వేగం గంటకు 1,509 కిలోమీటర్లు
- రేపు వేకువజామున 2.30కి టెస్ట్ రైడ్
- నాసా వెబ్‌సైట్‌లో ప్రత్యక్ష ప్రసారం



(సెంట్రల్ డెస్క్)

కాలం గడుస్తున్న కొద్దీ మానవ సమాజం వేగం పెరుగుతోంది. గగనతల ప్రయాణాన్నే తీసుకుంటే.. హెలికాప్టర్లు వచ్చాయి.. వాటిని మించిన విమానాలు వచ్చాయి.. వాటిని తలదన్నే విధంగా ధ్వనిని మించిన వేగంతో దూసుకెళ్లే సూపర్ సానిక్‌లు కూడా వచ్చేశాయి. సూపర్ సానిక్‌లు వేగంలో రికార్డులు సృష్టించాయిగానీ.. విపరీతమైన చప్పుడుతో కొత్త సమస్యనూ తీసుకొచ్చాయి. అవి ప్రయాణించే మార్గంలో భూమ్మీద ఉన్న జనం వాటి మోత భరించలేకపోవటంతోపాటు ఇళ్లు, భవనాల కిటికీల అద్దాలు కూడా పగిలిపోయే పరిస్థితి తలెత్తింది. దీంతో సూపర్ సానిక్‌లు తాత్కాలికంగా రిటైరయ్యాయి. ప్రస్తుతం వాటిని తిరిగి రంగంలోకి తీసుకురావటానికి అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) సంకల్పించింది. శబ్దం సమస్యను పరిష్కరించే కొత్త విమానాన్ని సిద్ధం చేసింది. దాని పేరు ఎక్స్-59. ఈ కొత్తతరం సూపర్ సానిక్‌ను యావత్ ప్రపంచం సాక్షిగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు (భారతీయ కాలమానం ప్రకారం శనివారం తెల్లవారు జామున 2.30 గంటలకు) ప్రయోగాత్మకంగా నడపనుంది. ఇది విజయవంతమైతే విమానయాన రంగంలో మరో కొత్త అధ్యాయం మొదలవుతుంది.

2016లో ప్రాజెక్టు ప్రారంభం

2016లో 'క్వైట్ సూపర్ సానిక్ టెక్నాలజీ' (క్వెస్ట్ - ఖ్యూఖిఖిఖీ) పేరుతో పెద్దగా చప్పుడు చేయని సూపర్ సానిక్ విమానాన్ని తయారుచేసే ప్రాజెక్టుకు నాసా శ్రీకారం చుట్టింది. దానిని రూపొందించే కాంట్రాక్టును అమెరికా కంపెనీ లాఖీడ్ మార్టిన్ కంపెనీకి 2018లో అప్పగించింది. ఈ కాంట్రాక్టు విలువ 24.75 కోట్ల డాలర్లు (రూ. 2,056 కోట్లు) చాలా రహస్యంగా 'స్కంక్ వర్క్స్ డివిజన్'లో విమానం తయారీ పనులు ప్రారంభమయ్యాయి. ప్రతీ దశలో నాసాలోని పలు విభాగాలు అనేక పరీక్షలు జరిపాయి. మార్పులు చేర్పులు జరిగాయి. ఎక్స్-59గా నామకరణం చేసిన ఈ సూపర్ సానిక్ విమానం.. ఇంతకుముందటి సూపర్ సానిక్ విమానాల కన్నా సైజులో చిన్నది. దీని పొడవు 95 అడుగులు కాగా, వెడల్పు 30 అడుగులు. బరువు 14,700 కిలోలు. దీంట్లో జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీకి చెందిన ఎఫ్4-14 ఇంజిన్‌ను అమర్చారు. విమానం వేగం గంటకు 1,509 కిలోమీటర్లు. సాధారణ సూపర్ సానిక్ విమానాల నుంచి వెలువడే శబ్దం (సానిక్ బూమ్) 110 డెసిబిల్స్ కాగా, ఎక్స్-59 నుంచి 75 డెసిబిల్స్ కన్నా పెద్ద శబ్దం రాదని నాసా ప్రకటించింది. శబ్దాన్ని తగ్గించటం కోసమే ప్రత్యేకంగా తయారైన ఎక్స్-59 ఆకారం కూడా సాధారణ విమానాలకు భిన్నంగా ఉంటుంది. ఎక్స్-59 ముందుభాగం సన్నగా తీగలాగా ఉంటుంది. విమానం పొడవులో దాదాపు సగం ఈ భాగమే. విమానం ముందుభాగంలో పుట్టే షాక్‌వేవ్స్, వెనక భాగంలో పుట్టే షాక్‌వేవ్స్‌తో కలిసిపోకుండా ఈ ఏర్పాటు చేశారు. ముందుభాగం సన్నగా ఉండటం వల్ల అక్కడ కాక్‌పిట్ (పైలట్ కూర్చునే చోటుకు) ఏర్పాటుకు అవకాశం లేదు. విమానం మధ్యలో ఈ ఏర్పాటు చేశారు. అయితే, పైలట్ ఎదుట అన్ని విమానాల్లో ఉన్నట్టుగా అద్దం ఉండదు. దానికి బదులు ఒక తెర ఉంటుంది. దానిపై విమానం ఎలా వెళ్తుందో కనిపిస్తుంది. ఇందుకోసం ఎక్స్-59 ముందు సన్నటి భాగంలో రెండు శక్తిమంతమైన కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇవి విమానం ముందున్న పరిస్థితులను రికార్డు చేసి ప్రత్యక్షప్రసారం చేస్తుంటాయి. ఆ దృశ్యాలను తెర మీద చూస్తూ పైలట్ విమానాన్ని నడపాల్సి ఉంటుంది. అమెరికాలో ఇప్పటికే ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాల మీద ఎక్స్-59 టెస్ట్ రైడ్ జరగనుంది. దీని తర్వాత.. విమానం నుంచి వెలువడిన శబ్దం గురించి ఆయాప్రాంతాల ప్రజల అభిప్రాయాలను సేకరిస్తారు. కారు తలుపు వేస్తే ఎంత శబ్దం వస్తుందో.. అంతకు మించిన శబ్దం ఎక్స్-59 నుంచి రాకపోవచ్చని నాసా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రజల అభిప్రాయాలను సేకరించిన తర్వాత వాటిని, విమానయాన రంగ నియంత్రణ సంస్థలకు (రెగ్యులేటర్లకు) నాసా అందిస్తుంది. వాటిని అధ్యయనం చేసిన అనంతరం, సూపర్ సానిక్ వాణిజ్య విమానాల మీద ప్రస్తుతం ఉన్న నిషేధాన్ని కొనసాగించాలా? వద్దా? కొత్త నిబంధనలు తీసుకురావాలా? అన్నదానిపై నియంత్రణ సంస్థలు నిర్ణయం తీసుకుంటాయి.

2035 నాటికి వినియోగంలోకి..

నాసా చేపట్టే ప్రయోగం విజయవంతం అయినా కూడా ఎక్స్-59 విమానయాన రంగంలోకి రావటానికి మరో పదేళ్లకు పైగా పట్టే అవకాశం ఉంది. 2035 నాటికి గానీ ఇది అందుబాటులోకి రాకపోవచ్చని లాఖీడ్ మార్టిన్ స్కంక్ వర్క్స్ మేనేజర్ గతంలో చెప్పటం విశేషం. ఎందుకంటే, సూపర్ సానిక్ విమానాలతో శబ్దం ఒక్కటే సమస్య కాదు.. భారీ ఎత్తున వెలువడే కర్బన ఉద్గారాలు, పెద్ద మొత్తంలో ఖర్చయ్యే ఇంధనం కూడా సవాళ్లే. ప్రస్తుతానికి నాసా వీటి మీద దృష్టి పెట్టటం లేదు. ముఖ్యమైన సమస్య అయిన శబ్దాన్ని తగ్గించిన తర్వాత మిగిలిన వాటిని పరిష్కరించే యోచనలో ఉంది. ఎక్స్-59 టెస్ట్ రైడ్‌ను నాసా ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. నాసా యాప్, వెబ్‌సైట్, స్ట్రీవింగ్ సర్వీస్‌లలో లైవ్‌ను చూడవచ్చని పేర్కొంది.



ట్యుపొలెవ్ టీయూ-144

రెండో ప్రపంచయుద్ధ కాలంలో పరిశోధనలు

ధ్వని తరంగాల వేగం గంటకు 1,235 కి.మీ.లు. దీనినే ఒక మ్యాక్ అని కూడా పిలుస్తారు. ఒక మ్యాక్‌ను మించిన వేగంతో ప్రయాణించే విమానాలను సూపర్ సానిక్ విమానాలంటారు. రెండో ప్రపంచయుద్ధ కాలంలో వీటి మీద పరిశోధనలు మొదలయ్యాయి. 1950-60ల నాటికి ఇవి ఉనికిలోకి వచ్చాయి. ప్రధానంగా సైనిక, పరిశోధన అవసరాలకు వీటిని వినియోగించారు. 1968 డిసెంబరు 31వ తేదీన తొలిసారిగా పౌర విమానయాన రంగంలోకి ఓ సూపర్ సానిక్ విమానం ప్రవేశించింది. దాని పేరు ట్యుపొలెవ్ టీయూ-144. దీనిని నాటి సోవియట్ యూనియన్ తయారు చేసింది. బ్రిటన్-ఫ్రాన్స్ సంయుక్తంగా రూపొందించిన కాంకార్డ్ అనే మరో సూపర్ సానిక్ విమానం మరుసటి ఏడాది అందుబాటులోకి వచ్చింది. శబ్ద కాలుష్యం, వాతావరణ కాలుష్యం, తయారీకి భారీ వ్యయం, విపరీతంగా ఉండే నిర్వహణ ఖర్చు మొదలైన కారణాలతో పౌరవిమానయాన రంగంలో సూపర్ సానిక్‌లు ఎక్కువ కాలంపాటు కొనసాగలేదు. 1978లో ట్యుపొలెవ్ టీయూ-144, 2003లో కాంకార్డ్ సేవలు నిలిచిపోయాయి. సూపర్ సానిక్‌ల సమస్యలను పరిష్కరించి వాటిని పౌర విమానయాన రంగంలోకి తీసుకురావటంపై పెద్ద ఎత్తున పరిశోధనలు జరుగుతున్నాయి. కాగా యుద్ధవిమానాలన్నీ సూపర్ సానిక్ విమానాలే.

సమస్యలా? మతమా?

(మొదటి పేజీ తరువాయి)

పిలుపునిచ్చారని ఆయన గుర్తు చేశారు. తమ పార్టీ నేతలు హాజరైనా వారిని విమర్శిస్తూనే ఉంటారని పేర్కొన్నారు. "మందిర ప్రారంభానికి వెళ్లడంపై మేధావులతో చర్చించాం. మందిరాన్ని బీజేపీ ఎలాగూ ప్రచారాస్త్రం చేస్తుంది. కాబట్టి ప్రారంభానికి దూరంగా ఉండడమే సముచితమని వారు చెప్పారు. వెళ్లినా, వెళ్లకున్నా మాకు వచ్చే ప్రయోజనం లేదని భావించే గైర్హాజరవుతున్నాం. మతాన్ని రాజకీయాలకు వాడుకోవడం రాజ్యాంగ వ్యతిరేకమని సుప్రీంకోర్టు 2017లోనే తీర్పునిచ్చింది. బీజేపీ దానికి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. మందిరాన్ని బీజేపీ ఎన్నికల అంశం చేస్తే.. ప్రజలు కోల్పోయిన సామాజిక, ఆర్థిక న్యాయం గురించి మేం ప్రస్తావిస్తాం" అని ఆ సీనియర్ నేత చెప్పుకొచ్చారు. మత భావోద్వేగాలను సృష్టించడం రాజ్యాంగ వ్యతిరేకమని ప్రచారం చేస్తామన్నారు. బీజేపీకి మతం తప్ప ప్రజల సమస్యలు తెలియవని చెబుతామని తెలిపారు.

ప్రజల్లో చర్చకు పెడతాం..

రామ మందిరాన్ని బీజేపీ అంశంగా చేసుకుంటే.. సమస్యల పరిష్కారం ముఖ్యమా? మతం పేరుతో మోసపోవడం ముఖ్యమా? అని ప్రజల్లో చర్చకు పెడతామని సీనియర్ తెలిపారు. మత ప్రాతిపదికన ఓటు వేసే పరిస్థితులు దేశంలో పూర్తిగా లేవని విశ్లేషించారు. ఉత్తరాదిలోని కొన్ని ప్రాంతాల్లో తప్ప మిగతా చోట్ల హిందూత్వ పేరుతో బీజేపీకి ప్రయోజనం లభించే అవకాశాలు తక్కువేనని చెప్పారు. హిందూత్వ బీజేపీ సొత్తు కాదని కూడా ప్రచారం చేస్తామని ఆయన అన్నారు. 'మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ గెలవకున్నా ఓట్లు తగ్గలేదు. ఇక్కడ బీజేపీకి గతంలో వచ్చినన్ని ఎంపీ సీట్లు ఈసారి కష్టమే. ఈసారి మైనారిటీలు ఇండియా కూటమికి సంఘటితంగా ఓటు వేస్తారు. బీసీలు, దళితులు కూడా మా వైపు మొగ్గుచూపుతున్నారు. బిహార్‌లో బలమైన ఆర్‌జేడీ, జేడీ(యూ), కాంగ్రెస్ కూటమిని దెబ్బతీయలేరు. యూపీలో ఎస్పీ, కాంగ్రెస్, బీఎస్పీ కలిస్తే బీజేపీ సీట్ల సంఖ్య గతంలో కంటే తగ్గిపోతుంది' అని చెప్పుకొచ్చారు. 'ఢిల్లీ, పంజాబ్, గుజరాత్, గోవా తదితరచోట్ల ఆప్, కాంగ్రెస్ కలిస్తే బీజేపీ సీట్లు తగ్గుతాయి. మిత్రపక్షాల పట్ల సుహృద్భావంతో వ్యవహరిస్తున్నాం. పేచీ పెట్టకుండా కలిసి పోటీ చేసేందుకే ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రతి సీటుపై ఆచరణీయ వైఖరితో వెళ్తున్నాం. గెలుస్తామన్న ధీమా ఉన్న చోటనే వనరులను ఉపయోగిస్తాం. సాధ్యమైనంత త్వరలో మా సీట్లను నిర్ణయిస్తాం. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు పూర్తి కాగానే ఇండియా కూటమి నేతలు దేశవ్యాప్త ప్రచారం ప్రారంభిస్తారు. బీజేపీతో ముఖాముఖి, ఇతర ప్రాంతీయ పార్టీలతో పోటీ పడే 255 సీట్లపై దృష్టి కేంద్రీకరించి అందులో సగానికిపైగా గెలుచుకునేందుకు ప్రయత్నిస్తాం" అని సీనియర్ నేత తెలిపారు. కనీసం 140 స్థానాల్లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. దక్షిణాదిన ఎంత ప్రయత్నించినా బీజేపీ గెలుపు కష్టమని.. కర్ణాటకలో పదిసీట్లు వస్తే మహా ఎక్కువని అన్నారు. తెలంగాణలో నాలుగు సీట్లను నిలబెట్టుకోలేదని, అక్కడ పోటీకి నాయకులే లేరని చెప్పారు. తమిళనాడు, కేరళలో బీజేపీ సాధించేది శూన్యమని చెప్పారు.

నిబంధనలు పాటించలేదు.. అంతా రాజకీయాలే

- రామాలయ ప్రారంభోత్సవానికి వెళ్లం: నిశ్చలానంద

న్యూఢిల్లీ, జనవరి 11: అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరు కావడానికి పూరీ గోవర్ధన మఠం పీఠాధిపతి నిశ్చలానంద సరస్వతి నిరాకరించారు. ఈ కార్యక్రమంలో అవసరమైన నిబంధనలు ఏమీ పాటించలేదని పేర్కొన్నారు. రాజకీయ కోణంలో సాగుతున్న ఈ కార్యక్రమానికి తాము దూరంగా ఉంటామని ప్రకటించారు. "గర్భగుడిలో ఉండి ప్రధాని మోదీ విగ్రహాన్ని తాకుతారు. ఇందులో రాజకీయ కోణం ఉంది. రాముడి ప్రతిష్ఠను హుందాగా నిర్వహించాలి. మేము దీన్ని వ్యతిరేకించట్లేదు. అలాగని ఈ కార్యక్రమానికి హాజరు కావట్లేదు" అని స్పష్టం చేశారు. ఈ విషయంలో తన అభిప్రాయాలు మాత్రమే చెప్పానని, అంతా సజావుగా సాగాలని కోరుకుంటున్నామని నిశ్చలానంద పేర్కొన్నారు.

కోడిపందేలు చూడాలంటే టికెట్ రూ.5వేలు

భీమవరం క్రైం, జనవరి 11: సంక్రాంతి పండగ దగ్గర పడుతుండటంతో పశ్చిమ గోదావరి జిల్లాలో కోడి పందేల కోసం నిర్వాహకులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. కొన్ని చోట్ల బరులు ఏర్పాటు చేస్తే పోలీసులు వాటిని ధ్వంసం చేసి అక్కడ నిషేధం అంటూ బ్యానర్లు పెడుతున్నారు. జిల్లా అంతటా గతంలో కోడిపందేలు, పేకాట నిర్వాహకులపై బైండోవర్ కేసులు పెట్టారు. ఈ ఏడాది మాత్రం కోడిపందేలు వీక్షించాలంటే టికెట్ తప్పనిసరి అంటూ ప్రచారం జరుగుతోంది. బరుల వద్దకు వచ్చేవారు రూ.5వేలు పెట్టి టికెట్ కొనుగోలు చేస్తేనే లోపలికి ఎంట్రీ అని కొందరు నిర్వాహకులు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వం ఈ ఏడాది పెద్ద ఎత్తున బరులకు అనుమతిస్తుందని, దాన్ని క్యాష్ చేసుకోవాలని కొందరు చూస్తున్నట్లు సమాచారం. గత ఏడాది కోడిపందేల బరులు వద్ద కోతాట నిషేధించారు. అయితే ఈ ఏడాది పెద్ద ఎత్తున కోతాటలకు సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం.

బాదుడులో బాద్షా!

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలో ఉన్నప్పుడు నిత్యావసర రేట్లకు, జగన్ సర్కారు వచ్చిన తర్వాత పెరిగిన రేట్లకు మధ్య భారీ వ్యత్యాసం ఉంది. దీంతోపాటు ప్రభుత్వం వివిధ పన్నులు, విద్యుత్ చార్జీలు, ప్రభుత్వం అమ్ముతున్న మద్యం రేట్లు పెరగడంతో అదనంపు భారం తప్పలేదు. ఒక సగటు కుటుంబం ప్రస్తుతం ప్రతినెలా నిత్యావసర సరుకుల కోసం ఎంత ఖర్చు చేస్తోంది.. చంద్రబాబు హయాంలో ఆయా కుటుంబాలకు ఎంత ఖర్చయ్యేది.. అప్పటికీ, ఇప్పటికీ వ్యత్యాసమెంత?... ఆ కుటుంబాలపై ప్రభుత్వం విధించిన పన్నులు గతంలో ఎంత మేర ఉన్నాయి.. జగన్ సర్కారు వచ్చిన తర్వాత అదనపు భారం ఎంత అని లెక్కిస్తే సామాన్యులపై ఈ సర్కారు విపరీతమైన భారం మోపిందని తేలుతోంది. నవరత్నాలు పేరుతో కొంతమందికి ప్రయోజనం కల్పించి ఏపీ ప్రజలందరిపైనా పెనుభారం మోపారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

సగటు కుటుంబంపై ఇంత పగా?

రాష్ట్రంలో 1.50 కోట్ల కుటుంబాలున్నాయి. సరాసరిన ఆలుమగలు, ఇద్దరు పిల్లలు కలిగిన ఒక కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుంటే నెలకు ఆ కుటుంబానికి నిత్యావసరాలకు ఎంత ఖర్చు అవుతుందో, గతంలో ఆ కుటుంబాలు చెల్లిస్తున్న పన్నులు, ఇప్పుడు అదనంగా చెల్లించేది లెక్కిస్తే ఒక్కో కుటుంబంపై 54 నెలల్లో అదనంగా రూ. 2,67,516 ఖర్చయినట్లు తేలింది. నవరత్నాల ద్వారా ఆయా కుటుంబాలకు వస్తున్న ప్రయోజనాలతో పోలిస్తే జనాలపై పిండిందే ఎక్కువగా ఉంది.

చెత్త నుంచి ఆస్తి దాకా బాదుడే...


పెట్రోల్‌పై రాష్ట్ర ప్రభుత్వం సర్‌చార్జీ అదనంగా రూ.2 వడ్డించి ప్రజలపై అదనపు భారం మోపింది. మున్సిపాలిటీలు, పంచాయతీల ప్రధాన బాధ్యత పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్ వీధిదీపాల ఏర్పాటు. అయితే వైసీపీ సర్కారు వచ్చిన తర్వాత చెత్తకు సైతం పన్నులు వేసి ప్రైవేట్ కాంట్రాక్టర్లకు ఆ ఆదాయం కట్టబెట్టింది. ఇంటిపన్ను గతంలో సాధారణ కుటుంబానికి రూ.200 వరకు ఉండేది. ఇప్పుడు ఆస్తి విలువను లెక్కించి పన్నులు వసూలు చేయడంతో అది సామాన్యులకు భారమైంది. చంద్రబాబు ఫైబర్‌నెట్ ద్వారా ఇంటర్నెట్, టీవీలకు నెలకు రూ.149 వసూలు చేస్తే ఈ సర్కారు వచ్చాక దాన్ని 350కు పెంచారు.

మద్యం ఖర్చు డబుల్

మధ్యతరగతి, దిగువ స్థాయితో పాటు అన్నీ కేటగిరీల్లో 50 శాతం కుటుంబాల్లో మద్యం సేవించే వాళ్లు ఉన్నారు. గతంలో ఓ మోస్తరు క్వాలిటీ మందు రేటు రూ.60 ఉంది. జగన్ ఖజానాను నింపుకొనేందుకు భారీగా రేట్లు పెంచి రూ.160 చేశారు. మద్యం ప్రియులు సగటున 20 రోజులు మద్యం సేవిస్తే నెలకు అదనంగా మద్యంపై రూ.2వేలు ఖర్చవుతోంది. ఇలా ఒక్కో కుటుంబానికి నెలకు సాధారణంగా అవుతున్న ఖర్చు కంటే అదనంగా రూ.4,954 వైసీపీ సర్కార్ హయాంలో అవుతోంది.

కోతలే ఎక్కువ..

నవరత్నాల ద్వారా 99.5 శాతం మందికి సంక్షేమ పథకాలు అమలుచేశామని వైసీపీ సర్కారు చెబుతున్న మాటలు వాస్తవం కాదని స్పష్టమవుతోంది. అమ్మఒడి నాలుగేళ్లు అందరికీ ఇచ్చిన దాఖలాల్లేవు. ఒక కుటుంబానికి మూడేళ్లు ఇస్తే, మరో కుటుంబానికి రెండేళ్లు ఇచ్చి సరిపెట్టారు. అదే విధంగా ఆరంచెల వ్యవస్థలను తీసుకొచ్చి ప్రతి లబ్ధిదారుకు ఒక ఏడాదో, రెండేళ్లో ఈ పథకాలివ్వ లేదు. కొన్నికుటుంబాలు సంక్షేమ పథకాలు అసలే పొందలేదు. అయితే ఆకుటుంబాలపై భారం మాత్రం పడింది.



బాబు హయాంలో కిలో ధర		జగన్ పాలనలో కిలో ధర	వ్యత్యాసం	నెల వాడకం	అదనపు భారం ఒక నెలకు
బియ్యం	40	55	15	25 కిలోలు	375
కందిపప్పు	40	180	140	ఒక కిలో	140
వంటనూనె	89	120	31	3 లీటర్లు	93
పెసరపప్పు	86	120	34	ఒక కిలో	34
మినప పప్పు	79	130	53	ఒక కిలో	53
పంచదార	26	44	18	ఒక కిలో	36
వేరుశనగపప్పు	80	140	60	ఒక కిలో	60
చింతపండు	122	210	88	ఒక కిలో	88
కూరగాయలు, పళ్లు (సగటున)	500	1200	700	సగటున	700
పెట్రోల్	76	112	36	15 లీటర్లు	540
గ్యాస్	746	970	224	ఒక సిలిండర్	224
విద్యుత్‌చార్జీలు	200	500	300	సగటు ధర	300
చెత్తపన్ను	0	60	60	కొత్తగా బాదుడు	60
ఇంటి పన్ను (ఏడాదికి)	200	800	600	నెలకు రూ.50	50
ఫైబర్ నెట్/కేబుల్	149	350	201	బాదుడు	201
మద్యం (క్వార్టర్)	60	160	100	20రోజులు	2000

ఒక నెలకు ఒక పేద కుటుంబంపై జగన్ మోపిన సగటు అదనపు భారం రూ. 4954

54 నెలల్లో ఒక్కో కుటుంబంపై జగన్ మోపిన అదనపు భారం (రూ.4954 X 54 నెలలు = 2,67,516

సాయిప్రసాద్ అవుట్!

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వు ఇచ్చింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఆ పోస్టులో ఆయనే కొనసాగుతారని సీఎస్ పేర్కొన్నారు. ప్రస్తుతం సాయిప్రసాద్ సెలవులో ఉన్నారు. కుమార్తె పెళ్లిపనుల్లో ఆయన తీరిక లేకుండా ఉన్నారు. ఇటు సీసీఎల్ఏగా, అటు రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఐఏఎస్ ఇంతియాజ్‌కు అదనపు బాధ్యతలు అప్పస్తూ ఈ నెల 4వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు (జీవో 18) జారీ చేసింది. సాయిప్రసాద్ సెలవు ముగించుకుని తిరిగొచ్చాక ఈ జోడు పదవుల్లో కొనసాగుతారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి చాలా స్పష్టంగా అందులో పేర్కొన్నారు. సరిగ్గా వారం రోజుల వ్యవధిలో ఏం జరిగిందో.. అజయ్ జైన్ తెరపైకి వచ్చారు. జైన్ ప్రస్తుతం గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఓ ముఖ్య అధికారికి, సాయిప్రసాద్‌కు ఇటీవలి కాలంలో తీవ్ర విభేదాలు పొడసూపినట్లు తెలిసింది. తన వద్ద పనిచేసే అధికారి మాటలకే ముఖ్యమంత్రి విలువ ఇస్తున్నట్లు తెలిసింది. నాలుగైదు రోజుల క్రితమే సాయిప్రసాద్‌ను మార్చాలన్న ప్రతిపాదనలు రాగా ఎందుకో ముందుకు సాగలేదు. కానీ గురువారం సదరు ముఖ్య అధికారి పట్టుబట్టి మరీ ఈ ఉత్తర్వు ఇప్పించినట్లు ఐఏఎస్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

సీఎస్ తర్వాత రెండో స్థానం

ప్రభుత్వంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తర్వాత సీసీఎల్ఏ పోస్టు నంబర్ టూ. లోగడ మన్మోహన్ సింగ్ ఇటు రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, సీసీఎల్ఏగా ఏక కాలంలో రెండు పోస్టులు నిర్వహించారు. ఆయన రిటైరయ్యేవరకు వాటిలో కొనసాగారు. తర్వాత నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను కూడా రెండు పదవుల్లో కొంతకాలం కొనసాగించారు. రెవెన్యూలోనే ఓ జూనియర్ అధికారి రాజేసిన మునలంతో నీరబ్‌ను రెండు పోస్టుల నుంచి తప్పించి... అటవీశాఖకు పంపుతూ ఉత్తర్వు ఇచ్చారు. అది జరిగిన 48 గంటల్లోనే ఆయన్ను తిరిగి సీసీఎల్ఏగా కొనసాగిస్తూ మరో ఉత్తర్వు ఇచ్చారు. కొద్దిరోజుల తర్వాత ఆయన్ను ఆ పోస్టు నుంచి కూడా తీసేసి తిరిగి అటవీశాఖకు పంపించారు. తర్వాత సాయిప్రసాద్‌ను నియమించారు. ఈయనకూ రెండు పోస్టులు ఇచ్చారు. సీఎంవో ముఖ్య అధికారితో పలు అంశాల్లో ఆయనకు అభిప్రాయ భేదాలు తలెత్తినట్లు తెలిసింది. తన మాట వినడం లేదని సదరు అధికారి సీఎంకు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. తొలుత జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోలేదు. ఇప్పుడు సాయిప్రసాద్ సెలవులో ఉన్న సమయం చూసి ఆయన్ను రెవెన్యూ నుంచి తప్పించడంలో ఆ అధికారి కృతకృత్యులయ్యారు. నిజానికి ఆయన గత ప్రభుత్వంలో చంద్రబాబు వద్ద ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో సీఎంవోలో పనిచేశారు. జగన్ సర్కారు వచ్చాక చంద్రబాబు వద్ద పనిచేసిన అధికారులకు కీలకపోస్టులు ఇవ్వలేదు. కానీ సాయిప్రసాద్‌ను తొలుత విద్యుత్ శాఖలో, ఆ తర్వాత రెవెన్యూలో నియమించారు. ప్రభుత్వంలో సీఎస్ తర్వాత నంబర్ 2 పోస్టు అయిన సీసీఎల్ఏగా ఆయనకు అవకాశం ఇచ్చారు. కానీ సీఎంవోలో పనిచేసే అధికారితో మొదలైన వివాదం అనేక మలుపులు తిరిగి చివరకు పోస్టు నుంచి తప్పించేదాకా వెళ్లినట్లు ఐఏఎస్ వర్గాలు చెబుతున్నాయి. కాగా.. గతంలో సీఎస్‌గా పనిచేసిన ఎల్వీ సుబ్రహ్మణ్యం, డీజీపీ గౌతమ్ సవాంగ్, ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్ పీవీ రమేశ్, స్పెషల్ సీఎస్ నీరబ్‌కుమార్‌లను రాత్రికి రాత్రి బదిలీ చేసిన జగన్.. ఇప్పుడు సెలవులో ఉన్న సాయిప్రసాద్‌పై గురిపెట్టారన్న చర్చ ఐఏఎస్ వర్గాల్లో సాగుతోంది.

సంక్రాంతి ప్రజల జీవితాల్లో వెలుగు నింపాలి: సీఎస్

- రాష్ట్ర సచివాలయంలో ఘనంగా సంబరాలు

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే సంక్రాంతి పండుగ రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆకాంక్షించారు. గురువారం అమరావతి సచివాలయంలో ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఎస్ మాట్లాడుతూ ఈ సంక్రాంతితో రాష్ట్ర ప్రజలు, రైతుల్లో సుఖ సంతోషాలు, శాంతి, ఆనందం వెల్లివిరియాలన్నారు. మానవాళికి ఆదర్శంగా నిలిచే శ్రీరాముడి జన్మభూమి అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠాపన జరగనుండడంతో ఈ ఏడాది ఎంతో ప్రాధాన్యం సంతరించుకుందని పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులు నిర్వహించిన ముగ్గుల పోటీలు, హరిదాసు, గంగిరెద్దు, ఎడ్ల బండి, కత్తిసాము, తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శనలను సీఎస్ తిలకించారు. సంక్రాంతి సందర్భంగా మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మలిశెట్టి అనూషానాయుడు కూచిపూడి నృత్యప్రదర్శన, భవిరి రవి మిమిక్రీ, సచివాలయ ఉద్యోగులతో శ్రీకృష్ణ రాయబారం పద్యనాటక ప్రదర్శనలు నిర్వహించారు. సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షులు సత్యసులోచన, కార్యదర్శి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి 10 మందిని పంపండి

- అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు జనసేకరణ చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు
- లేకపోతే చర్యలు తప్పవంటూ హెచ్చరిక
- నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ 'సామాజిక సమతా సంకల్పం' కార్యక్రమానికి ప్రతి గ్రామ సచివాలయం నుంచి ఐదు నుంచి 10 మంది జనాల్ని పంపించాలని ఆదేశాలిచ్చారు. పాటించకపోతే చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు మండిపడుతున్నారు. ఇదెక్కడి గోల అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమాలు చేపట్టగలం కానీ, జనాల సమీకరణ తమ వల్ల కాదని పేర్కొంటున్నారు. ఇప్పటికే పలు సభలకు జనాభాను తీసుకొచ్చే బాధ్యతలు అప్పజెప్పడంతో తాము ప్రజల వద్ద పలచన అయ్యామని, ఇప్పుడు విజయవాడలో జరిగే కార్యక్రమానికి కూడా జనసమీకరణ బాధ్యత అప్పజెప్తే తాము ఈ ఉద్యోగాలు చేయలేమని వాపోతున్నారు. 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం పెట్టి వారిని మోటివేట్ చేసేందుకు నానా తంటాలు పడుతున్నామని, రోజుకో కార్యక్రమం ఏర్పాటు చేసి సతాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు జిల్లాలో 91 సచివాలయాల పరిధిలో సిబ్బంది ఈ కార్యక్రమానికి జనాల్ని సమీకరించేందుకు సిటిజన్ రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌లో నమోదు చేయలేదన్న కారణంతో వారికి మెమో పంపించారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా జనసమీకరణకు సైతం ఉద్యోగులపై సర్కార్ ఒత్తిడి తెస్తుండటంతో సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇదే విధంగా వ్యవహరిస్తే తాము కూడా సర్కార్‌కు వ్యతిరేకంగా నిరసనలు తెలియజేయాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

ఆర్థిక బకాయిలపై ఉద్యమం

- యూటీఎఫ్

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలపై ఉద్యమాన్ని కొనసాగించనున్నట్లు యూటీఎఫ్ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల చేపట్టిన 36 గంటల నిరసన దీక్షను ప్రభుత్వం అప్రజాస్వామికంగా భగ్నం చేసిందని, అయినా ఉద్యమాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ నెల 14న ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని భోగి మంటల్లో దగ్ధం చేస్తామని, 19న అన్ని పట్టణాలు, తాలూకా కేంద్రాల్లో నిరసనలు చేస్తామని, 24న జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేస్తామని, 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జిల్లా కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలు చేపడతామని ప్రకటించారు.

ప్రత్యేక హోదా సాధనకు మరో దశ ఉద్యమానికి సిద్ధం

బీజేపీని నిలదీయడంలో పార్టీలు విఫలం: చలసాని శ్రీనివాస్



మీడియా సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న చలసాని శ్రీనివాస్, లక్ష్మీనారాయణ తదితరులు

విజయవాడ (ధర్నాచౌక్), జనవరి 11: భావితరాల భవిష్యత్తు కోసం రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవశ్యకత ఉందని, విభజన హామీల సాధనకు మరో దశ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ తెలిపారు. అన్ని పార్టీలు, సంఘాలతో చర్చించి త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం నమ్మకద్రోహం చేసినా నిలదీయలేని స్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని విమర్శించారు. 25 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానన్న సీఎం జగన్ తన సొంత ప్రయోజనాల కోసం రాష్ట్ర ఆత్మగౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదా సాధన కోసం జరిగే పోరాటాల్లో టీడీపీ, వైసీపీ, జనసేన కూడా పాల్గొని రాష్ట్ర అభివృద్ధిపై వారికున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. జై భారత్ నేషనల్ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పవిత్రమైన పార్లమెంట్‌లో ఇచ్చిన ప్రత్యేక హోదా, విభజన హామీల చట్టాన్ని అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. గత పదేళ్లలో రాష్ట్రం అభివృద్ధిలో కాకుండా అప్పుల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం కాదని, తమిళనాడులో జల్లికట్టు, నల్లచట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతు ఉద్యమాల స్ఫూర్తితో ప్రత్యేక హోదా ఉద్యమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదా తీసుకువస్తామని అన్ని రాజకీయ పార్టీలు వారి మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడిస్తేనే ప్రత్యేక హోదా సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధ్యమని ఆ పార్టీ నేత నేత నరసింహారావు అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ ప్రత్యేక హోదాపై యువజన, విద్యార్థి సంఘాలు తొలి నుంచీ పోరాడుతున్నాయని, దీనికోసం భవిష్యత్ ఉద్యమాల్లోనూ పాల్గొంటామని చెప్పారు. సాధన సమితి నేతలు దోనేపూడి శంకర్, తాటికొండ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అనర్హులను జాబితాలో పెట్టొద్దు

- మధ్యవర్తుల ప్రమేయం ఉండకూడదు: కళాశాల విద్యాశాఖ కమిషనర్

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ లెక్చరర్ల క్రమబద్ధీకరణ విషయంలో అవకతవకలపై కళాశాల విద్యాశాఖ కమిషనర్ సీరియస్ అయ్యారు. 'ఒక్కో పోస్టుకు రూ.లక్ష' పేరుతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. కళాశాల విద్యాశాఖలో ఇలాంటి పరిస్థితి రావడం చాలా దారుణమన్నారు. ఈ నేపథ్యంలో అన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లు అప్రమత్తంగా ఉండాలని, అర్హులైన కాంట్రాక్టు లెక్చరర్ల పేర్లు కచ్చితంగా జాబితాలో ఉంచాలని, అనర్హులు ఒక్కరు కూడా ఉండకూడదని స్పష్టంచేశారు. అలాగే క్రమబద్ధీకరణ కోసం లెక్చరర్లు మధ్యవర్తులను సంప్రదించవద్దని, కమిషనరేట్‌లోని వారి వద్దకు కూడా వెళ్లొద్దని పేర్కొన్నారు. అక్రమాలకు తావు ఉండకూడదన్నారు. కాగా, రెగ్యులరైజేషన్ కోసం పోస్టుకు రూ.లక్ష ఇవ్వాలనే ప్రతిపాదన గురించి 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం కళాశాల విద్యాశాఖ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఇప్పటివరకూ అంతర్గతంగా ఉన్న ఈ వ్యవహారం తాజా కథనంతో బయటికి పొక్కింది. దీంతో లెక్చరర్ల మధ్య ఇది బహిరంగ చర్చగా మారింది. కొందరు ఉద్యోగులను డెప్యుటేషన్‌పై తెచ్చి కమిషనరేట్‌లో పెట్టి ఈ వ్యవహారాలు నడిపిస్తున్నారనే ఆరోపణలు కూడా పెరిగాయి. అయితే దీనివెనుక ఉన్నతాధికారులు కూడా ఉన్నారేమోనన్న చర్చ విస్తృతంగా సాగుతోంది.

సీబీఎస్ఈ బడులకు టీచర్లను కేటాయించాలి

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కొత్తగా సీబీఎస్ఈలోకి మార్చిన పాఠశాలకు సీబీఎస్ఈ తరహాలో టీచింగ్ స్టాఫ్‌ను కేటాయించాలని నవ్యాంధ్ర టీచర్ల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. వెయ్యి పాఠశాలలను సీబీఎస్ఈలోకి మార్చినప్పటికీ ఇంకా స్టేట్ సిలబస్ బోధనా సిబ్బందే ఉన్నారని, సీబీఎస్ఈకి అనుగుణంగా మార్చాలని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైస్కూల్ ప్లస్‌లకు కేటాయించిన పీజీటీలకు రెండు ఇంక్రిమెంట్లు ఇచ్చి శాశ్వత ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలన్నారు.

హోదాను దుర్వినియోగం చేస్తున్న ఏజీ

- జీపీ, ఏజీపీలుగా అర్హతలేనివారి నియామకం
- హైకోర్టులో పిటిషన్.. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అర్హతలేనివారిని జీపీ, ఏజీపీలుగా నియమిస్తూ అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ తన హోదాను దుర్వినియోగం చేస్తున్నారని న్యాయవాది శివప్రసాద్ రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాలపై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. పార్టీ ఇన్ పర్సన్ న్యాయవాది శివప్రసాద్ వాదనలు వినిపిస్తూ జీపీల నియామకంలో అడ్వకేట్ జనరల్ చట్ట నిబంధనలు పాటించడం లేదన్నారు. నిబంధనల ప్రకారం ఏపీ బార్ కౌన్సిల్‌లో సభ్యత్వం ఉన్నవారినే ప్రభుత్వ న్యాయవాదులుగా నియమించాలన్నారు. జీపీలుగా నియమితులైన శ్రేయస్‌రెడ్డి, శ్రీజయంత్రి ఏపీబార్‌లో రిజిస్టర్ కాలేదన్నారు. న్యాయవాదిగా కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్నవారినే ఏజీపీగా నియమించాలని, శశిధర్‌రెడ్డి విషయంలో ఆ నిబంధన పాటించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఏజీ కార్యాలయం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ జీపీ, ఏజీపీల నియామకంలో అడ్వకేట్ జనరల్ సిఫార్సులు మాత్రమే చేస్తారని, నియామక ఉత్తర్వులు జారీ చేసేది న్యాయశాఖ అన్నారు. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

మిత్రులుగా భావించి వర్గీకరణకు మద్దతివ్వండి

- ముఖ్యమంత్రి జగన్‌కు మంద కృష్ణమాదిగ విజ్ఞప్తి

గుంటూరు(తూర్పు), జనవరి 11: మాదిగలను శత్రువులుగా చూడకుండా.. మిత్రులుగా భావించి ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విజ్ఞప్తిచేశారు. గుంటూరులో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీగా ఉన్న సమయంలో వర్గీకరణకు మద్దతుగా జగన్ ప్రధానికి లేఖ రాశారని, అలాగే మొదటి వైసీపీ ప్లీనరీ సమావేశంలో వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేశారని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ అంశం సుప్రీంకోర్టులో ఈ నెల 17న విచారణకు వస్తుందని, దీనికి జగన్ మద్దతు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. అలాగే ప్రతిపక్ష పార్టీ నాయకులను కలిసి మద్దతు అడుగుతామన్నారు. ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నం చేస్తున్నానని, అదే సమయంలో జగన్‌ను కలిసే విధంగా వైసీపీలోని మాదిగ ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. తెలంగాణలో పాదయాత్రకు, ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో జగన్ చేపట్టిన దీక్షలకు ఎమ్మార్పీఎస్ తరఫున మద్దతు తెలిపామన్నారు. ఈ అంశాలను గుర్తుపెట్టుకుని మౌనం విడిచి ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ప్రకటన చేయాలని మంద కృష్ణ కోరారు.

విజయవాడ నగరపాలక సంస్థ
షార్టు టెండరు-కం-బహిరంగ వేలము నోటీసు

Rc. N2-117179/2023 తేది. 11-01-2024

విజయవాడ నగరపాలకసంస్థకు చెందిన అంబేద్కర్ పార్కు, కృష్ణలంక నందు గల క్యాంటీన్ షెడ్ ను లీజుకు కేటాయించుటకు టెండరు-కం-బహిరంగ వేలము ప్రక్రియ ద్వారా నిర్వహించుటకు టెండర్లు ఆహ్వానించబడుచున్నవి.

షెడ్యూలు వివరములు

వ. నెం.	ప్రాంగణము పేరు	విస్తీర్ణము చ.అడుగులలో	ఆఫీసువారు నిర్ణయించిన అప్‌సెట్ వాల్యూ ఒక సంవత్సరమునకు రూ.	ధరావత్తు (E.M.D) రూ.	నెలసరి అద్దె రూ.	షెడ్యూల్ ఖరీదు ఒక్కొక్కటికి + GST @ 18% రూ.	లీజుకాల పరిమితి
1	2	3	4	5	6	7	8
1	కృష్ణలంకలో గల అంబేద్కర్ పార్కు నందలి క్యాంటీన్ షెడ్ (గ్రౌండ్ ఫ్లోర్)	225	4,93,000/-	1,23,250/-	6,250/-	2,000/- + 360/- = 2,360/-	3 సం.లు

టెండరు షెడ్యూల్ జారీ చేయు కాలవ్యవధి : ది. 12-01-2024 నుండి 24-01-2024 వరకు (ఉ. 11.00 గం.ల నుండి సా. 3.00 గం.ల వరకు)
టెండర్లు దాఖలు చేయు సమయము : ది. 25-01-2024 ఉ. 11.00 గం.ల నుండి మ. 2.00 గం.ల వరకు
బహిరంగ వేలము నిర్వహించు సమయము : ది. 25-01-2024 సా. 4.00 గం.లకు.
యితర వివరముల కొరకు సత్యనారాయణపురంలోని సర్కిల్ II- కార్యాలయము ఆవరణలో గల ఎస్టేట్ సెక్షన్ నందు ఆఫీసు పనిచేయు వేళలలో పొందవచ్చును.
గమనిక : టెండరు తేది, సమయము, ప్రదేశము మార్చుటకు, టెండరు ఆమోదించుటకు, తిరస్కరించుటకు కమీషనరు, నగరపాలక సంస్థ వారికి పూర్తి అధికారము కలదు.
కమీషనరు తరపున

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కోర్టుకెక్కిన గాజా ఘాతుకం

అగ్రరాజ్యాల ఒత్తిళ్ళకు లొంగి అత్యధిక దేశాలు నోరుమెదపనిస్థితిలో దక్షిణాఫ్రికా ధైర్యాన్ని మెచ్చుకోవాల్సిందే. గాజాలో ఇజ్రాయెల్ జీనోసైడ్‌కు పాల్పడుతోందని హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానంలో దక్షిణాఫ్రికా వేసిన పిటిషన్‌మీద గురువారం నుంచి విచారణ ఆరంభమైంది. కేసు తేలడానికి కొంతకాలం పడుతుంది కనుక, అంతలోగా ఇజ్రాయెల్ మరింతమందిని ఊచకోతకోయకుండా దాడులు తక్షణం నిలిపివేయమంటూ ఆదేశాలు ఇవ్వాలని దక్షిణాఫ్రికా కోరుతోంది. అమెరికా అండ దండిగా ఉన్న ఇజ్రాయెల్ ఐక్యరాజ్యసమితినే లెక్కచేయదు. దాని ఆధ్వర్యంలోని ఈ అంతర్జాతీయ న్యాయస్థానాన్ని, పదిహేనుమంది న్యాయమూర్తులను అది దశాబ్దాలుగా బాయ్‌కాట్ చేసింది. అందుకు భిన్నంగా ఇప్పుడు గాజాలో తన చర్యలను సమర్థించుకోవడానికి మెరికల్లాంటి న్యాయనిపుణులను ఐసీజేలో మోహరించింది.

దక్షిణాఫ్రికా చర్యకు యాభై ఏడు దేశాలతో కూడిన ఇస్లామిక్ సహకార సమాఖ్య (ఓఐసీ) తోపాటు మన పొరుగుదేశాలైన బంగ్లాదేశ్, పాకిస్థాన్ వంటివి కూడా మద్దతు ప్రకటించాయి. 1948నాటి జీనోసైడ్ కన్వెన్షన్‌ను ఇజ్రాయెల్ ఉల్లంఘించిందంటూ తమ ప్రభుత్వం చేసిన ఫిర్యాదుకు మద్దతుగా దక్షిణాఫ్రికన్లు ర్యాలీలు నిర్వహిస్తున్నారు. వివక్ష, అణచివేత, అవమానం అనుభవించినవారికే అదే పరిస్థితుల్లో ఉన్న ఇతరుల కష్టం అర్థమవుతుంది కనుక, 1948నుంచి 1994వరకూ శ్వేతజాతిపాలనలో మగ్గిన దక్షిణాఫ్రికా పాలస్తీనియన్ల పట్ల ఇజ్రాయెల్ వైఖరికి నిరసనగా రంగంలోకి దిగింది.

దాదాపు వందపేజీల ఫిర్యాదులో గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న ఘాతుకాలను దక్షిణాఫ్రికా వివరించింది. పాతికవేలమంది, ప్రధానంగా పసిపిల్లలు చనిపోవడం, ఇళ్ళు నేలమట్టం కాయడం, వేలాదిమంది నిర్వాసితులుగా మారడం వంటివి వివరిస్తూ ఈ తీవ్ర పరిస్థితులకు తోడుగా, లక్షలాదిమందికి ఉద్దేశపూర్వకంగా ఆహారం, నీరు, వైద్యం అందకుండా చేయడం ద్వారా ఇజ్రాయెల్ జాతి, మత ఆధారిత మారణహోమానికి పాల్పడుతున్నదని దాని వాదన. ఆస్పత్రులను నేలమట్టం చేసి గర్భిణీలకు, పిల్లలకు వైద్యం దక్కకుండా చేయడంద్వారా అది ఈ మారణకాండను ఉచ్ఛస్థితికి తీసుకుపోతున్నదని దక్షిణాఫ్రికా వాదించింది.

ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సి)కు ప్రజాదరణ అధమస్థాయిలో ఉంటూ ఈ ఏడాది ఎన్నికలకు పోటీతున్న తరుణంలో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంఫోసా ఎన్నికల ఎత్తుగడగా దీనిని ముందుకు తెచ్చారని కొందరి అనుమానం. చైనా ఎగదోసిందన్న వాదనలూ లేకపోలేదు. కానీ, వందేళ్ళ చరిత్ర ఉన్న ఈ పార్టీ నెల్సన్‌మండేలా కాలంనుంచీ పాలస్తీనియన్ల పక్షాన నిలుస్తూ ఇజ్రాయెల్ బాంబుదాడులను, దురాక్రమణలనూ ఖండిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. దక్షిణాఫ్రికా శ్వేతజాతి పాలకులకు ఇజ్రాయెల్ సహాయసహకారాలు తమ దమనకాండ మరింత బలంగా కొనసాగించేందుకు ఉపకరించాయి. ఏఎన్‌సి అధికారంలోకి వచ్చిన తరువాత పాలస్తీనాతో పూర్తిస్థాయి దౌత్యసంబంధాలు నెలకొల్పుకుంది. ఇజ్రాయెల్‌తో అనాదిగా పెద్ద స్నేహం లేకపోగా, నెతన్యాహూ యుద్ధ ప్రకటన తరువాత అది తన రాయబారులను ఉపసంహరించుకుంది. నెతన్యాహూ, ఆయన మంత్రివర్గ సహచరుల వ్యాఖ్యలు, చర్యలు జీనోసైడ్‌ను సమర్థించేట్టుగా ఉన్నందున వారిపై అరెస్టువారెంట్లు జారీచేయాలని ఐసీజేలో దక్షిణాఫ్రికా వాదన. పాతికేళ్ళక్రితం ఆక్రమిత పాలస్తీనాలో మానవహక్కుల హననం మీద ఐక్యరాజ్యసమితి నియమించిన అధ్యయన బృందం నాయకుడినే ఇప్పుడు ఐసీజేలో వాదనలు వినిపించడానికి దక్షిణాఫ్రికా ఎన్నుకుంది. అప్పట్లో ఆయన ఇజ్రాయెల్ విధానాలు ఎన్ని అంతర్జాతీయ ఒప్పందాలకు, చట్టాలను ఉల్లంఘిస్తున్నాయో సవివరంగా పేర్కొన్నందున, ఐసీజేలో బలమైన పోరాటమే జరుగుతోంది. గాజాలో ఇజ్రాయెల్ అనుసరిస్తున్న విధానాలు జాతిహననమేనని రుజువుచేయడానికి గతంలో ఐసీజే ఇచ్చిన తీర్పులను నిర్వచనాలను దక్షిణాఫ్రికా వాడుకుంటోంది. రెండురోజుల వాదనల తరువాత, తుదితీర్పు వెలువడేలోగా ఐసీజే కొద్దివారాల్లో మధ్యంతర ఆదేశాలు జారీచేయవచ్చు. ఆ ఆదేశాలు మానవహననం ఆరోపణలను ఏమాత్రం సమర్థించినా, జీనోసైడ్ కన్వెన్షన్ మీద సంతకం చేసిన దేశంగా ఇజ్రాయెల్ ఆ ఉత్తర్వులను బేఖాతరుచేసినా అంతర్జాతీయంగా మరింత పరువుపోగొట్టుకుంటుంది. యుద్ధాన్ని పూర్తిగా ఆపకపోయినా, ఇజ్రాయెల్ దూకుడుకు కళ్ళెం వేయడానికి, దానిపై మిగతాదేశాల ఒత్తిడి పెంచడానికి, గాజాకు కాస్తంత మానవసాయం అందడానికి దక్షిణాఫ్రికా వేసిన ఈ కేసు

నెహ్రూ భావదీప్తి, 'అయోధ్య' ప్రశ్నలు

'బాబ్రీ' మసీదును కూల్చి వేసింది శివసైనికులు. 17 నిమిషాల వ్యవధిలో ఆ పనిని పూర్తి చేశారు. అక్కడే ఉన్న భారతీయ జనతా పార్టీ వారు తమ కర్తవ్యాన్ని దాదాపుగా విడిచిపెట్టారు. పైగా ఆ కర్మభూమికి దూరంగా వెళ్లిపోవడమూ జరిగింది. శివసైనికులు మాత్రమే ధైర్యంగా నిలబడి, తెగువతో వ్యవహరించి లక్ష్యాన్ని సాధించారు. అవును, అయోధ్యలో రామమందిరం మా సృష్టి ..' శివసేన ఎంపీ, అధికార ప్రతినిధి సంజయ్ రౌత్ ఇటీవల ఒక పత్రికా గోష్ఠిలో ఉద్ఘాటించారు. డిసెంబర్ 1992, జనవరి 2024 సంవత్సరాల మధ్య భారత రాజకీయాలు ఎంతదూరం ప్రయాణించాయో రౌత్ వ్యాఖ్యలు చెప్పకనే చెప్పాయి.

ఆనాడు అంటే 1992లో బీజేపీ, శివసేనలు కుశ లవులుగా ఉండేవి కదా. నేడు ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన మహారాష్ట్రలో 'మహా వికాస్ అఘాడి' సంకీర్ణంలో ఒక భాగస్వామిగా ఉన్నది. కాంగ్రెస్ సైతం ఆ కూటమి లోనే ఉన్నది. అయోధ్య వివాదంపై శివసేన నాటి నుంచీ నేటి వరకూ ఒకే దృఢ వైఖరితో వ్యవహరిస్తూ వస్తోంది. సందేహం లేదు. 1992లో శివసేన సర్వాధినేత బాల్ ఠాక్రే సగర్వంగా ఇలా చెప్పుకున్నారు: 'మా కుర్రాళ్లే అయోధ్యలో ఆ పనిని పూర్తి చేశారు.' మరి లౌకికవాదమే తమ విధానమని చెప్పుకునే రాజకీయ పక్షాలు ఎలా వ్యవహరించాయి? నైతిక సందిగ్ధతకు గురయ్యాయి. అనైతికంగా రాజీ పడ్డాయి. జాతీయవాదానికి మతపరమైన భాష్యాలకు లొంగిపోయాయి. ఇది రాజీ పడడం కాక మరేమిటి? లౌకికవాద పార్టీల ఇటువంటి నికృష్ట ప్రవర్తన కారణంగానే రాజకీయ హిందూత్వ తిరుగులేని రీతిలో ప్రజల మనసులలోకి, హృదయాలలోకి పురోగమించింది. ఇదెంత విడ్డూరమో అంతకంటే అధికంగా అసంగతం.

ఆ అయోధ్య వ్యవహారం మూడు దశాబ్దాల అనంతరం కూడా దేశ రాజకీయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తోంది. ఇది సార్వత్రిక ఎన్నికల సంవత్సరం. మరి కొద్ది రోజుల్లో అయోధ్యలో అద్వితీయంగా నిర్మించిన రామమందిరానికి ప్రాణప్రతిష్ఠ జరగనున్నది. ఈ మహద్ఘటనను ఆధారంగా చేసుకుని ఎన్నికలలో చరిత్రాత్మక విజయం సాధించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృత నిశ్చయంతో వ్యవహరిస్తున్నారు. ఆయన ప్రస్తుత రాజకీయమంతా అదే లక్ష్యంతో సాగుతున్నది. మరి ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ తన వైఖరి ఏమిటో సుస్పష్టంగా ఎందుకు వ్యక్తం చేయలేకపోతోంది? మన దేశంలో అపూర్వ టెలి కమ్యూనికేషన్స్ విప్లవానికి ప్రధాన కారకుడు, కాంగ్రెస్ పార్టీ అంతర్జాతీయ విభాగానికి అధిపతి అయిన శామ్ పిట్రోడా ఇటీవల ఒక ప్రాసంగిక ప్రశ్న వేశారు: 'ఇప్పుడు మన ప్రజలకు అత్యవసరమయింది రామ మందిరమా? లేక నిరుద్యోగిత, ద్రవ్యోల్బణ సమస్యల పరిష్కారమా?'. చాలా ఉపయుక్తమైన ప్రశ్న, సందేహం లేదు. అయితే కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం వెన్వెంటనే ఈ వ్యాఖ్యలకు తనకు తానుగా దూరం జరిగింది. ఆ వ్యాఖ్యలు శ్యామ్ పిట్రోడా వ్యక్తిగత అభిప్రాయాలే కాని, పార్టీ దృక్పథాన్ని ప్రతిబింబించేవి కావని' ఏఐసిసి ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. రామ మందిరం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా అందుతున్న ఆహ్వానాలను ఆమోదించే విషయంలో కూడా కాంగ్రెస్ నాయకత్వం ఊగిసలాట వైఖరినే ప్రదర్శిస్తోంది. రెండు అవాంఛనీయ ప్రత్యామ్నాయాల మధ్య చిక్కుకుంది.



> లౌకికవాదం గురించిన తన దార్శనికతను జవహర్ లాల్ నెహ్రూ 1960లో ఇలా స్పష్టీకరించారు: 'లౌకికవాదం అంటే మతానికి పూర్తిగా వ్యతిరేకమైనదిగా కొంతమంది భావిస్తున్నారు. ఆ భావన ఎంతమాత్రం సమంజసమైనది కాదు. అన్ని మతాలను సమానంగా గౌరవించి ఆ మతాల వారందరికీ సమస్థాయి అవకాశాలు కల్పించడమే లౌకికవాదం. అదే దాని గుణశీలత, అదే దాని సార్థకత'. ఈ సమున్నత ఆదర్శానికి, మన గణతంత్ర రాజ్య ప్రాథమిక సూత్రానికి తాము మనసా వాచా కర్మణా కట్టుబడి ఉన్నామని ఏ రాజకీయ పార్టీ అయినా నిశ్చితంగా చెప్పగలదా?

నవ భారత నిర్మాత జవహర్ లాల్ నెహ్రూ నిర్దేశించిన లౌకికవాద పథంలో దశాబ్దాల పాటు మున్ముందుకు సుస్థిరంగా ప్రస్థానించిన కాంగ్రెస్‌లో ఇప్పుడు రామ మందిరం ప్రారంభోత్సవానికి అందిన ఆహ్వానాలపై ఎందుకు అయోమయంలో కొట్టుమిట్టాడుతోంది? అంగీకరిస్తే లౌకికవాద నిబద్ధత ఏమయ్యేట్టు? తిరస్కరిస్తే 'హిందూ వ్యతిరేక పార్టీ'గా కాంగ్రెస్‌పై ధ్వజమెత్తేందుకు ప్రత్యర్థిపక్షాలు ఒక క్షణమూ సంకోచించవు. ప్రజాభిప్రాయాన్ని హిందూత్వ శక్తులు ఎంతగా ప్రభావితం చేస్తున్నాయో కాంగ్రెస్ సందిగ్ధ పరిస్థితి స్పష్టం చేస్తోంది.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

మత ప్రమేయ రాజకీయాలు, ముఖ్యంగా హిందూత్వ శక్తుల సవాళ్లను కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా ఎదుర్కొంటూ వస్తోంది. అయితే ఆ రాజకీయ ప్రతిస్పందనలలో ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన, అదీ హింసాత్మకంగా వస్తుందేమోనన్న భయం కాంగ్రెస్ ప్రతిస్పందనలను సదా ఆవరించి ఉండటం ఒక కొట్టివేయలేని వాస్తవం. 1980 వ దశకం రాజకీయ పరిణామాలను ఒకసారి అవలోకించండి. ఇందిర, రాజీవ్ లిరువురూ అటు లౌకికవాద, ఇటు మతవాద శక్తులు రెండింటితోనూ సరిసమానంగా వ్యవహరించడానికే ప్రయత్నించారన్న విషయం స్పష్టమవుతుంది. ఆ ఇరువురి సారథ్యంలోని ప్రభుత్వాల విధానాలనూ ఆ వైఖరే ప్రభావితం చేసింది. బాబ్రీ మసీద్ ద్వారాలను తెరువడం, ఆ వివాదాస్పద స్థలం వద్ద శిలాన్యాస్‌కు అనుమతించడం హిందూ బృందాలను బుజ్జగించడానికి కాగా, షాబానో కేసులో సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టడం, 'శాటానిక్ వర్సెస్'పై నిషేధం విధించడం ముస్లిం మత ఛాందసవాదులను సంతృప్తపరచడానికే అనడంలో సందేహం లేదు. ఓటు బ్యాంకులను దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఇటువంటి రాజకీయ నిర్ణయాలు బహుళ మతాలకు ఆలవాలంగా ఉన్న భారతీయ సమాజంలో నిజమైన లౌకికవాద ప్రభావాలను బలహీనపరిచాయి. అసలు లౌకికవాదం పట్ల ప్రజల్లో తిరస్కారభావాన్ని పెంపొందించడానికే ఆ రాజకీయ సంకోచాలు ఎంతైనా తోడ్పడ్డాయి.

1992 డిసెంబర్‌లో దేశం నలుమూలల నుంచీ లక్షలాది కరసేవకులు అయోధ్యకు తరలి వచ్చినప్పుడు ప్రధానమంత్రి పీవీ నరసింహారావు ప్రభుత్వం వ్యవహరించిన తీరునూ అటువంటి భయమే ప్రభావితం చేసిందనడంలో సందేహం లేదు. అయోధ్యలోని వివాదాస్పద కట్టడాన్ని పరిరక్షించడం నరసింహారావు ప్రభుత్వ విధ్యుక్త ధర్మం. అయినా కరసేవకుల వెల్లువను ప్రభుత్వం ఉపేక్షించింది. ఫలితంగానే బాబ్రీ మసీదును ప్రభుత్వం రక్షించలేక పోయింది. దరిమిలా చెలరేగిన మత ఘర్షణల్లో వందలాది అమాయకుల ఊచకోతలు సంభవించాయి. ప్రభుత్వం దృఢసంకల్పంతో వ్యవహరిస్తే అలా జరిగేదేనా? ఇక ఇటీవలి సంవత్సరాలలో కాంగ్రెస్ నాయకులు నుదుట బొట్టు పెట్టుకుని మరీ తాము నిష్ఠాగరిష్ఠులమైన హిందువులమని చాటుకుంటున్నారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ప్రతీచోటా రాహుల్ గాంధీ విధిగా దేవాలయాలను సందర్శిస్తున్నారు. ఆలయాలలో పూజలు నిర్వహిస్తున్నారు. తాను శివభక్తుడినని, జంధ్యం ధరించిన హిందువునని రాహుల్ అనేక విధాలుగా చెప్పుకుంటున్నాడు.

కాంగ్రెస్ ప్రభుత్వాలు ఒక కచ్చితమైన నిబద్ధతతో లౌకికవాద విధానాలను అమలుపరచకపోవడం వల్లే ఇప్పుడు ఆ పార్టీ ఆ భావజాలం విషయంలో తీవ్ర ప్రతికూలతను ఎదుర్కొంటోంది. ప్రత్యర్థి పక్షానిదే అన్ని విధాల పైచేయిగా ఉన్నది. కనుకనే కాంగ్రెస్ ముస్లిం అనుకూల పార్టీ అని ప్రజలు విశ్వసించేలా చేయడంలో బీజేపీ సఫలమయిందని ఐదేళ్ల క్రితమే పార్టీ అధినేత్రి సోనియా గాంధీ అంగీకరించక తప్పలేదు. హిందీ రాష్ట్రాలకు చెందిన 'లౌకికవాద' మండల్ యోధులు రాజ్యాంగ విలువలకు చిత్తశుద్ధితో కట్టుబడి లేకపోవడం వల్లే వారిని 'ముస్లిం అనుకూలురు'గా హిందూత్వ వాదులు చిత్రించగలుగుతున్నారు. ఈ విషయమై తమపై వస్తున్న ఆరోపణలకు 'మండల్' యోధులు సరైన సమాధానమివ్వలేకపోతున్నారు.

నిజమైన లౌకిక వ్యవస్థ అన్ని మతాల వారినీ సమభావంతో చూస్తుంది. ఎటువంటి మతపరమైన వివక్ష లేకుండా ప్రతీ ఒక్కరికీ న్యాయాన్ని సమకూరుస్తుంది. బాబ్రీ మసీద్ కూల్చివేత, సుప్రీంకోర్టు మాటల్లో 'నేరపూరిత చర్య'. ఆ దురాగతానికి కారకులయిన వారిపై, 1993 ముంబై పేలుళ్ల కేసులో నిందితులపై జరిగిన విధంగా శీఘ్రగతిన విచారణ ఎందుకు జరపలేదు? ఇది ప్రశ్నించవలసిన విషయం. యదార్థ లౌకికవాద సమాజం బహుళత్వవాదానికి నిబద్ధమై ఉండాలి. అని మతాల వారిని సమభావంతో ఆదరించాలి. సహన భావంతో వ్యవహరించాలి. ఓటు బ్యాంకులకు ప్రాధాన్యమిచ్చే మెజారిటీవాద రాజకీయాలను త్యజించాలి. పాలనా విధానాలు, పద్ధతులపై మత ప్రభావం ఉండకూడదు. ఏ ఒక్క మత పరమైన అస్తిత్వానికి అధిక ప్రాధాన్యమివ్వకూడదు. మత పరమైన గుర్తింపు రాజకీయాలు చేసే నేతలను నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి.

లౌకికవాదం గురించిన తన దార్శనికతను జవహర్ లాల్ నెహ్రూ 1960లో ఇలా స్పష్టీకరించారు: 'భారత్‌లో మత ప్రమేయం లేని ఒక రాజ్య (సెక్యులర్ స్టేట్) వ్యవస్థను పరిపూర్ణంగా, పటిష్ఠంగా నిర్మించుకోవడం గురించి మనం తర్జన భర్జన పడుతున్నాం. 'సెక్యులర్' అనే ఆంగ్ల పదానికి హిందీ భాషలో సరైన, కచ్చితమైన మాటను కనుగొనడం కూడా బహుశా, అంత సులువైన విషయం కాదు. లౌకికవాదం అంటే మతానికి పూర్తిగా వ్యతిరేకమైనదిగా కొంతమంది భావిస్తున్నారు. ఆ భావన ఎంతమాత్రం సమంజసమైనది కాదు. అన్ని మతాలను సమానంగా గౌరవించి, ఆదరించి, ఎటువంటి మినహాయింపు లేకుండా వాటన్నిటికీ సమస్థాయి అవకాశాలు కల్పించడమే లౌకికవాదం. అదే దాని గుణశీలత, అదే దాని సార్థకత'. ఈ సమున్నత ఆదర్శానికి, మన గణతంత్ర రాజ్య ప్రాథమిక సూత్రానికి తాము మనసా వాచా కర్మణా కట్టుబడి ఉన్నామని, ప్రజా జీవితంలో ఆ స్ఫూర్తి సంపూర్ణంగా విలసిల్లేందుకు నిబద్ధమై ఉన్నామని ఏ రాజకీయ పార్టీ అయినా నిశ్చితంగా చెప్పగలదా? అటువంటి నైతిక సమున్నతితో వ్యవహరించే రాజకీయపక్షాలు ఒకటికి మించి ఉన్నప్పుడు మాత్రమే మన ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్య భవిష్యత్తుకు భరోసా సమకూరుతుంది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

రాజకీయ వ్యంగ్యంలో రాటుదేలిన కలం

ఎన్నికలు వచ్చినప్పుడు కొందరు కవులు ప్రత్యేకంగా ఆనాటి రాజకీయ కదలికల్ని, నేతల విన్యాసాల్ని ఉద్దేశించి రన్నింగ్ కామెంట్రీలు రాస్తుంటారు. అవన్నీ ఒకేలా ఉరకలెత్తవు. అలిశెట్టి ప్రభాకర్ చనిపోయి 30 ఏండ్లయినా ఆయన చేసిన పొలిటికల్ కామెంట్రీ మాత్రం ఇప్పటికీ రన్ అవుతూనే ఉంది. దానికి కారణం ఆయన కలమెప్పుడూ నేతల వెనుకాలే పడేది. ప్రజల బతుకులెప్పుడూ పాలకుల నిజాయితీపైనే ఆధారపడి ఉంటాయని భావించి తన అక్షరాల్ని ఎక్కువగా అటువైపే సంధించాడు. అందుకే ఎలక్షన్లు వచ్చాయంటే చాలు పదును తగ్గని ప్రభాకర్ పదాలు మళ్ళీ మళ్ళీ వినపడుతుంటాయి.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా పత్రికల్లో, సోషల్ మీడియాలో ఆయన కవితా పంక్తులు విరివిగా కనబడ్డాయి: "అయిదేళ్లకొకసారి/ అసెంబ్లీలో మొసళ్ళు ప్రవేశించడం/ పెద్ద విశేషం కాదు/ జనమే ఓట్ల జలాశయాలై/ వాటిని బతికించడం విషాదం", "పాత ప్రభుత్వాల్లో/ చితికిపోయిన ప్రజలు/ కొత్త ప్రభుత్వాల్లో/ 'చితి'కి పోకుంటే చాలు" అనేవి ఎన్నికల సమయంలో చక్కర్లు కొట్టిన వాటిలో మచ్చుకు కొన్ని. ఈ పంక్తులను చూస్తుంటే ఆయన మనతో పాటే ఉండి వర్తమాన రాజకీయాలను పరిశీలిస్తున్నట్లుగానే అనిపిస్తుంది. అలిశెట్టి కవిత్వంలోని ప్రాసంగికత గురించి చాల చోట్ల ప్రస్తావన వచ్చింది. నిజానికి ప్రాసంగికత అంటే కవి రాసిన నాటి కాలపు పరిస్థితులు తర్వాతి కాలంలో మారకపోవడమే. ఎవరి రచననైనా ప్రాసంగికత కోల్పోయేలా చేయడమే నిజమైన సామాజిక అభివృద్ధి. కాని ఆ వృద్ధి, మార్పు సాధ్యపడటం లేదు. "తల్లిదండ్రులయందు దయలేని పుత్రుండు.." అని వేమన వందల ఏళ్ల క్రితమే రాశాడు. మనం మారక ఇలాంటి కవుల రాతల ప్రాసంగికతను ఎప్పటికీ కాపాడుతూ ఉన్నాం.



> అలిశెట్టి కవిత్వంలో 'తిరుగబడు', 'కూలదోయి' లాంటి విధ్వంసక, హింసాప్రేరక పదజాలం ఉండకుండా ఒక నూతన నిర్మాణాత్మకత కనబడుతుంది. 'సమాజం ఇలా ఉంది, ముందు దీన్ని అర్థం చేసుకో' అన్నట్లుగా ఆయన అక్షరాలుంటాయి. ఈ ఓట్లు, ఎన్నికలు, గెలిచిన నేతలు, మారిన ముఖాలతో సమాజం మారదు అనే చైతన్యాన్ని అవి నూరి పోస్తాయి.

అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం రాసిన రెండు దశాబ్దాలు (1973–93) తెలుగు నేలపై చైతన్య ప్రవాహాలు ఉరకలెత్తాయి. విప్లవ పార్టీలు రాజ్యంతో ఢీకొన్న రోజులవి. తెలంగాణలో పచ్చగా కొనసాగిన పలు విప్లవ గ్రూపుల్లో ఏదో ఒక పక్షం వహించడం ఆనాటి యువత లక్షణంగా మారింది. జగిత్యాల జైత్రయాత్ర కన్న కవిగా అలిశెట్టి తన భావజాలం వైపే నిలిచాడు. దాన్ని నిలబెట్టేందుకే కవిత్వం రాశాడు. అయితే అలిశెట్టి కవిత్వంలో 'తిరుగబడు', 'కూలదోయి' లాంటి విధ్వంసక, హింసా ప్రేరక పదజాలం ఉండకుండా ఒక నూతన నిర్మాణాత్మకత కనబడుతుంది. సమాజం ఇలా ఉంది, ముందు దీన్ని అర్థం చేసుకో అన్నట్లుగా ఆయన అక్షరాలుంటాయి. ఈ ఓట్లు, ఎన్నికలు, గెలిచిన నేతలు, మారిన ముఖాలతో సమాజం మారదు అనే చైతన్యాన్ని అవి నూరి పోస్తాయి. అందుకోసం అనుక్షణం తన కవిత్వం ద్వారా ఆయన పాలకులను, పాలనా విధానాలను సూటిగా ఎదుర్కొన్నాడు. నేతల మాటల్లోని డొల్లతనాన్ని విప్పి చెప్పాడు. దీని కోసం తీవ్రమైన వ్యంగ్యాన్ని ఆశ్రయించాడు. ఆయన రాసేకాలంలో కాంగ్రెస్, టీడీపీ ఆంధ్రప్రదేశ్‌ను పాలించాయి. నిలకడగా లేని రాజకీయ నాయకులను "వాడు ముందే వానపాము/ మరి ముడ్డెటో మూతెటో" అని సిగ్గు తీశాడు. "జలగలూ' 'బ్రహ్మ'జెముళ్ళు/ అవకాశవాది 'రూలుకర్రా'/ 'ఆరణాల కూలి'/ పునాది లేని 'భవనం' నాచారం 'సన్యాసులు'/ వరుసగా ఎవరెవరు ముఖ్యమంత్రులైనా/ అక్షరాలా అరాచకంలో మార్పుండదు" అని రాశాడు. ఈ చురకలకు ఉడుక్కున్న పాలకపెద్దలు ఆయన సంగతేందో చూడమని లాఠీని ఉసిగొల్పారు. కమిషనర్ స్థాయి అధికారి పిలిపించి ఇలా రాస్తే ఊర్కొనేది లేదన్నాడు. అప్పటికే కరీంనగర్‌లో ఆయన ఒళ్ళు ఈ రుచి చూసింది. ప్రభాకర్ బెదరలేదు, తన తీరు ఏమాత్రం మార్చుకోలేదు.

ఈ రాజకీయ నాయకుల దుర్నీతి వల్లే ప్రజల బతుకులిలా ఉన్నాయి. వీరంతా ఒకే రకమైన నేపథ్యం, ఒకే దురాలోచన కలవారే, మాయమాటలు చెప్పి అధికారాన్ని పొంది తమ వర్గానికి దేశ సంపదని దోచిపెట్టేవారే అనేది ప్రభాకర్ ప్రగాఢ విశ్వాసం. ఆయన నమ్మకాన్ని ఏ ప్రభుత్వం తప్పని నిరూపించలేదు. తన విశ్వాసాన్ని వదిలి ప్రభాకర్ ఎవరికీ జై కొట్టలేదు. బతికినంతకాలం పాలకుల దోపిడి విధానాన్ని ఎండగడుతూ ఓటర్లకు జాగ్రత్తలు చెప్పాడు. సాయుధ పోరాట మార్గమే ఈ పాలనను అంతం చేస్తుందని వ్యక్తిగతంగా నమ్మిన ప్రభాకర్ కవిత్వంలో మాత్రం విప్లవపంథా వైపు వెళ్ళమని ఏకపక్షంగా ఉద్బోధించలేదు. వర్గ స్వభావాన్ని తన అక్షరాల్లో సుస్పష్టంగా విశదీకరిస్తూ, పరిస్థితుల మార్పుకు ఘర్షణే మార్గమని సూచిస్తూ పోరాట రూపాన్ని మాత్రం ఎవరి శక్తిని బట్టి వారే నిర్ణయించుకోడానికి అవకాశం ఇచ్చాడు.

రాజకీయ పదవులు అందుకొనేవారిపై ప్రభాకర్‌కు పూర్తిస్థాయి స్పష్టత ఉంది. ఒక మనిషి రాజకీయ నాయకుడిగా ఎలా ఎదుగుతాడో 'దశలవారీగా ఇలా వివరించాడు. "ఇదివరకు/ సమాజ శరీరం మీద చీరుకుపోయే/ చిన్న రౌడీ 'బ్లేడు'/ ఇవాళ/ ఇంటింటికీ చేతులు జోడించి/ ఎన్నికల్లో మెరిసిన ఎమ్మెల్యే 'కత్తి'/ రేపు/ అరాచకీయాల్లో ఆరితేరి/ కాగల మంత్రి 'గండ్ర గొడ్డలి" అని. ఈ మాటల్లో నిజమెంత ఉందో మనకు తెలిసిన నాయకుడి ఎవరి చరిత్రయినా పరిశీలిస్తే తెలుస్తుంది.

ఈ దేశంలోని ప్రజాస్వామ్యానికి ఆయన ఇచ్చిన కవితారూపం ఇలా ఉంది. "స్వయంగా శవాలే/ రాబందుల వద్దకి/ నడిచొస్తుంటే/ అంతకంతకూ/ పెరుగుతున్న/ అజ్ఞానపర్వతం/ చిన్న బ్యాలెట్ పెట్టెలో ఇమిడిపోతే/ మళ్ళీ/ కోటీశ్వరుడి పుట్టలోంచి/ బుసకొట్టేదే/ ఈ దేశపు 'ప్రజాస్వామ్యం" అన్నాడు. పీక్కు తినండి అని దేశాన్ని ఓటర్లే అప్పగిస్తున్నారనే వేదన ఇందులో ఉంది. ప్రజల ఆశలను, ఆకాంక్షలను నిజం చేయని చట్టసభలను "సగటు మనిషి ఓట్ల విత్తనాలు/ మొలకెత్తని బంజరు భూములు" అన్నాడు. ప్రజల సొమ్ము పాలకులకు ఎంత అందుబాటులో ఉందో చెప్పడానికి "కాసుకో కోసుకో రాజకీయమా/ ప్రజలు పనస తొనలు మీరు కత్తిమొనలు" అని రాశాడు.

ఓటరులో విచక్షణ కోరుతూ "పార్టీ ప్రచారాల/ నిలువెత్తు అలల/ సంద్రంలో ఓటు/ ఊగిసలాడే బోటు" అని, "గుర్తుంచుకో/ మనమేసే ఓటే వాడికి ఆక్సిజెన్ లేదా.. ఆక్సిడెంట్" అని జాగ్రత్తలు చెప్పాడు. ఓట్ల ద్వారా మారని ప్రభుత్వాల వైఖరిని ఉద్దేశించి "ఉండబట్టలేక/ ఓటేస్తే/ ఉన్నబట్టా/ లాక్కున్నట్లు." అన్నాడు. పాలకులను పిల్లలకు పాలిచ్చే తల్లులతో గొప్పగా పోల్చుతూ "పాలిచ్చే తల్లే/ పీక నులుమబోతే/ పాపకి దిక్కెవరు/ పాలించే ప్రభువే/ పీడిస్తూ పోతే/ ప్రజలకు చుక్కెదురు" అని మాతృత్వ గుణాన్ని చెప్పాడు. చివరకు 'రైళ్లయినా/ రాజకీయాలైనా/ పట్టాలు తప్పితే/ ఎప్పుడూ/ జనానికే/ జీవన్మరణ సమస్య" అనేది అసలు సత్యం. రోజులు మారాయి, రైతు బాగున్నాడు, ఆడవారికి రక్షణ ఉంది, యువత ఉద్యోగాలకు కొరత లేదు అని జనం ఒప్పుకొనే దాకా అలిశెట్టి అక్షరం 'చివరి చరణం' కాబోదు.

■ బి. నర్సన్

(నేడు అలిశెట్టి జయంతి, వర్ధంతి)

గుంటూరును ముంచెత్తిన మరాఠీ ఆధిపత్యం!

> పదవులు, ఉద్యోగాలు, సంపదలో అనుచిత ఆధిక్యతలు పదునైన భావజాలాన్ని సృష్టిస్తాయి. ఒకనాటి ఉమ్మడి మద్రాసు, మహారాష్ట్ర చరిత్రలే ఇందుకు ఉదాహరణలు. బ్రాహ్మణ వ్యతిరేక భావజాలం అందుకే అక్కడ ఊపిరిపోసుకున్నది. గుంటూరు జిల్లా చరిత్ర చెబుతున్న నిజం అదే. ఆ ఆధిక్యతలు సడలుతున్న క్రమంలో ఆ భావజాల తీవ్రత కూడా క్రమేపీ తగ్గిపోయింది.





■ రాహుల్ కుమార్

కొన్ని రకాల సామాజిక ఆలోచనలు ఒక పట్టాన అంతరించిపోవు. కఠోర వాస్తవాల నుంచి పుట్టిన వాటి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. ఏదోరకంగా అవి కొనసాగుతూనే ఉంటాయి. మనుషుల మధ్య ఆర్థిక, సామాజిక తారతమ్యాలను వివరించటానికే సామాజిక సిద్ధాంతాలన్నీ పుట్టుకొచ్చాయి. కొన్ని వాటిని సహజమైనవిగా భావించాయి. మరికొన్ని వాటిని తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇంకొన్ని మధ్యేమార్గాన్ని చూపించాయి. ఎంతో కొంత స్థాయిలో అసమానతలు ఉండటం సహజమని చెప్పటమే మధ్యే మార్గం ప్రధాన ఉద్దేశం. పేర్లు ఎనె[illegible] ఉండొచ్చు. చెప్పే రీతుల్లో తేడాలుండొచ్చు. కానీ తరచి చూస్తే అన్నీ సిద్ధాంతాలూ ఈ మూడు విభాగాల్లోనే ఇమిడిపోతాయి. మనందరికీ బాగా తెలిసిన కర్మ సిద్ధాంతం కూడా ప్రధానంగా అసమానతలను వివరించేదే. భారతదేశం అంటేనే విశిష్టతలకు నిలయం. అట్లాంటి విశిష్టతల్లో మన కుల వ్యవస్థ కూడా ఒకటి. ప్రతి కులానికి ఒక హోదాను ఇచ్చి మనుషులను అనేక స్థాయిల్లో నిలబెట్టిన వ్యవస్థ ప్రపంచంలో మరొకటి లేదు. విశిష్టతలు ఉన్న వ్యవస్థను వ్యతిరేకించే సిద్ధాంతాలు కూడా విశిష్టంగానే ఉంటాయి. బ్రాహ్మణ ఆధిపత్య వ్యతిరేకత ఇందులో ఒకటి. ఒకనాడు ఈ ఆధిపత్యాన్ని వ్యతిరేకించటానికి పార్టీలే పుట్టుకొచ్చాయి. వందేళ్ల క్రితం మద్రాస్ రాష్ట్రంలో పుట్టిన జస్టిస్ పార్టీకి ఈ వ్యతిరేకతే పునాది. మహారాష్ట్రలో సామాజిక సంస్కరణల కోసం ఎంతో శ్రమించిన జ్యోతిరావు పూలేను నడిపించింది ఈ వ్యతిరేకతే. అంబేద్కర్‌ది కూడా ప్రధానంగా అదే దోవ. మతపరంగా పూజాపునస్కారాలను నిర్వహించే వర్గం మీద ఇంత వ్యతిరేకత ఎందుకన్న ప్రశ్న వస్తుంది. కానీ ఈ వ్యతిరేకత దానివల్లే వచ్చిందని చెప్పలేం. ఆ వర్గం ఒకనాడు ఆర్థిక, పరిపాలన రంగాలపై చలాయించిన ఆధిపత్యానికి వ్యతిరేకంగా అది వచ్చింది. ఆ ఆధిపత్యం ఎలా ఉండేదో నిర్దిష్టంగా తెలుసుకోటానికి చాలా పరిశోధనలు జరిగాయి. ఒకనాటి గుంటూరు జిల్లాలో ఆ ఆధిపత్య రీతులను వివరించే రచనను ఇందులో ప్రధానమైందిగా చెప్పుకోవచ్చు. రాబర్ట్ ఎరిక్ ఫ్రికన్‌బర్గ్ 1961లో లండన్ యూనివర్సిటీకి సమర్పించిన సిద్ధాంత వ్యాసం కోసం పరిశోధన చేపట్టి దాన్ని రాశారు. ఆ తర్వాత పుస్తకంగానూ ప్రకటించారు. 1788 నుంచి 1848 వరకూ గుంటూరు జిల్లాలో బ్రిటిషు పాలకులకు, అక్కడున్న స్థానిక ప్రాబల్యవర్గాల మధ్య సంబంధాలనూ సంఘర్షణలనూ వివరిస్తూ చాలా సమాచారాన్ని ఇచ్చారు.

గుంటూరు జిల్లాపై బ్రిటిషు ఆధిపత్యం 1788లో మొదలైంది. అప్పటికి భూమి శిస్తే ప్రభుత్వానికి ప్రధాన ఆదాయం. దీన్ని రాబట్టే పాలనా యంత్రాంగమే ఆనాడు కీలకం. అయితే దీనిపై పట్టు అంతా బ్రాహ్మణుల చేతుల్లో ఉండేది. అంటే కలెక్టరు ఆఫీసు నుంచి గ్రామస్థాయి వరకూ బ్రాహ్మణులదే ఆధిపత్యం. విచిత్రం ఏమిటంటే ఆ ఆధిపత్యంలో ప్రధాన పాత్ర మహారాష్ట్రకు చెందిన దేశస్థ బ్రాహ్మణులది. వీరిని కాదని నిర్ణయాలు తీసుకునే సాహసం బ్రిటిషు అధికారులకు ఉండేది కాదు. రెవిన్యూ రికార్డులన్నీ వీరి చేతుల్లో ఉండేవి. మరాఠీ భాషలో వీటిని రాసేవారు. తెలుగు, ఇంగ్లిషులో కూడా రాసినా కీలక విషయాలన్నీ మరాఠీలోనే ఉంచేవారు. గుంటూరులోనే గాక తమిళ జిల్లాల్లోనూ వీళ్ల ఆధిపత్యమే కొనసాగేది. ఆ రోజుల్లో ముఖ్య శిరస్తాదార్ అనే పదవి ఉండేది. కలెక్టరు పదవి తర్వాత అదే కీలకమైంది. అన్ని విభాగాలూ శిరస్తాదార్ ఆధిపత్యం కిందే ఉండేవి. ఆ తర్వాత స్థానం నాయబ్ (డిప్యూటీ) శిరస్తాదార్‌ది. ఇక తాలూకాల్లో తహశీల్‌దార్లదే రాజ్యం. 1855 నాటికి మద్రాసు రాష్ట్రంలో 20 జిల్లాలకు 21 మంది శిరస్తాదార్లు ఉండేవారు. అందులో 17 మంది మరాఠా బ్రాహ్మణులు. మిగిలిన నాలుగు పదవుల్లో ఇతర బ్రాహ్మణుల నుంచి ఇద్దరూ, బ్రాహ్మణేతర కులాల నుంచి మరో ఇద్దరూ ఉండేవారు. నాయబ్ శిరస్తాదారుల్లో కూడా మరాఠా బ్రాహ్మణులదే (20) ఆధిపత్యం. ఇతర బ్రాహ్మణుల చేతుల్లో 13 పదవులు ఉండేవి. మిగతా కులాల ప్రాతినిధ్యం వీటిల్లో కూడా అరకొరే. ఇతర కులాలకు మూడు, స్థానిక క్రైస్తవులకు రెండు ఉద్యోగాలు దక్కాయి. ఇక తహశీల్‌దారుల్లో మరాఠా బ్రాహ్మణులు 117, ఇతర బ్రాహ్మణులు 68 మంది ఉండేవారు. 45 చోట్ల మిగతా కులాల వ్యక్తులు తహశీల్‌దారు పదవులను నిర్వహించేవారు.

ముస్లింలు 13, క్రైస్తవులు మూడు చోట్ల ఉండే వారు. మొత్తం 305 కీలక ఉద్యోగాల్లో 154 మంది మరాఠా బ్రాహ్మణులు, 83 మంది ఇతర బ్రాహ్మణులు పెత్తనం చలాయించారు. అంటే 77 శాతం పదవులు వీళ్ల చేతుల్లో ఉండేవి. మరి గుంటూరు జిల్లాలో సంగతి ఏమిటి? అక్కడ 70 ఏళ్ల తర్వాత కూడా పరిస్థితి పెద్దగా మారలేదు. 1922 నాటికి జిల్లా సర్వీసుల్లో 67.22 శాతం ఉద్యోగాల్లో బ్రాహ్మణులే కొనసాగేవారు. 1930ల నాటికి చాలా ఉద్యోగాలకు రిజర్వేషన్లు వచ్చాయి. అయినా 1958 నాటికి కూడా జిల్లా సర్వీసుల్లో బ్రాహ్మణుల సంఖ్య (28.74%) గణనీయంగానే ఉంది. ఇక గ్రామాలను తీసుకుంటే అక్కడ కరణాలుగా పెత్తనమంతా నియోగ బ్రాహ్మణులదే. తర్వాత కాలంలో మునసబుల అధికారాలను పెంచి కరణాల ఆధిపత్యాన్ని తగ్గించారు.

బీజాపూర్ సుల్తానులు దేశస్థ బ్రాహ్మణులను దక్షిణాదికి తీసుకువచ్చారు. గోలుకొండ నవాబులూ వీరిని చేరదీశారు. వేరే భాష మాట్లాడే ప్రజలపై అజమాయిషీ కోసం ఇతర ప్రాంతాల నుంచి చదువుకున్న వర్గాలను తీసుకుని రావటం మన చరిత్రలో చాలా సందర్భాల్లో జరిగింది. పైన అధికారం చలాయించే నవాబులను కాపాడటానికి ముస్లిం ఫౌజుదారులు ఉన్నా రెవిన్యూ యంత్రాంగం మొత్తం హిందువుల చేతుల్లోనే ఉండేది. వీరిలో కూడా బ్రాహ్మణ, కాయస్థ కులాల వారే ప్రధానం. ఇక సైన్యంలో కమ్మ, కాపు, వెలమ, రెడ్డి లాంటి అగ్రకులాలు ప్రముఖపాత్ర పోషించేవి. ప్రాంతాన్ని బట్టి ఈ కులాల పేర్లు మారొచ్చు. కానీ ఆధిపత్య కులాలు అన్ని భాషా ప్రాంతాల్లోనూ నాలుగో అయిదో ఉండేవి. ఈ కులాలకు చెందిన ముఖ్యులతో కలిసే ముస్లిం నవాబులు దేశంపై ఆధిపత్యం చలాయించారు. నవాబుల స్థానంలో వచ్చిన బ్రిటిషు వారు చాలా కాలం దాన్ని కొనసాగించారు. అందుకే ముస్లింల పాలనలో హిందువులు అణచివేతకు గురయ్యారంటూ మన చరిత్ర గురించి తరచూ చెప్పేదంతా వాస్తవ దృష్టితో చూస్తే నిజంకాదు. గుంటూరు జిల్లానే కాదు ఏ జిల్లాను తీసుకున్నా ఇదే కనపడుతుంది. 'హిందువులను అదుపులో పెట్టాలి. అణచివేయాలి. వాళ్లు చాలా టక్కరులు. తిమ్మిని బమ్మిని చేస్తారు. ఎప్పటికీ వాళ్లను నమ్మలేం' లాంటి మాటలు ముస్లిం రాజ్యాల ఆస్థాన రచయితలు రాసిన పుస్తకాల్లో చాలాచోట్ల కనపడతాయి. అవన్నీ కూడా పాలనా యంత్రాంగంలో కీలక పాత్ర పోషించిన ప్రాబల్యవర్గాలు గురించి చేసిన వ్యాఖ్యలే. ఈ వర్గాలు తమ కులాలపైనే ప్రధానంగా ఆధారపడి బలగాలను సమకూర్చుకునేవి. చివరికి తిరుగుబాట్లకు కూడా ఎక్కువగా సొంత కులాలపైనే ఆధారపడేవారు. సొంత కులాలు, తెగల బలంతో విస్తృత సంబంధాలు కలిగిన ఈ వర్గాల పట్ల ముస్లిం పాలకులు ఎప్పుడూ అప్రమత్తంగానే ఉండేవారు. దేశస్థ బ్రాహ్మణుల సంగతినే తీసుకుందాం. జిల్లా పాలనా యంత్రాంగాన్ని తమ బంధువర్గంతో నింపేసే వారు. ఒక శిరస్తాదారుకు చెందిన 74 మంది బంధువులు జిల్లా ఆఫీసు ఉద్యోగాల్లో ఉండటమే ఇందుకు నిదర్శనం. కులం, బంధుత్వం ఆసరా లేకుండా ఉద్యోగాలు, పదవులు సంపాదించటం ఆనాడు చాలా కష్టం. కులప్రీతి ఉన్నచోట కుట్రలు, కుహకాలు, ముఠాలు తప్పవు. లంచాలను ఎరవేయటం 1830ల నాటికి ఎక్కువగానే ఉండేది. ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేయటం 1850ల నాటికి కూడా బ్రిటిషు వారికి సాధ్యం కాలేదు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాబల్యకులాలు ఏవంటే కమ్మ, రెడ్డి, వెలమ, కాపు పేర్లు వెంటనే స్ఫురణకు వస్తాయి. రెండు వందల ఏళ్ల వెనక్కి వెళితే ఈ జాబితాకు అతి ముఖ్యంగా చేర్చాలింది బ్రాహ్మణ కులమే. ఎందుకంటే పాలనా యంత్రాంగంలోనే కాకుండా జమిందార్లుగా, భూస్వాములుగా కూడా బ్రాహ్మణులు ఉండేవారు. గుంటూరు జిల్లాలో అయిదు జమిందారీ పరగణాలు ఉండేవి. 882 గ్రామాలు, 36 పట్టణాలు (గ్రామపరిధుల్లోనే) ఉండేవి. గ్రామాలను 14 సమితులుగా విభజించారు. 1847 నాటికి జిల్లాలో 4,11,599 మంది నివసించే వారు. జమిందార్లకు ఒకనాడు శిస్తు వసూలు అధికారమే మాత్రమే ఉండేది.

భూములపై యాజమాన్య హక్కులు ఉండేవి కావు. అయిదు జమిందారీల్లో వెలమ కులానికి చెందిన మాణిక్‌రావు కుటుంబం ఎప్పటి నుంచో జమిందారీ (రేపల్లె) గిరి చలాయించేది. విజయనగర సామ్రాజ్యం కంటే ముందు నుంచి కూడా ఈ కుటుంబానికి జమిందారీ గిరి ఉండేది. మనూరురావు (చిలకలూరిపేట, సత్తెనపల్లి) పేరుతో రెండు దేశస్థ కుటుంబాల కింద రెండు జమిందారీలు ఉండేవి. తెలగ కుటుంబానికి చెందిన మల్‌రాజు కింద మరో జమిందారీ (నరసరావుపేట) ఉండేది. అయిదోది జమిందారీ వాసిరెడ్డి (అమరావతి–కమ్మ) కుటుంబానిది. గోలుకొండ రాజ్యం పతనం తర్వాత వాసిరెడ్డి కుటుంబానికి జమిందారీ లభించింది. అమరావతి జమిందారీలో 333 గ్రామాలు ఉంటే నరసరావుపేటలో 323, చిలకలూరిపేటలో 79, సత్తెనపల్లిలో 80, రేపల్లెలో 67 గ్రామాలు ఉండేవి. 1788లో బ్రిటిషు పాలన మొదలైనా రెవిన్యూ యంత్రాంగంపై పట్టుచిక్కలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో 1802లో జమిందార్లకు తమ జమీన్లపై శాశ్వతహక్కు కల్పించే పద్ధతిని ప్రవేశపెట్టారు. పంటలో సగభాగాన్ని జమిందార్లు తీసుకునే వారు.

అందులో మూడో వంతు తమ కింద ఉంచుకుని మిగతా దాని విలువను డబ్బుగా బ్రిటిషు ఖజానాకి కట్టేవారు. బ్రిటిషు రక్షణతో యుద్ధ భయాలు తొలగటంతో జమిందారుల్లో భోగలాలస పెరిగింది. వారసత్వ తగాదాలు, విపరీత ఖర్చులతో 1850ల నాటికి జమిందారీ కుటుంబాలు ఆర్థికంగా సంక్షోభంలో పడ్డాయి.

పదవులు, ఉద్యోగాలు, సంపదలో అనుచిత ఆధిక్యతలు పదునైన భావజాలాన్ని సృష్టిస్తాయి. ఒకనాటి ఉమ్మడి మద్రాసు, మహారాష్ట్ర చరిత్రలే ఇందుకు ఉదాహరణలు. బ్రాహ్మణ వ్యతిరేక భావజాలం అందుకే అక్కడ ఊపిరిపోసుకున్నది. గుంటూరు జిల్లా చరిత్ర చెబుతున్న నిజం అదే. ఆ ఆధిక్యతలు సడలుతున్న క్రమంలో ఆ భావజాల తీవ్రత కూడా క్రమేపీ తగ్గిపోయింది.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)


రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు (ఇన్‌సెట్‌లో)ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం నగరంలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి


జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు


విజేతలు వీరే.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)


పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ప్రయాణికుల తాకిడి

బస్సులన్నీ ఫుల్

కిక్కిరిసిపోతున్న పండిట్ నెహ్రూ బస్టాండ్

- స్పెషల్స్ వేసినా సరిపోని పరిస్థితి
- దూరప్రాంతాలకు 100 స్పెషల్స్ నడిపిన ఆర్టీసీ
- రద్దీ తట్టుకోలేక లోకల్ బస్సులు కూడా దూరప్రాంతాలకు
- పెరిగిన జనాభాకు అనుగుణంగా లేని బస్సులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆర్టీసీలో సంక్రాంతి రద్దీ తారస్థాయికి చేరింది. జిల్లాలో ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులను కూడా కుదించి దూరప్రాంతాలకు నడుపుతున్నా సరిపోని పరిస్థితి ఏర్పడింది. పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ప్రయాణికులు కిక్కిరిసి కనిపిస్తున్నారు. స్థానిక బస్సులను కుదించడంతో.. ఉన్న బస్సులు కిటకిటలాడుతున్నాయి. బస్సులు ఎక్కటానికి తోపులాటలు జరుగుతున్నాయి. పండుగ ప్రయాణాల నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు 100 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. 60 ప్రత్యేక బస్సులు హైదరాబాద్ పంపించారు. రాజమండ్రికి 28 స్పెషల్స్ నడిపారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు కూడా డిమాండ్ ఏర్పడటంతో షెడ్యూల్ బస్సులకు అదనంగా ఆరు ప్రత్యేక బస్సులు నడిపారు.

ఆటోడ్రైవర్ల హవా

సిటీ బస్సులను తగ్గించడంతో ఆటోవాలాలకు డిమాండ్ పెరిగింది. పీఎన్‌బీఎస్‌లోని ప్రీపెయిడ్ ఆటోస్టాండ్‌లో ఇష్టానుసారంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఆటోవాలాలు, ప్రీపెయిడ్ స్టాండ్‌లో విధులు నిర్వహించే పోలీసులు మిలాఖత్ అయ్యారు. దీంతో నిర్దేశించిన రేట్లను అమలు చేయడం ఎప్పుడో మానేశారు. ఆటోవాలాల చేతిలో నిలువు దోపిడీకి గురవుతున్నామని ప్రయాణికులు లబోదిబోమంటున్నారు.

పెరగని బస్సుల సంఖ్య

పెరిగిన జనాభాకు అనుగుణంగా బస్సులు పెరగకపోవటం వల్ల ఈ సంక్రాంతి సీజన్‌లో నెలకొన్న రద్దీని తట్టుకునే పరిస్థితి లేకుండాపోయింది. 15ఏళ్ల కిందట అప్పటి జనాభాకు అనుగుణంగా కొన్న బస్సులే నేటికీ తిప్పుతున్నారు. మధ్యలో నామమాత్రంగా బస్సులు కొని మమ.. అనిపించారు. దశాబ్దకాలం కిందట బస్సులు కొన్నప్పుడు ఉన్న జనాభాతో పోలిస్తే నేటి పరిస్థితికి జనాభా భారీగా పెరిగింది. మన రెండు జిల్లాల్లో కలిపి మొత్తం 1,300 బస్సులు కూడా లేవు. ఐదేళ్ల కిందటే 1,400 బస్సులు ఉండేవి. అంటే 100 బస్సులు తగ్గాయి. కొత్తగా అద్దె బస్సులు కూడా నామమాత్రంగానే తీసుకున్నా ఫలితం లేకుండాపోయింది. మూడు వేల బస్సులు కొనాలని ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నా అధికారులు ఆ దిశగా ఆలోచన మాత్రం చేయట్లేదు. తాజాగా కొత్త బస్సులు కొంటున్నామని అధికారులు చెబుతున్నా డిమాండ్‌కు అనుగుణంగా కొనుగోలు చేసే పరిస్థితి లేదు.

వైసీపీలో అంతర్మథనం

వైసీపీలో సీట్ల సర్దుబాటు అధిష్ఠానానికి పెద్ద తలపోటే తెస్తోంది. కేశినేని నాని అనుచరుడు, తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు సతీసమేతంగా వైసీపీ కండువా కప్పుకొన్నారు. పార్టీలో చేరిన గంటల వ్యవధిలోనే ఆయనకు తిరువూరు సీటు ఖరారు చేసినట్టు సమాచారం. దీంతో ఇంతకాలం వేచిచూసే ధోరణి అవలంబించిన సిటింగ్ ఎమ్మెల్యే రక్షణనిధి వైసీపీకి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమయ్యారు. ఆయన పార్టీ వీడతారన్న సమాచారంతో సమన్వయకర్తలు ఆయన్ను బుజ్జగించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తాడేపల్లి పెద్దల బుజ్జగింపులు సైతం పని చేయలేదని సమాచారం. శుక్రవారం పార్టీకి గుడ్‌బై చెప్పి, త్వరలో ఆయన టీడీపీలో కానీ, కాంగ్రెస్‌లో కానీ చేరతారన్న ప్రచారం జరుగుతోంది.

సీట్లు.. సర్దుపోట్లు

- వైసీపీలోకి నల్లగట్ల స్వామిదాసు
- నేడు వైసీపీకి తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి గుడ్‌బై
- సీఎంవోకు పిలిచి బుజ్జగించినా ఫలించని ప్రయత్నం
- నేడు హైదరాబాద్‌లో చంద్రబాబును కలవనున్న పార్థసారథి
- 3వ జాబితాలో పెనమలూరు, పెడన అసెంబ్లీ సీట్ల ఖరారు
- పెనమలూరు జోగి రమేశ్‌కు.. పెడన ఉప్పాల రాముకు..
- విజయవాడ ఎంపీ స్థానానికి కేశినేని నాని.. పార్టీలో చేరకముందే సీటు
- గంటల వ్యవధిలోనే స్వామిదాసుకు దక్కిన హామీ
- తిరువూరు సీటు ఇస్తామని చెప్పిన ఆ పార్టీ పెద్దలు


జోగి రమేశ్


ఉప్పాల రాము

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : పెడన సిటింగ్ ఎమ్మెల్యే, మంత్రి జోగి రమేశ్‌కు పెనమలూరు స్థానాన్ని కేటాయించారు. ఈ స్థానం నుంచి సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కొలుసు పార్థసారథి వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరనుండటంతో పెనమలూరును జోగికి కేటాయించారు. జోగి రమేశ్ గురువారం సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఆయనతో మాట్లాడిన వైసీపీ పెద్దలు పెనమలూరు టికెట్ ఖాయం చేసినట్టు సమాచారం. అయితే టీడీపీ ప్రభావం ఎక్కువగా ఉన్న నియోజకవర్గం నుంచి పోటీకి జోగి వెనుకాడుతున్నట్టు సమాచారం. జోగి పెనమలూరు మారుతుండటంతో పెడన నుంచి వైసీపీ అభ్యర్థిగా ఉప్పాల రాముని ఖరారు చేశారు. వాస్తవానికి ఉప్పాల రాముకి టికెట్ దక్కకుండా జోగి విశ్వప్రయత్నాలు చేశారు. పెడన టికెట్‌ను జనసేన నుంచి పార్టీలోకి చేర్చుకున్న యడ్లపల్లి రామ్ సుధీర్‌కు ఇప్పించేందుకు చివరి క్షణం వరకు ప్రయత్నించారు. కానీ ఆయన ప్రయత్నాలకు వైసీపీ అధిష్ఠానం చెక్ పెట్టింది. తాజా జాబితాతో కృష్ణా జిల్లాలో వైసీపీ అభ్యర్థులు దాదాపు ఖరారైనట్టు అయింది. ఒక్క అవనిగడ్డ స్థానంపై స్పష్టత రావాల్సి ఉంది. ఇక్కడ సిటింగ్ ఎమ్మెల్యే సింహాద్రికి అవకాశం ఇవ్వకపోవచ్చని ఆయన స్థానంలో మరొకరికి అవకాశం ఇస్తారన్న ప్రచారం ఉంది. మచిలీపట్నం నుంచి పేర్ని కిట్టు, పెడన ఉప్పాల రాము, గుడివాడ కొడాలి నాని, గన్నవరం వల్లభనేని వంశీ, పామర్రు కైలే అనీల్ కుమార్, పెనమలూరు నుంచి జోగి రమేశ్ వైసీపీ తరఫున బరిలో నిలవనున్నారు.

పార్టీలో చేరకుండానే నానీకి ఎంపీ సీటు

విజయవాడ ఎంపీ కేశినేని నాని ఇంకా వైసీపీలో అధికారంగా చేరలేదు. కానీ గురువారం విడుదలైన జాబితాలో ఆయన పేరును విజయవాడ ఎంపీ స్థానానికి ఖరారు చేశారు. విజయవాడ ఎంపీ అభ్యర్థి కోసం తాడేపల్లి పెద్దలు చాలా టెన్షన్ పడ్డారు. చివరి నిమిషంలో నాని వైసీపీ పంచన చేరడంతో ఆగమేఘాలపై టికెట్ ఖరారు చేశారు.

నేడు చంద్రబాబును కలవనున్న సారథి

పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యే కె.పార్థసారథి శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో టీడీపీ అధినేత చంద్రబాబును కలవనున్నారని సమాచారం. సారథిని నూజివీడు నుంచి బరిలోకి దించాలని టీడీపీ అధినేత భావిస్తున్నారు.

పెనమలూరు నుంచి జోగి రమేశ్ రంగంలో ఉన్న నేపథ్యంలో టీడీపీ కూడా బీసీని బరిలోకి దించాలని భావిస్తే సారథికి పెనమలూరు దక్కే అవకాశం ఉంది. సారథి కూడా పెనమలూరు నుంచే పోటీకి సుముఖత చూపుతున్నారు.



అంగన్వాడీల సమ్మె 31వ రోజు గురువారం కూడా కొనసాగింది. ధర్నాచౌక్‌లో చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఏడో రోజుకు చేరగా, అంగన్వాడీలు వినూత్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు.

బరితెగిస్తున్నారు!

- అంపాపురంలో 50 ఎకరాల్లో బరులు, వాహనాలకు పార్కింగ్
- పందెంరాయుళ్లకు సాంకేతికతతో కూడిన ప్రత్యేక సౌకర్యాలు
- చీకోటి ప్రవీణ్ సూచనలతో కట్టుదిట్టంగా ఏర్పాట్లు
- ఎన్నికల ఏడాది కావడంతో భారీగా కోడి పందేలు

- 6లో..



విజయవాడ రైల్వే డివిజన్ ఉద్యోగుల నిరసన దీక్ష

కొత్త పెన్షన్ స్కీమ్ మాకొద్దు

- ఓపీఎస్ కోసం నినదించిన రైల్వే ఉద్యోగులు
- డీఆర్ఎం కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సామాజిక భద్రత లేని నూతన పెన్షన్ విధానం వద్దని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎంయూ) విజయవాడ డివిజన్ ప్రధాన కార్యదర్శి లీల అన్నారు. ఉద్యోగులకు భద్రత లేని ఈ విధానాన్ని రైల్వే కార్మికులు ముక్తకంఠంతో తిప్పికొట్టాలన్నారు. గురువారం అలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్), దక్షిణ మధ్యరైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎంయూ)లు సంయుక్త పిలుపు మేరకు విజయవాడ డివిజన్ వ్యాప్తంగా ఎన్‌పీఎస్ రద్దు-ఓపీఎస్ సాధన కోసం నిరాహార దీక్షలు నిర్వహించారు. డివిజినల్ పరిధిలోని అన్ని స్టేషన్లు, యూనిట్లు, డిపోలు, ఇంజనీరింగ్ విభాగాల వద్ద రైల్వే కార్మికులు నిరాహార దీక్షలు చేశారు. విజయవాడ డీఆర్ఎం కార్యాలయం ఎదుట జరిగిన నిరాహార దీక్ష కార్యక్రమంలో లీల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాత పెన్షన్ విధానంలో నలభై సంవత్సరాలు ఉద్యోగం చేసి పదవీవిరమణ చేస్తే చివరి రోజు వచ్చే జీతంలో సగం భాగం మాత్రమే పెన్షన్ వస్తుందని, నూతన పెన్షన్ విధానంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు రెండువేల నుంచి ఐదు వేల రూపాయలు మాత్రమే పెన్షన్ ఇవ్వడం దారుణమన్నారు. రాబోయే ఎన్నికల్లో పాత పెన్షన్ కొనసాగిస్తామని చెప్పిన వారినే గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డివిజన్ అధ్యక్షులు రామగుప్త మాట్లాడుతూ, నూతన పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులకు చివరికి మిగిలేది ఏమీ ఉండదని, ఆవేదన చెందారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచటం కోసమే తాము ఆందోళనలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. దీనిలో భాగంగా దేశవ్యాప్తంగా నిరాహార దీక్షలు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో సమ్మెకు కూడా వెళ్లే పరిస్థితులు ఉన్నందున కార్మికులంతా కలిసికట్టుగా రావాలన్నారు. ఆందోళనలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు వి.ఉమామహేశ్వరరావు పాల్గొని మద్దతు పలికారు. కార్యక్రమంలో లక్ష్మీ, శేఖర్‌బాబు, ప్రసాద్, సుధీర్, భానుబాబు, అహ్మద్ షరీఫ్, శ్రీనివాసరావు, హారిక, అప్పలనాయుడు, షౌకత్ అలీ, వెంకటేశ్వరరావు, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కృష్ణా కలెక్టర్ రాజాబాబు

రూ.14.50కోట్లు జగనన్నతోడు రుణాల పంపిణీ

- కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జగనన్నతోడు పథకం చిరువ్యాపారులకు ఆర్థికంగా ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. 8వ విడత జగనన్నతోడు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాలునుంచి వర్చువల్‌గా కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 8వ విడత 13710మంది లబ్ధిదారులకు రూ.14.50కోట్ల రుణాలు అందజేసినట్టు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 59వేలమంది లబ్ధిదారులకు రూ.130కోట్లను అందించినట్టు తెలిపారు. 27913మంది లబ్ధిదారులకు రూ.67.94లక్షలను వడ్డీగా జమచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో బందరు ఎమ్మెల్యే పేర్నినాని, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, గ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, ముడా చైర్‌పర్సన్ బొర్రా వెంకటనాగలక్ష్మి, మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జగనన్న తోడు, వడ్డీ జమ చెక్కులను కలెక్టర్, ఎమ్మెల్యేలు లబ్ధిదారులకు అందజేశారు.

అరాచక పాలన నుంచి విముక్తి కావాలి

- దేవినేని ఉమా


ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఉమా

గొల్లపూడి, జనవరి 11 : జగన్ అరాచకపాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కావాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం రాయనపాడులో ఆయన ధాన్యం రాశులను రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడుతూ, సీఎం అసమర్థ, చేతగానితనం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పట్టిసీమ దండగ అని పంపులు పీకాలన్న దుర్మార్గమైన ఆలోచనతో నాలుగేళ్ల పంటలు లేకుండా పోయాయన్నారు. జూలై నెలలో పట్టిసీమ పంపులు మొత్తం వదిలి ఉంటే నవంబరులోపే పంటలు చేతికి వచ్చేవని.. రైతుల పంటలు తుఫాన్ బారిన పడేవి కావన్నారు. ఎన్నికల్లో ఓటు ఆయుధంతో జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లను తిట్టే వారికి వైసీపీ టికెట్లు ఇస్తుందన్నారు. విభజన కంటే వైసీపీ పాలనలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. కార్యక్రమంలో శీలంనేని సాంబశివరావు, పోలసాని సుబ్బారావు, జాస్తి రామకృష్ణ, కాటమనేని శివ ప్రసాద్, మురళీ, మల్లెల శ్యాం కుమార్ బొర్రా నాగేశ్వరరావు, చప్పిడి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల లెక్క ఇవ్వండి

- ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో.. టీచర్ల డేటా సేకరణ

విజయవాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల విధులలో ఉపాధ్యాయులు పాల్గొనేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలో ఉపాధ్యాయుల డేటా సేకరణకు జిల్లా ఎన్నికల యంత్రాంగం పూనుకుంది. టీచర్ల డేటా సేకరణకు తక్షణం శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా 5012 మంది టీచర్లు ఉన్నట్టు జిల్లా ఎన్నికల యంత్రాంగానికి విద్యాశాఖ వివరాలు అందించింది. వీరిలో 4 వేల మంది ఎన్నికల విధులలో పాల్గొనటానికి సిద్ధంగా ఉన్నారని తెలిపింది. అనారోగ్యం కలిగిన వారు, దివ్యాంగులు పోను 4000 మంది టీచర్లు ఎన్నికల విధులలో పాల్గొనటానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొంది. జిల్లా యంత్రాంగం టీచర్ల డేటాను సేకరించటానికి ఆన్‌లైన్ ఫామ్‌లో వారి ఐడీ, పేర్లు, తదితర వివరాలు నమోదు చేసుకునేలా లింక్‌ను జిల్లా విద్యాశాఖకు పంపించింది. జిల్లా విద్యాశాఖ ఈ లింక్‌ను ఉపాధ్యాయులకు పంపి వివరాలు నమోదు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.

సమ్మెను తాత్కాలికంగానే విరమించాం

- కె.ఉమామహేశ్వరరావు

ధర్నాచౌక్, జనవరి 11 : మున్సిపల్ కార్మికుల్లో అన్ని సెక్షన్ల కార్మికులకు న్యాయం జరగని కారణంగా సమ్మెను విరమించలేదని, తాత్కాలికంగా మాత్రమే వాయిదా వేయడం జరిగిందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ధర్నాచౌక్‌లో మున్సిపల్ కార్మికులు చేపపట్టి ధర్నా 17వ రోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీర్, వాటర్, పార్క్, మెకానిక్, స్ట్రీట్ లైట్ విభాగాల కార్మికులకు ఒక్క రూపాయి జీతం పెరగలేదన్నారు. ఐఏఎస్‌లతో కమిటీ ఏర్పాటు చేసి వారం రోజుల్లోగా పెంచేందుకు ఉన్న అవకాశాన్ని పరిశీలిస్తామని ప్రభుత్వం చెప్పిందన్నారు. అన్యాయం జరిగిన సెక్షన్ల కార్మికులకు సీఐటీయూతో పాటు అన్ని సెక్షన్లు అండగా ఉంటాయన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్.బాబురావు మాట్లాడుతూ ఇది మున్సిపల్ కార్మికుల విజయమన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు మిగిలిన వారు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. దోనేపూడి కాశీనాథ్, టి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి అంగన్వాడీల నిరసన

ధర్నాచౌక్, జనవరి 11: అంగన్వాడీలకు వేతనాలు, గ్రాట్యూటీ డిమాండ్లపై యూనియన్లతో చర్చించి వాటిని పరిష్కరించాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 31 రోజులుగా చేస్తున్న రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా స్థానిక ధర్నాచౌక్‌లో చేపట్టిన రిలే నిరహారదీక్షలు గురువారం ఏడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా మోకాళ్లపై నిలబడి అంగన్వాడీలు తమ నిరసన వ్యక్తం చేశారు. వక్తలు మాట్లాడుతూ అంగన్వాడీల ఉద్యమం లబ్ధిదారులతో పాటు ప్రజల మద్దతు పొందిందన్నారు. 45వ జాతీయ కార్మిక సమాఖ్య సిఫార్సులను అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సీఐటీయూ నేత డీవీ.కృష్ణ, శ్రామిక మహిళా నేత కె.ధనలక్ష్మీ, మధ్యాహ్న భోజన పథకం నేత దయా రమాదేవి తదితరులు ప్రసంగించారు.

తాడోపేడో..


జగ్గయ్యపేటలో అంగన్వాడీ కార్యకర్తల మానవహారం



- పొర్లు దండాలు, సాష్టాంగ నమస్కారాలు, మానవహారం
- వేడి పెంచుతున్న నిరసనలు
- 31వ రోజుకు అంగన్వాడీల సమ్మె

మచిలీపట్నం టౌన్/జగ్గయ్యపేట జనవరి 11 : కనీస వేతనాలు చెల్లించాలంటూ జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె గురువారం 31వ రోజుకు చేరింది. కార్యకర్తలపై ఎస్మా ప్రయోగించి నోటీసులు జారీచేసినా భయపడేది లేదంటూ సమ్మెను కొనసాగించారు. కార్యకర్తలు పలురీతిలో నిరసన దీక్షలు, ధర్నాలు, జైల్‌భరోలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సంఘ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, ప్రాజెక్టు నాయకురాలు రజనీరాణి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద నిర్వహించిన దీక్షల్లో వివిధ మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు. ఉద్యమానికి సీఐటీయూ, పలు ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. 31 రోజులకు గాను శిబిరంలో పూలదండలతో నిరసన వ్యక్తం చేశారు. 31 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదని అంగన్వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.


మచిలీపట్నంలో..

● జగ్గయ్యపేటలో అంగన్వాడీ కార్యకర్తలు నిరసనల జోరు పెంచారు. 31వ రోజు కార్యకర్తలు మానవహారం నిర్వహించారు. కార్యకర్తలు పోర్లుదండాలు పెడుతూ, సాష్టాంగ నమస్కారాలు చేశారు. రాష్ట్రమంతా స్పందిస్తున్నా సీఎం జగన్‌కు మాత్రం చీమ కుట్టినట్టు లేదని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎస్మా చట్టాలు ఎన్ని తెచ్చినా ఆందోళన విరమించేది లేదని, డిమాండ్ల సాధనకు ఎంత దూరమైనా వెళతామని హెచ్చరించారు.

సీఎం జగన్ మౌనం వీడాలి

- సమస్యలు పరిష్కరించకుంటే తాడేపల్లి ప్యాలెస్ ముట్టడిస్తాం

కంకిపాడు : అంగన్వాడీల నిరవధిక సమ్మెను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోకుండా బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ అనుబంధ సంఘం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత అన్నారు. కంకిపాడులో అంగన్వాడీల సమ్మెకు గురువారం ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.10 లక్షల మంది సమ్మెలో పాల్గొంటే సంబంధిత శాఖ మంత్రి నిద్ర పోతున్నారా.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాదయాత్రలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అంగన్వాడీలకు రూ. 4 వేల నుంచి రూ. 10500కు జీతాలను పెంచిందని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం పెంచింది కేవలం రూ. 1 వెయ్యి మాత్రమే అన్నారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగల కొడతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. అవసరమైతే తాడేపల్లి ప్యాలెస్‌ను ముట్టడిస్తామన్నారు. అంగన్వాడీల సమ్మెకు టీడీపీ పూర్తిగా మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, తాడిగడప మున్సిపాలిటి అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్, టీడీపీ మండల అధ్యక్షులు సుదిమళ్ల రవీంద్ర, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు లలిత, నియోజకవర్గ అధ్యక్షురాలు అన్నవరపు శివపార్వతి స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బరి తెగిస్తున్నారు!

- అంపాపురంలో 50 ఎకరాల్లో బరులు, వాహనాలకు పార్కింగ్
- పందెం రాయుళ్లకు సాంకేతికతో కూడిన ప్రత్యేక సౌకర్యాలు
- చీకోటి ప్రవీణ్ సూచనలతో కట్టుదిట్టంగా ఏర్పాట్లు
- ఎన్నికల ఏడాది కావడంతో భారీగా కోడి పందేలు, జూదాలు


అంపాపురంలో సిద్ధం చేస్తున్న ప్రధాన బరి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 11 : తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద పండుగైన సంక్రాంతికి అంతే భారీగా కోడిపందేల నిర్వహణ కోసం బరులు సిద్ధం చేస్తున్నారు. తెలుగురాష్ట్రాలతో పాటు కర్ణాటక, ఒడిసా తదితర రాష్ట్రాల నుంచి కూడా వచ్చి పందేలలో పాల్గొనే అతిపెద్ద బరిగా పేరుగాంచిన అంపాపురంలో నిర్వాహకులు ఈసారి ఎక్కడా తగ్గకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీఏటా మూడు రోజుల పాటు జరిగే కోడిపందేలు ఈసారి మరింత ఎక్కువగా జరిగే విధంగా సాంకేతికతో కూడిన కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. కోతముక్క, అందర్ బాహర్, తీన్‌పత్తీ లాంటి వాటి కోసం భారీ యంత్రాల సాయంతో ప్రత్యేకంగా గదులు కూడా ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం. పండుగ ఇంకా మూడు రోజులే ఉండటంతో ఇప్పటికే 50 ఎకరాలకు పైగా భూమిని చదును చేసి బరుల ఏర్పాటు ముమ్మరం చేస్తున్నారు. 20 ఎకరాల్లో బరులు, మిగిలిన భూమిని కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఉండేలా ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. మరో పక్క కె.సీతారాంపురంలో మరో పెద్ద బరి వైసీపీ రాష్ట్ర స్థాయి నేత అండదండలతో భారీగా తయారవుతోంది. ఆదాయం కోట్లలో ఉండటంతో మరికొంతమంది నాయకులు గ్రామాల్లో బరులను కూడా ప్రోత్సహిస్తున్నారు. బాపులపాడు మండలంలోనే ఈసారి కోట్లలో పందేలు జరుగుతాయని పందెపురాయుళ్లు ఉవ్విళ్లూరుతున్నారు.

● సాంకేతికత సొబగులు

అంతర్జాతీయ స్థాయిలో చేయితిరిగిన చీకోటి ప్రవీణ్ సూచనలతో అంపాపురం బరికి సాంకేతిక సొబగులు అద్దుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్ నిర్వహణకు, వీడియోల ద్వారా కోడిపందేలు తిలకిస్తూ పందెం కాసేందుకు కావలసిన ఏర్పాటు, నెట్‌వర్క్‌లతో ఇబ్బంది లేకుండా వైఫై సదుపాయం కూడా ఏర్పాటు చేస్తున్నారు. 24 గంటలూ అన్ని రకాల జూదాల నిర్వహణకు భారీ ఫ్లడ్ లైట్లు, పెద్ద పెద్ద టెంట్లతో ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ప్రధాన బరిలో జరిగే లక్షల్లో పందేలను చూసేందుకు ప్రేక్షకులకు, పందెపురాయుళ్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా భారీతెరలు, కూర్చునేందుకు సోఫాలు, ఏసీలు వంటి సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. పేకాట కోసమైతే ప్రత్యేక శిబిరం, పాల్గొన్న వారికి కూర్చున్నచోటే సకల సౌకర్యాలు(మందు, విందు) అందేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

● కట్టుదిట్టమైన ఏర్పాట్లు

గత ఏడాది పోలీసుల దాడిని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లను కట్టుదిట్టం చేస్తున్నారు. ఈసారి బరులు మొత్తం సీసీ కెమెరాలతో పాటు బౌన్సర్లను కూడా భారీగా సిద్ధం చేస్తూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పందెపురాయుళ్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, ఇతర రాష్ట్రాలతో పాటు విదేశీ మద్యం కూడా అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసినట్టు నిర్వాహకుల్లో ఒకరు తెలిపారు. అనుమతితో తప్ప అన్యులెవరూ రాకుండా అన్ని విధాలుగా ఏర్పాట్లతో పాటు ఆవరణ మొత్తం తమ కనుసన్నల్లో ఉండేలా సీసీ కెమెరాలు, వాకీటాకీలతో కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల ఏడాది కావడంతో కోడిపందేల నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు రావనే ధీమాతో భారీస్థాయి నిర్వహణకు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈసారి బాపులపాడు మండలంలోని రెండు ప్రధాన బరులతో పాటు, గ్రామల్లో నిర్వహించే చిన్నపాటి బరుల్లో కోట్లాది రూపాయల జూదం జరుగుతుందని పందెపురాయుళ్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నాని వెంట నడిచేది లేదు

- తేల్చి చెప్పిన నందిగామ టీడీపీ శ్రేణులు


నారా లోకేశ్‌తో ఎంఎస్ బేగ్, పశ్చిమ టీడీపీ శ్రేణులు

నందిగామ, జనవరి 11 : అరవై శాతం కాదు కదా అరశాతం కూడా నందిగామ నుంచి ఎంపీ కేశినేని నాని వెంట నడిచే పరిస్థితి కనపడటం లేదు. కేశినేని తెలుగుదేశం పార్టీలో ఉండగా నందిగామ నుంచి పలువురు నాయకులు ఆయనతో సన్నిహితంగా ఉండే వారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో అరవై శాతం టీడీపీని ఖాళీ చేస్తానని అహంభావంతో ఆయన వ్యాఖ్యానించారు. నందిగామ టీడీపీ నుంచి ఆయన వెంట అరశాతం కూడా కదిలే పరిస్థితి కనిపించడడం లేదు. ఎన్టీఆర్ హయాంలో రాష్ట్రంలో చక్రం తిప్పిన వసంత నాగేశ్వరరావు వంటి నేతలు పార్టీ మారిన సమయంలో ఒక్కరు కూడా ఆయన్ను అనుకరించి పార్టీ మారలేదు. కేశినేని పలుమార్లు పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు, వ్యతిరేక ప్రటనలు చేసిన సమయంలో టీడీపీ కేడర్ భరిస్తూ వచ్చింది. ఏకంగా వైరి పక్ష ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ఆకాశానికి ఎత్తుతూ, స్వపక్ష నేతలను కించపరిచే వ్యాఖ్యలు నాని చేశారు. ఏడు నియోజకవర్గాల్లో ఆయనకు కొంత అనుచరగణం ఉంది. నిత్యం కలుస్తూ విధేయత చాటుకొనే నేతలున్నారు. ఇటీవల నందిగామలో ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన కేశినేనికి ఆయన అనుచరులు భారీ స్వాగతం పలికారు. పూలపై నడిపించారు. అదంతా తన సొంత బలంగా భావించిన ఆయన నందిగామ ఇన్‌చార్జిని కూడా మార్చాలన్న అభిప్రాయాన్ని పలుమార్లు వ్యక్తం చేశారు. కొందరు ఆశావహులను చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లారు. కేశినేని ప్రయత్నాలను తోసిపుచ్చిన చంద్రబాబు ఇన్‌చార్జిగా సౌమ్య అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఈ క్రమంలో కేశినేని జగన్‌ను కలవడం, ఆపై చంద్రబాబును తక్కువగా మాట్లాడటంతో ఒక్కసారిగా చిత్రం మారిపోయింది. ఆయన వెంట వెళ్లడం మాట అటు ఉంచితే కనీసం ఆయన మొఖం చూడడానికి కూడా పార్టీ శ్రేణులు ఇష్ట పడటం లేదు. చంద్రబాబును దూషించడంతో పాటు అమరావతికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడాన్ని టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేక పోతున్నాయి. ఆయనతో పాటు పార్టీ మారే ప్రసక్తి లేదని పలువురు స్పష్టం చేస్తున్నారు. ఎంపీ వెళ్లిపోవడంతో పార్టీ మొత్తం ఏకతాటిపైకి వచ్చినట్టు చెబుతున్నారు.

టీడీపీలోనే కొనసాగుతాం

- నారా లోకేశ్‌తో ఎంఎస్ బేగ్

వన్‌టౌన్ : తెలుగుదేశం పార్టీలోనే తాము కొనసాగుతామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత ఎంఎస్ బేగ్ స్పష్టం చేశారు. గురువారం ఉండవల్లిలో నారా లోకేశ్‌ను ఎంఎస్ బేగ్, నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన లోకేశ్‌కు శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా బేగ్ మాట్లాడుతూ, వైసీపీలోకి వెళ్లిన ఎంపీ కేశినేని నానితో తాము వెళ్లడం లేదని టీడీపీలోనే కొనసాగుతామని చెప్పారు.

తిరువూరు సాకు మాత్రమే..

- శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట : ఇష్టం లేకపోతే పార్టీని విడిచి వెళ్లాలే కాని, రెండుసార్లు ఎంపీని చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేశ్‌లపై వ్యాఖ్యలు చేయటం కేసినేని నానికి తగదని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ కోశాధికారి శ్రీరాం తాతయ్య అన్నారు. తిరువూరు ఘటన ఒక సాకేనన్నారు. తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, విజయవాడ పార్లమెంట్ స్థానం సహా అన్ని స్థానాల్లో టీడీపీ విజయం ఖాయమన్నారు. చంద్రబాబు రా.. కదలిరా పిలుపు మేరకు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని శ్రీరాం తాతయ్య అన్నారు. శనివారం పెనుగంచిప్రోలులో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తాతయ్య వివరించారు.

తిరుపతమ్మ రంగుల ఉత్సవం జయప్రదం చేయాలి : ఆర్డీవో

పెనుగంచిప్రోలు, జనవరి 11 : ఫిబ్రవరిలో జరగనున్న తిరుపమ్మ రంగుల ఉత్సవాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని నందిగామ ఆర్డీవో సాయిబాబు అన్నారు. ఉత్సవ ఏర్పాట్లపై ఈవో కె.రమేశ్ నాయుడు అధ్యక్షతన గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఫిబ్రవరి 1న అమ్మవారు సహదేవతలు దేవస్థానం నుంచి పడమర బజారున ఉన్న రంగుల మండపం వద్దకు చేరుకొని అక్కడి నుంచి అదేరోజు రాత్రి 11 ఎద్దుల బండ్లపై బయలుదేరి ఫిబ్రవరి 2న ఉదయం 10 గంటలకు జగ్గయ్యపేటలోని రంగుల మండపం వద్దకు చేరుకుంటాయని ఈవో తెలిపారు. అనంతరం ఫిబ్రవరి 18న జగ్గయ్యపేటలో పల్లకీలో బయలుదేరి వయా చిల్లకల్లు, భీమవరం, లింగగూడెం గ్రామాల మీదుగా 20న సాయంత్రానికి పెనుగంచిప్రోలుకు చేరుకుంటాయని తెలిపారు. ఆర్డీవో సాయిబాబు మాట్లాడుతూ, రంగుల ఉత్సవం సందర్భంగా ప్రధానంగా పారిశుధ్యంపై గ్రామ పంచాయతీతో పాటు పలుశాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఏసీపీ కె.జనార్ధన నాయుడు మాట్లాడుతూ, ఉత్సవానికి భారీ బందోబస్తు చేస్తున్నామన్నారు. సమావేశంలో తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీవో పి.హర్షాసాయి, ధర్మకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- ఉపాధి పనుల కల్పనలో కృష్ణాకు రెండోస్థానం : కలెక్టర్ రాజాబాబు


ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న జేసీ

మచిలీపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబరు నుంచి అధికారులతో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ, జిల్లాలో ఉపాధిహామీ పథకం ద్వారా 68లక్షల పనిదినాలను కల్పించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 66లక్షల పనిదినాలను కల్పించి రాష్ట్రంలోనే రెండోస్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో 252 సచివాలయ భవనాలకు గాను ఇప్పటివరకు 203 భవనాల నిర్మాణం పూర్తి చేసినట్టు తెలిపారు. 172 ఆర్‌బీకేల భవన నిర్మాణాలు ప్రారంభించి 122 నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. మూడోదశ భూమి రీ సర్వే 106గ్రామాలలో ప్రారంభించి 90 గ్రామాలలో తుది ఆర్‌వోఆర్ పూర్తిచేయడం జరిగిందన్నారు. సమావేశంలో జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో పి.రోజా, డీఎం అండ్‌హెచ్‌వో గీతాబాయి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమత సంకల్ప కార్యక్రమంలో భాగంగా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై జెడ్పీ కన్వెన్షన్‌హాలులో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను జేసీ గీతాంజలి శర్మ గురువారం పరిశీలించారు. ఈ నెల19న విజయవాడలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా రూపొందించిన కార్యక్రమాలను జిల్లాలో సక్రమంగా అమలు చేయాలని జేసీ అధికారులను ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎస్పీ

చోరీ సొత్తు స్వాధీనం

- నిందితుడి అరెస్టు

మచిలీపట్నం టౌన్, జనవరి 11 : ఇనకుదురు స్టేషన్ పరిధిలో పట్టపగలు ధాన్యం వ్యాపారి ఇంట్లో చోరీ చేసిన బంగారు ఆభరణాలు, నగదును పోలీసులు రికవరీ చేశారు. నిందితుడు ఉప్పాల శివసాయిరామ్‌ను అరెస్టు చేశారు. మచిలీపట్నం ఇన్‌చార్జి డీఎస్పీ యు.నాగరాజు గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ధాన్యం వ్యాపారి పద్మనాభుని చిననాగేశ్వరరావు ఈనెల 25న ఆసుపత్రి పని నిమిత్తం విజయవాడ వెళ్లి రాత్రి వచ్చేసరికి తలుపులు పగులకొట్టి ఉన్నాయి. బీరువా బద్దలకొట్టి ఉండటంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇనకుదురు సీఐ ఎ.ఉమామహేశ్వరరావు, ఎస్ఐలు సత్యనారాయణ, కిషోర్‌లు కేసు విచారణ చేపట్టి నిందితుడు ఉప్పాల శివసాయిరామ్ నుంచి రూ.23.50లక్షల విలువైన 429 గ్రాముల బంగారు, వెండి ఆభరణాలు, రూ.3.19లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ. 26.69లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, తన ఇంటి వెనుక గుంతలో ఆభరణాలు దాచినట్టు తేలిందన్నారు. కేసు ఛేదించిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.




వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

వాహన తనిఖీలు.. 15 కేజీల వెండి స్వాధీనం

బంటుమిల్లి : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో పోలీసులు గురువారం పలుచోట్ల దాడులు నిర్వహించారు. సీఐ హబీబ్ బాషా ఆధ్వర్యంలో ఎస్సై పైడిబాబు సిబ్బంది నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రెండు మద్యం బాటిళ్లు, విజయవాడకు చెందిన వ్యాపారి నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా సుమారు 15 కేజీల వెండి వస్తువులను స్వాధీనపరచుకుని కేసు నమోదు చేశారు. అలాగే అమలాపురానికి చెందిన వ్యక్తి నుంచి రూ.3.84 లక్షలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ



బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95, 103, 114
చికెన్ విత్ స్కిన్	184
చికెన్ స్కిన్‌లెస్	194
నెక్ కోడిగుడ్డు ధర	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55	

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

బస్టేషన్: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, భద్రతా ప్రమాణాలు పాటించే దిశగా ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, ఫిర్యాదుల స్వీకరించేందుకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల మధ్యలో నిర్వహించనున్నట్లు గవర్నరుపేట-2 డిపో మేనేజర్ ఏ.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు 9959225456 నంబర్‌కు డయల్ చేసి తెలియ జేయవచ్చన్నారు.









కేశినేని చిన్నికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ బాలస్వామి

మర్యాదపూర్వక కలయిక

గవర్నర్‌పేట, జనవరి 11: విజయవాడ పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి కేశినేని శివనాథ్ (చిన్ని)ని ఆయన నివాసంలో టీడీపీ ఫ్లోర్‌లీడర్, 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని, నగరంలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు. గురువారం టీడీపీ సీనియర్ నేతలు ఎరుబోతు రమణ, గంటా కృష్ణమోహన్, ఇప్పిలి మోహన్, సింగం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభానికి లక్షలాదిగా తరలిరావాలి

● నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ రసూల్

గవర్నర్‌పేట, జనవరి 11: మహాత్మాగాంధీ రోడ్డులో ప్రారంభానికి తుది మెరుగులు దిద్దుకుంటున్న అంబేడ్కర్ స్మృతివనం ప్రాంగణాన్ని నూర్ బాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ ఓ. రసూల్ సాహెబ్ గురువారం సందర్శించిన అనంతరం స్వర్ణప్యాలెస్ హోటల్‌లో అంబేడ్కర్ స్మృతివనం విశేషాలను తెలియజేసే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19న జరగనున్న స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నూర్ బాషా దూదేకుల సంఘీయులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నూర్ బాషా దూదేకుల ముస్లిం సంఘం ఏపీ అధికార ప్రతినిధి షేక్ సయ్యద్ బాజీ, సంఘ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు షేక్ శ్రీను బాషా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. చినమస్తాన్, నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

భార్య మృతి కేసులో భర్తకు ఐదేళ్ల జైలు, జరిమానా

విజయవాడ లీగల్, జనవరి 11 : అదనపు కట్నం కోసం భార్యను చిత్రహింసలకు గురిచేసి ఆమె మృతికి కారకుడైన భర్తపై నేరం రుజువుకావడంతో ఐదేళ్ల జైలుశిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ మహిళా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఐశైలజా దేవి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం చిట్టినగర్‌కు చెందిన శిరీష, నందమూరి నగర్‌కు చెందిన బాణం రాజేష్‌లు ప్రేమించుకుని ఇరుకుటుంబాల పెద్దల అంగీకారంతో 2018లో వివాహం చేసుకొన్నారు. వీరికి ఒక బాబు. భర్త రాజేష్, ఆమె అత్త కలిసి శిరీషకు వచ్చిన జీతం మొత్తం భర్తకే ఇవ్వాలని, వేరొకరిని చేసుకొంటే భారీగా కట్నం వచ్చేదంటూ శిరీషను మానసికంగా, శారీరకంగా వేధించడం ప్రారంభించారు. వీరి వేధింపులు తాళలేని శిరీష పుట్టింటికి వెళ్లగా ఆమె తల్లి నచ్చజెప్పి పంపింది. 2020 మార్చి 9న శిరీష అత్త, ఆమె తల్లికి ఫోన్ చేసి మీ కుమార్తెకు బాగోలేదు, హాస్పటల్‌లో వుందని చెప్పగా వారు వెళ్లేసరికి శిరీష మృతి చెందినట్లు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. భర్త, అత్త మానసిక వేధింపుల వల్లే తన కుమార్తె చనిపోయిందని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వీరిపై కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ చంద్ర గిరి విష్ణువర్ధన్ 12 మంది సాక్షులను విచారించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, భర్తపై నేరం రుజువుకావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ప్రజల గుండెల్లో టీడీపీకి సుస్థిరస్థానం

తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 11 : ప్రాంతీయ, జాతీయ పార్టీల్లో కేంద్ర స్థాయిలో కార్యకర్తలు కలిగిన ఏకైక పార్టీ టీడీపీ అని, ప్రజల గుండెల్లో టీడీపీ చిరస్థాయిగా నిలిచి ఉంటుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. గురువారం 9వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను గద్దె ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. అనంతరం బూత్ కన్వీనర్లతో గద్దె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ గాలివాటం పార్టీ అని, యువగళం పాదయాత్ర విజయవంతం ద్వారా లోకేశ్ తన సమర్థతను నిరూపించుకున్నారని అన్నారు.



మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్, పరుచూరి అశోక్ బాబు తదితరులు

టీడీపీని నాయకులు మోసం చేసిన సందర్భాలు చాలా ఉన్నాయని, కార్యకర్తలు ఎప్పుడూ మోసం చేయలేదని చెప్పారు. సంక్షోభం వచ్చినప్పుడల్లా కార్యకర్తలు పార్టీకి అండగా నిలబడ్డారని అన్నారు. ఒక వ్యక్తి పార్టీ నుంచి బయటకు వెళ్లినంత మాత్రాన పార్టీకి నష్టం జరగదని, పార్టీ జెండా నీడన మనం ఉన్నామనే భావనలో ఉండాలే కానీ, పార్టీ నావల్లనే ఉందనే ఆలోచన సరికాదని అన్నారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ ప్రజల ఆమోదంతో కాకుండా దొంగ ఓట్లతో గెలవాలనే సంప్రదాయానికి వైసీపీ శ్రీకారం చుట్టిందని అన్నారు. రాష్ట్ర నాయకులు చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్ చెన్నుపాటి కాంతిశ్రీ, యలమంచిలి దేవేంద్ర, అన్నాబత్తుల బాబి, చిలకలపూడి లక్ష్మీ నరసింహారావు, సీహెచ్ కిరణ్, పరంధామయ్య తెలిపారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

మొగల్రాజపురం, జనవరి 11: పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో గురువారం గుడ్ హ్యాబిట్స్ క్లబ్, ఉమెన్స్ క్లబ్, మహిళాసాధికారిత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గులు, గాలిపటాలు పోటీలు, మెహందీ పోటీలు, తెలుగు అమ్మాయి, తెలుగు అబ్బాయి పేరుతో సంప్రదాయ వస్త్రధారణ పోటీలు, పొంగల్ వంటకం తయారీ పోటీలు, బొమ్మల కొలువు పోటీలు, భోగి మంటలు, హరిదాసు గానం, వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, క్లబ్స్ కన్వీనర్‌లు రోహిణి కుసుమ, భద్రజ, ఎ. కవిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో



కృష్ణలంక ఐడియల్ స్కూల్‌లో..

కృష్ణలంక: కృష్ణలంక పాత పోలీస్‌స్టేషన్ రోడ్డులోని సుధాకర్స్ ఐడియల్ స్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. బొమ్మలకొలువు పెట్టి, భోగిమంటలు వేశారు. చిన్నారులకు భోగిపళ్లు పోశారు. హరిదాసు, గోదాదేవి, శ్రీకృష్ణుడు, రైతులు వంటి విచిత్ర వేషధారణలతో చిన్నారులు అలరించారు. స్కూల్ చైర్మన్ సుధాకరరెడ్డి, ప్రిన్సిపాల్ రామకోటేశ్వరరావు, నందారపు కనకమహాలక్ష్మి, ఎస్.గాయత్రి, శ్రీదేవి, సంధ్య, భారతి, అన్నపూర్ణ, రమాదేవి, సునీల, జ్యోతిశ్రీ, ఉమ, శిరీష, ఆదిలక్ష్మి, మేఘన, కె.గాయత్రి, మల్లేశ్వరి, సుజాత పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ



గవర్నర్‌పేట, జనవరి 11: అయోధ్య రామాయలం నిర్మాణాన్ని పురస్కరించుకుని బీజేపీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, జిల్లా అధ్యక్షుడు హేమంత్ జైన్ ఆధ్వర్యంలో గురువారం రాముల వారి అక్షింతల పంపిణీ కార్యక్రమం స్థానిక బకింగ్‌హాం పేట సమీపంలోని కోదండరామాలయం నుంచి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ , బీజేపీ మైనారిటీ సెల్ జిల్లా నాయకులు వరప్రసాద్, ప్రవీణ్ రాంకా, అరవింద్ జైన్, నరేష్ జైన్, మనీష్ జైన్, కమలేష్ జైన్, మహేంద్ర జైన్, పన్నాలాల్ జైన్, దినేష్ జైన్ పాల్గొన్నారు.

స్వాములకు ఇరుముడులు కట్టే కార్యక్రమం



కృష్ణలంక, జనవరి 11: కృష్ణలంక పాత పోలీస్ స్టేషన్ రోడ్డులోని కోదండ రామాలయంలో గురువారం శబరిమలై వెళ్లే స్వాములకు ఇరుముడులు కట్టే కార్యక్రమం శరత్ గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. శరత్ గురుస్వామి స్వాములకు ఇరుముడులు కట్టారు. దీక్షాధారులు, వారి కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులు విచ్చేశారు. అనంతరం స్వాములతో అందరికీ సద్ది (అన్నప్రసాదం) ఏర్పాటు చేశారు. కోలపల్లి కోటిబాబు స్వామి, సుబ్బారావు గురుస్వామి శిష్యబృందం పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

విద్యాధరపురం, జనవరి 11: చోరీ కేసు నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.2లక్షల 15వేల, 4 ద్విచక్రవాహనాలను భవానీపురం పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. భవానీపురం స్టేషన్ పరిధిలో బైక్ దొంగతనాలపై పోలీసులకు పలు ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ విశాల్ గున్ని, వెస్ట్ ఏసీపీ కె. హనుమంతరావు పర్యవేక్షణలో భవానీపురం సీఐ కృష్ణ సిబ్బందితో పలు బృందాలుగా ఆధారాలు సేకరించి అనుమానితులు, పాత నేరస్తుల కదిలికలపై నిఘా పెట్టారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు బుధవారం రామరాజ్యనగర్ కట్ట వద్ద చెట్ల పొదల్లో అనుమానితున్ని అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడు రామరాజ్యనగర్ చెందిన షేక్ బాషా (29)గా గుర్తించారు. చోరీ చేసిన బైక్‌లను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు పంపారు.

అపార్ట్‌మెంట్ బాల్కనీ నుంచి కింద పడి మహిళ మృతి

మానసిక వ్యాధితో బాధపడుతున్న ఓ వివాహిత అపార్ట్‌మెంట్ బాల్కనీ నుంచి కిందపడి మృతి చెందిన ఘటన గురువారం భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులో నరసింహ ఎన్‌క్లేవ్‌లో డొగిపర్తి మురళీకృష్ణ కుటుంబంతో ఉంటాడు. వివాహమై పదేళ్లు అయ్యింది. ఇద్దరు పిల్లలు సంతానం. భార్య చైతన్యలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ మానసికంగా ఇబ్బంది పడుతుంది. బుధవారం మురళీకృష్ణ వ్యాపారం నిమిత్తం బయటకు వెళ్లి గురువారం తెల్లవారుజామున 4.30 కు ఇంటికి వచ్చి భార్యను పలకరించి నిద్రపోయాడు. ఉదయం 6.30 సమయంలో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ వచ్చి మీ భార్య కారు పార్కింగ్ ఎదురుగా గాయాలతో పడి ఉందని చెప్పాడు. అతను తల్లితో వెళ్లి చూసి అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. వారు వచ్చి చూసి మృతి చెందినట్లు చెప్పారు. మనస్తాపంతో ఇలా చేసుకొని ఉంటుందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.





చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 11 : గాయాలతో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి గురువారం మృతి చెందాడు. వివరాల ప్రకారం ఎంకే బేగ్ స్కూల్ ప్రాంతానికి చెందిన వెన్నెల హరికృష్ణ(34) గత నెల 10న వ్యాపారం ముగించుకుని తన ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా అజిత్‌సింగ్‌నగర్ రైతు బజార్ వద్ద కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ హరికృష్ణను ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంజే రాయ్‌కు ఘన నివాళి



పాతరాజరాజేశ్వరిపేట, జనవరి 11 : 34వ డివిజన్ కేదారేశ్వరపేటలో చింతమళ్ళ రాయుడు యువజన గ్రంథాలయం వద్ద ప్రముఖ న్యాయవాది మర్రి జోసఫ్ రాయ్ (ఎంజె రాయ్) ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని చేపట్టారు. సీపీఐ నాయకుడు బుట్టి రాయప్ప ముందుగా రాయ్ చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. సీపీఐ కార్యదర్శి కాళ్ల చిన్నప్ప, సహాయ కార్యదర్శులు దొడ్డా కుమార్, కాళ్ల విజయ్, సీహెచ్ వెలంగణమ్మ, బుట్టి లత తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే వాంబేకాలనీలో చోరీ

పాయకాపురం, జనవరి 11 : పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన వాంబేకాలనీలో గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం వాంబేకాలనీ డీ బ్లాక్ చెందిన కాలేపు రాజు కుటుంబంతో ఉంటున్నాడు. గురువారం ఉదయం భార్యాభర్తలు రోజు వారీ పనుల నిమిత్తం వెళ్లారు. సాయంత్రం వచ్చే సరికి ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉండాల్సిన 7 కాసుల బంగారపు ఆభరణాలు, రూ. 40 వేలు కనిపించలేదు. చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చి నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీ లిస్తున్నారు.

అంతర్ కళాశాలల మహిళల హ్యాండ్‌బాల్ పోటీల్లో కేబీఎన్‌కు చాంపియన్‌షిప్

వన్‌టౌన్, జనవరి 11: మైలవరంలోని డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కృష్ణావిశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల మహిళల హ్యాండ్‌బాల్ పోటీల్లో కేబీఎన్ కళాశాల విద్యార్థినీలు చాంపియన్‌షిప్ సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. గురువారం కొత్తపేటలోని కేబీఎన్ కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమిళనాడు రాష్ట్రంలో జరిగే దక్షిణ భారత్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా హ్యాండ్‌బాల్ పోటీలకు తమ కళాశాల నుంచి ఏడుగురు విద్యార్థినులు ఎంపికయ్యారని తెలిపారు. విజేతలను, కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి.హేమచంద్రరావుని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు తదితర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

బీసీలను మోసం చేస్తున్న జగన్: సింహాద్రి

విద్యాధరపురం, జనవరి 11: నా బీసీలు, నా ఎస్సీలంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో టికెట్ల కేటాయింపులో సొంత పార్టీలోని బీసీలను జగన్మోహనరెడ్డి నమ్మించి మోసం చేస్తున్నారని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సింహాద్రి కనకాచారి అన్నారు. గురువారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ ఎమ్మెల్యేలు, ఎంపీలను జగన్‌రెడ్డి కలవకుండా వారి మనోభావాలు జీవితాలతో చెలగాటమాడుతున్నాడని ఎద్దేవా చేశారు. సైకో పోవాలి సైకిల్ రావాలన్న నినాదంతో బీసీలందరూ పనిచేయాలని పిలుపునిచ్చారు.

వైసీపీ ఓటమి ఖాయం: సాదరబోయిన

వైసీపీలో బీసీ నేతలకు గౌరవం లేదని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ ఘోరంగా ఓటమి చెందటం ఖాయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాదరబోయిన ఏడుకొండలు విమర్శించారు. గురువారం పశ్చిమలోని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దిరెడ్డి, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి, సజ్జల ముందు వైసీపీ బీసీ నేతలు బానిసలుగా తలవంచుకుని బతుకుతున్నారన్నారు. త్వరలోనే బీసీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌లా కొద్దిరోజుల్లో బీసీ నేతలు వైసీపీకి గుడ్‌బై చెప్పనున్నారన్నారు. రాజగిరి అశోక్, బి.సత్తిబాబు, జి.సుధాకర్ పాల్గొన్నారు.

బీసీల ద్రోహి జగన్‌రెడ్డి: లుక్కా

బీసీ యువతకు ఉన్నత విద్యను దూరం చేసి విదేశీ విద్య అవకాశాలు లేకుండా చేసిన దుర్మార్గుడు, బీసీల ద్రోహి జగన్‌రెడ్డి అని టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్ అన్నారు. గురువారం మొగల్రాజపురంలోని టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు రావాల్సిన అనేక సంక్షేమ పథకాలను రద్దు చేసి బీసీలను మోసం చేసిన ఘనత జగన్‌రెడ్డిదేనని విమర్శించారు. ఇప్పటికైనా బీసీలు మేల్కొని వచ్చే ఎన్నికలలో బీసీల దమ్ము ఏమిటో జగన్‌రెడ్డికి చూపించాలని తెలిపారు. పలువురు బీసీ నేతలు పాల్గొన్నారు.

లయోల కళాశాలలో స్ఫూర్తి 2కే24 కార్యక్రమం

భారతీనగర్, జనవరి 11: ఆంధ్రా లయోల కళాశాలలో గురువారం సెమినార్ హాల్లో స్ఫూర్తి 2కె24 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ గ్రంథాలయ సంఘం కార్యదర్శి రావిశారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నృత్యాలు, సంగీతం, గానం, వంటి విభిన్న పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, కరస్పాండెంట్ సగాయరాజ్, స్టూడెంట్ యాక్టివిటీస్ డీన్ డాక్టర్ శుభ, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.







చిక్కులు తెచ్చిపెట్టిన నయన్ అన్నపూరణి

నెట్‌ఫ్లిక్స్ నుంచి తొలగింపు

ఇటీవలే ఓటీటీ స్ట్రీమింగ్ మొదలైన నయనతార రీసెంట్ మూవీ 'అన్నపూరణి'ని ఉన్నట్టుండి ఓటీటీ ప్లాట్‌ఫామ్ నుంచి తొలిగించారు. స్వయంగా ఆ చిత్ర నిర్మాణసంస్థ అయిన జీ స్టూడియోస్ ఈ నిర్ణయం తీసుకుంది. నిజానికి 'అన్నపూరణి' థియేటర్లలో కూడా పెద్దగా ఆడలేదు. థియేటర్లలో మిశ్రమ స్పందనతో నిర్మాతకు నష్టాలే తెచ్చిపెట్టింది. రీసెంట్‌గా ఈ సినిమాను ఓటీటీలో విడుదల చేశారు. అసలు చిక్కు ఇక్కడే వచ్చింది. కథ ప్రకారం ఇందులోని కొన్ని సన్నివేశాలు మత విశ్వాసాలను భంగపరిచేలా ఉన్నాయని పలువురు అభ్యంతరాలు వెలిబుచ్చారు. నయన్‌తోపాటు చిత్రబృందంపై మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్, ముంబైలో కేసులు నమోదయ్యాయి. దీంతో చిత్ర నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ ఈ సినిమాను ఓటీటీ స్ట్రీమింగ్ నుంచి తొలగించింది. మతవిశ్వాసాలను కించపరిచే ఉద్దేశం తమకు లేదని, తమకు అన్ని మతాలూ సమానమేనని, ఈ విషయంలో తెలిసిగానీ, తెలియకగానీ ఎవర్నయినా బాధపెట్టి ఉంటే క్షమించాలని జీ స్టూడియోస్ వివరణ ఇచ్చుకుంది. 'అగ్నిహోత్రం లాంటి సంప్రదాయ కుటుంబంలో పుట్టిన ఓ అమ్మాయి, చెఫ్ కావాలనే తన కోరికను ఎలా సాకారం చేసుకుంది?' అనే ప్రశ్నకు సమాధానమే 'అన్నపూరణి' కథ. నయనతార టైటిల్‌రోల్ పోషించిన ఈ చిత్రంలో సత్యరాజ్, జై కీలక పాత్రలు పోషించారు. నీలేశ్ కృష్ణ దర్శకుడు.

ఫిబ్రవరిలో హ్యాపీ ఎండింగ్

యష్ పూరి కథానాయకుడిగా నటించిన చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. అపూర్వ రావ్ కథానాయిక. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో యోగేష్ కుమార్, సంజయ్ రెడ్డి, అనిల్ పల్లాల నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకు తీసకొస్తున్నట్లు యూనిట్ గురువారం తెలిపింది. 'ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలకు చక్కని ఆదరణ లభిస్తోంది, వైవిధ్యమైన కథతో 'హ్యాపీ ఎండింగ్' చిత్రాన్ని రూపొందించాం' అని మేకర్స్ తెలిపారు. అజయ్ ఘోష్, విష్ణు, ఝాన్సీ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: రవి నిడమర్తి. సినిమాటోగ్రఫీ: అశోక్ సీపల్లి







స్వానుభవం





ఆధ్యాత్మికతే నేనిచ్చే ఆస్తి

చాలా మందికి ఆధ్యాత్మికత ఒక గమ్యం. కానీ హీరో వెంకటేష్‌కు అదొక ప్రయాణం. ఆ ప్రయాణంలో తాను అంతర్ముఖుణ్ణి అయ్యానంటారు వెంకటేష్. తెలియని ఒక 'సూపర్‌పవర్' మనల్ని ముందుకు నడిపిస్తోందని భావించే వెంకటేష్ 'స్వానుభవం' 'నవ్య' పాఠకుల కోసం.

'ప్రయత్నం మాత్రమే మనం చేయగలం. మిగిలినది మనకు తెలియని ఒక శక్తి చేస్తుంది. చాలా మంది మన ప్రయత్న బలం వల్లే అంతా జరిగిపోతుందనుకుంటారు. కానీ నా ఉద్దేశంలో ఒక పనిలో మన ప్రయత్నం 30 శాతమే! మిగిలిన 70 శాతం పని ఎలా జరగాలనే విషయాన్ని నిర్ణయించేది ఆ శక్తే! దానికి ఏ పేరైనా పెట్టుకోవచ్చు. కొందరు 'సూపర్ పవర్' అంటారు. మరి కొందరు 'దేవుడు' అంటారు. ఆ శక్తి గ్రాండ్ డిజైన్‌లో మనమందరం పావులమే! ఆ విషయం తెలిస్తే శాంతి లభిస్తుంది. నా జీవితంలో వేర్వేరు సమయాల్లో ఈ విషయాలు తెలుసుకుంటూనే ఉన్నా. నా చిన్నప్పుడే- అంటే పదో తరగతి చదువుతున్నప్పుడే నా ఆధ్యాత్మిక ప్రయాణం ప్రారంభమయింది. ఎందుకో తెలియదు. చిన్నప్పటి నుంచి నాకు ఆధ్యాత్మిక విషయాలపై ఎక్కువ ఆసక్తి ఉండేది. అలాగని ప్రాపంచిక విషయాలు వదిలేసేవాణ్ణి కాదు. చదువు, ఆటలు- అన్నీ మామూలే! కానీ మనని తెలియని శక్తి ఏదో నడిపిస్తోందనే విషయం చిన్నప్పుడే అర్థమయింది. కానీ స్పష్టత రావటానికి చాలా సమయం పట్టింది.

యూనివర్సల్ ఎనర్జీ

యూనివర్సల్ ఎనర్జీ పనిచేస్తూ ఉంటుంది. ప్రతి నటుడు రచయితలను కలుస్తూ ఉంటాడు. కథలు వింటాడు. మంచి పాత్రలనే ఎంపిక చేసుకోవాలనుకుంటాడు. అయితే కొందరే ఎందుకు ఎక్కువ విజయం సాధిస్తారు? దీనికి కారణం యూనివర్సల్ ఎనర్జీ. మన ప్రమేయం లేకుండానే మన ముందుకు ఒక విషయాన్ని తీసుకువస్తుంది. మనం ఆ విషయాన్ని గమనించాలంతే! ఉదాహరణకు 'దృశ్యం', 'నారప్ప' లాంటి నా రీమేక్ సినిమాలనే తీసుకుందాం. అవి ఇతర భాషల్లో పెద్ద హిట్స్. చాలా మంది నటులు వాటిని చూసి ఉంటారు కదా! కానీ అవి నా వద్దకే ఎందుకు వచ్చాయి? నా ఉద్దేశంలో అదే గ్రాండ్ డిజైన్!

అనుకోకుండా..

డిగ్రీ పూర్తి అయిన తర్వాత మాస్టర్స్ చేయటానికి అమెరికా వెళ్లా. తిరిగి వచ్చిన తర్వాత బిజినెస్ చేయాలనుకున్నా. టేకాఫ్ అవలేదు. ఆ సమయంలో అనుకోకుండా హీరో అయ్యా. ఆ సమయంలో సినిమాలు నా వృత్తి అవుతాయని ఎప్పుడూ భావించలేదు. ఒక సినిమా ఆడింది. ఆ తర్వాతి రెండు సినిమాలు ఆడలేదు. మళ్లీ హిట్స్ వచ్చాయి. నాకు తెలియని ఏదో శక్తి - నన్ను సినిమాల వైపు నడిపిస్తోందనే విషయం అర్థమయింది. హీరోగా స్థిరపడ్డా. నటుణ్ణి అయిన తర్వాత కూడా నా ఆధ్యాత్మిక ప్రయాణాన్ని వదలలేదు. ఆ రోజుల్లో నాకు మెడపై బలమైన గాయమయింది. దీనితో ఎప్పుడూ నొప్పిగానే ఉండేది. అలాంటి సమయంలో కూడా నేను నా ఆధ్యాత్మిక ప్రయాణాన్ని కొనసాగించా. ఒక వైపు షూటింగ్స్. మరో వైపు నా సాధన. జీవితం ఇలా సాగుతూ ఉండేది. ఆ తర్వాత నాకు పెళ్లయింది. నాకు, నా భార్య నీరజల మధ్య మంచి అనుబంధం ఉంది. నాకు పెళ్లైన కొత్తల్లో- మా గురువుగారు- "నీ భార్యతో నీ సంబంధం ఎలా ఉంది?" అని అడిగారు. "చాలా బావుంది" అని చెప్పా. "జీవితమనే యుద్ధంలో గెలిచావు. నీకు తిరుగులేదు" అన్నారు. ఎవరైనా జీవితంలో గెలవాలనుకుంటే- ముందు భాగస్వామి నమ్మకాన్ని, ప్రేమను పొందాలి. భార్య, భర్తలిద్దరూ వేర్వేరు కాదు... ఒకటనే విషయాన్ని తెలుసుకోవాలి. అప్పుడే జీవితంలో ఆనందం లభిస్తుంది. మనకు నచ్చిన మార్గాన్ని ఎంచుకొనే అవకాశం లభిస్తుంది. నేను ఈ రోజు ఆనందంగా ఉంటూ.. నేను ఎంచుకున్న ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించగలుగుతున్నానంటే నా భార్యే కారణం.

పిల్లలకు కూడా..

సినీ రంగంలో విపరీతమైన పోటీ ఉంటుంది. ఎప్పటికప్పుడు అప్‌డేట్ కాకపోతే వెనకబడిపోతూ ఉంటాం. అందువల్ల మన ప్రయత్నం మనం చేస్తూ ఉండాలి. అయితే- మనకెంత రావాలో అంతే మనకు దక్కుతుంది. ఎక్కువా రాదు, తక్కువా రాదు. దీనికి నా జీవితమే ఒక పెద్ద ఉదాహరణ. నేను కావాలని సినిమా రంగంలోకి రాలేదు. అది నా ఛాయిస్ కాదు. కానీ వచ్చా. నా ప్రయత్నం లోపం ఉండకూడదు. మనం ప్రయత్నిస్తూ ఉండాలి. ఈ విషయం అర్థమయితే నిరాశే ఉండదు. నన్ను చాలా మంది 'మీ డ్రీమ్ రోల్ ఏదీ' అని అడుగుతూ ఉంటారు. నాకు ప్రత్యేకంగా ఏదీ లేదు. వచ్చిన ప్రతి పాత్రను వందశాతం కష్టపడి చేస్తా. షూటింగ్ పూర్తయిన తర్వాత- నెమ్మదిగా ఆ పాత్ర నుంచి తప్పుకుంటా! ఆ తర్వాత సినిమా జయపజయాలతో నాకు సంబంధం ఉండదు. ఇలాంటి డిటాచ్‌మెంట్ ఉంటే ఎటువంటి నిరాశ ఉండదు. అయితే దానికి ఆధ్యాత్మిక బలం ఉండాలి. మా పిల్లలకు కూడా అదే చెబుతూ ఉంటా. అంతే కాదు- వాళ్లకు ఎక్కువ యాంబిషన్ కూడా వద్దని చెబుతూ ఉంటా. హార్డ్‌వర్క్ (కష్టపడి పనిచేయటం), డిసిప్లిన్ (క్రమశిక్షణ), హ్యాబిట్స్ (అలవాట్లు)- ఈ మూడే వారి భవిష్యత్తును నిర్ణయిస్తాయి. యాంబిషన్ అనే చక్రంలో చిక్కుకుంటే దాని నుంచి బయటపడే మార్గమే ఉండదు. నేను నా పిల్లలకు ఇచ్చే ఆస్తి- 'నా ఆధ్యాత్మిక మార్గమే'! ఇల్లు, కార్లు- ఇవన్నీ వస్తాయి. పోతాయి. కానీ ఈ మార్గంలో వారు ప్రయాణించగలిగితే వారు ప్రశాంతంగా, తృప్తిగా నివసించగలుగుతారు.

> నా ఆధ్యాత్మిక ప్రయాణం ద్వైతంతో మొదలై అద్వైతంవైపు సాగింది. ఇప్పుడు ఇంకా కొనసా గుతోంది. ప్రతి ఒక్కరికీ వేర్వేరు ప్రశ్నాపత్రం ఉంటుంది. ఏ ఇద్దరికీ ఒకే తరహా ప్రశ్నలు రావు. ఈ విషయాన్ని గాఢంగా నమ్మితే జీవితంలో చాలా సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి.



● సీవీఎల్ఎన్ ప్రసాద్

సద్గురువాణి

మకరసంక్రాంతి అందమైన ముగ్గులకు, గొబ్బెమ్మలకు, హరిదాసు పాటలకు, బసవన్నల ఆటలకు, నువ్వుల మిఠాయిలకు, గాలిపటాలు ఎగురవేయడానికి, మరెన్నో సంబరాలకు ప్రసిద్ధి చెందింది. దీన్ని 'పంటల పండుగ' అని, 'మార్పు తెచ్చే పండుగ' అనీ కూడా అంటారు. మకర సంక్రాంతి ప్రాముఖ్యత ఏమిటంటే... ఈ రోజు గ్రహరాశిలో... అంటే సూర్యుడి చుట్టూ భూమి తిరిగే కక్ష్యలో ఒక ముఖ్యమైన కదలిక... ఒక మార్పు చోటు చేసుకుంటుంది. సంవత్సరంలో ఎన్నో సంక్రాంతులు ఉంటాయి. వాటిలో రెండు ముఖ్యమైనవి. ఒకటి మరక సంక్రాంతి. రెండోది... సరిగ్గా ఆరు నెలల తరువాత వచ్చే కర్కాటక సంక్రాంతి. ఈ రెండిటి మధ్యా చాలా సంక్రాంతులు ఉన్నాయి. సూర్యుడు రాశి మారిన ప్రతి రోజునూ 'సంక్రాంతి' అనే అంటారు. ఎందుకంటే అది గ్రహ గమనంలో మార్పును సూచిస్తుంది. ఆ మార్పు కారణంగానే మన జీవితాల పాలన, పోషణ జరుగుతున్నాయని అర్థం చేసుకోవాలి. ఈ కదలిక లేదా మార్పు ఆగిపోతే... 'మనం' అనేది కూడా ఆగిపోతుంది. మకర సంక్రాంతి నుంచి సూర్యుడి ఉత్తరగమనం బలంగా ఉంటుంది. భూమి మీద అన్నీ మారడం మొదలుపెడతాయి. శీతాకాలం కొద్దికొద్దిగా తగ్గుముఖం పడుతుంది.

మకర సంక్రాంతిని పంట కోతల లేదా పంట నూర్పిడుల పండుగగా కూడా వ్యవహరిస్తారు. ఎందుకంటే ఈ సమయానికల్లా పంటనూర్పిడులు పూర్తవుతాయి. ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుపుకొంటారు. పొలం పనుల్లో సాయపడినవారికి కృతజ్ఞతలు తెలుపుకొంటారు. వ్యవసాయంలో పశువులు చాలా పెద్ద పాత్ర పోషిస్తాయి. కాబట్టి సంక్రాంతి తరువాతి రోజు వాటికోసమే. అదే కనుమ పండుగ. అంటే... మొదటి రోజు భోగి భూమి కోసం, రెండో రోజు మనకోసం, మూడో రోజు పాడి పశువుల కోసం. ఎందుకంటే అవి లేకపోతే మనం సుఖంగా జీవించలేం. పండుగలు అనేవి మన వర్తమానాన్ని, భవిష్యత్తును స్పృహతో మలచుకోవాలనే సత్యాన్ని గుర్తు చేస్తాయి. ఇప్పుడు మనం గత సంవత్సరం పంటను కోసుకున్నాం. తరువాతి పంటను సృష్టించడానికి ఇకపై ప్రణాళిక వేసుకోవాలి. పశువులను కూడా పరిగణనలోకి తీసుకొని, వాటిని సిద్ధం చెయ్యాలి. కాబట్టే 'పంటల పండుగ' అనే పేరు దీనికి సార్థకమయింది. అయితే ఖగోళపరంగా, ఆధ్యాత్మిక పరంగా కూడా ఈ పండుగకు విశిష్టతలు ఉన్నాయి. ఒక నిర్దిష్టమైన యోగ ప్రక్రియ నుంచి ఇది ఆవిర్భవించింది. కానీ సాధారణ ప్రజలు వారికి అనువైన పద్ధతుల్లో జరుపుకొంటున్నారు. యోగులు కొత్తగా, నూతనోత్తేజంతో తమ ఆధ్యాత్మిక ప్రక్రియను కొనసాగించడానికి, సాంసారిక జీవితంలో ఉన్నవారు తాము అనుకున్నవి సాధించేందుకు కొత్త ప్రయత్నాలు చేయడానికీ ఇది చాలా ముఖ్యమైన సమయం. మకర సంక్రాంతి మన దేశంలో ప్రధానమైన పండుగ. సంక్రాంతికి మూలపదమైన 'శంకర' అనే మాటకు కదలిక అని అర్థం. ప్రాణం అంటే కదలికే. గ్రహం కదులుతుంది కనుకనే అది ప్రాణాన్ని పుట్టిస్తుంది. గ్రహచలనం లేనట్టయితే దానికి ప్రాణాన్ని ఇచ్చే సామర్థ్యం ఉండదు. కాబట్టి ఈ కదలికలో అన్ని జీవులకూ పాత్ర ఉంది. అయితే కదలిక అనేది ఏదో ఒక నిశ్చలత్వం ఒడిలోనే జరుగుతుంది. తమ జీవితంలో నిశ్చలత్వాన్ని అనుభవంలోకి తెచ్చుకోలేనివారు... అంటే బాహ్యంగానూ, అంతర్గతంగానూ నిశ్చలత్వం తెలియని, చూడనివారు... ఈ కదలికలో ఎక్కడో పడిపోతారు. ఆ కదలికే ఉత్సవం, జీవితం, జీవన ప్రక్రియ... అదే జీవితానికి ఆద్యంతాలు అని తెలుసుకొనే పండుగ సంక్రాంతి. అలాగే... 'శంకర' అనే పదం వెనుక ఉన్నవాడు శంకరుడు. ఆయన నిశ్చలుడు. నిశ్చలత్వమే ఈ కదలికకు మూలం. అన్ని గ్రహాలూ తిరుగుతున్నా... వాటిలో అతి ముఖ్యుడైన సూర్యుడు తిరగడం లేదు. ఆయన కదలకుండా ఉన్నాడు కాబట్టే మిగిలినవాటి గమనం జరుగుతోంది. ఆయన కూడా కదిలితే మనం ఇబ్బందిలోపడతాం. కానీ సూర్యుడి నిశ్చలత్వం కూడా సాపేక్షమైనదే. ఎందుకంటే మొత్తం సౌరమండలం కదులుతూ ఉంటుంది. మొత్తం పాలపుంత కదులుతూ ఉంటుంది. కానీ వాటికి ఆవాసమైన ఆకాశం సంపూర్ణంగా నిశ్చలమైనది.

మనిషి తనలోని ఈ నిశ్చలత్వాన్ని చేరుకోడానికి ప్రయత్నించినప్పుడు మాత్రమే ఆ కదలికలోని ఆనందాన్ని తెలుసుకోగలడు. అలా కానప్పుడు... తమ జీవితంలో వచ్చే ప్రతి మార్పుకూ, కదలికకూ బాధపడతారు. జీవితంలోని ప్రతి దశా ఏదో విధమైన ఇబ్బందే. ఈ జీవితపు స్వభావమే కదలిక అనేది అర్థం చేసుకోలేనివారికి... ఆ కదలికతో, అంటే మార్పుతో ఇబ్బందే. మీరు ఆ కదలికను ఆస్వాదించగలిగేది మీరు నిశ్చలంగా ఉన్నప్పుడే. నిశ్చలత్వం అంటే ఏమిటో మీకు తెలిసినప్పుడు... జీవితం ఆనందభరితమవుతుంది. లేకపోతే... కదలిక అనేది నిశ్చేష్టతకు కారణమవుతుంది. కదలికను... అంటే మార్పును పండుగ చేసుకోవడం మీరు నిశ్చలత్వాన్ని చవి చూసినప్పుడే వీలవుతుంది. ఆ సంగతి గుర్తుచేయడమే మకర సంక్రాంతిలోని ప్రత్యేకత.

పంటల పండుగ... మార్పుకు ప్రతీక



> మకర సంక్రాంతి మన దేశంలో ప్రధానమైన పండుగ. సంక్రాంతికి మూలపదమైన 'శంకర' అనే మాటకు కదలిక అని అర్థం. ప్రాణం అంటే కదలికే. ఆ కదలికే ఉత్సవం, జీవితం, జీవన ప్రక్రియ... అదే జీవితానికి ఆద్యంతాలు అని తెలుసుకొనే పండుగ సంక్రాంతి.



సద్గురు జగ్గీవాసుదేవ్

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/4EYVSMGలో చదవండి.

టీసీఎస్ లాభం రూ.11,735 కోట్లు

ఆదాయం రూ.60,583 కోట్లు

అంచనాల కంటే తగ్గిన ఆర్డర్లు ● ఒక్కో షేరుకు రూ.27 డివిడెండ్




ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24).. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) టీసీఎస్ ఆర్థిక పనితీరు మార్కెట్ అంచనాలకు అనుగుణంగానే నమోదైంది. కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 8.2 శాతం వృద్ధితో రూ.11,735 కోట్లకు చేరుకోగా.. ఆదాయం 4 శాతం పెరిగి రూ.60,583 కోట్లుగా నమోదైంది. భారత్ సహా వర్ధమాన మార్కెట్లో కంపెనీ వ్యాపారం రెండంకెల్లో వృద్ధి చెందడం ఇందుకు దోహదపడింది. ఎనర్జీ, రిసోర్సెస్, యుటిలిటీస్, మాన్యుఫాక్చరింగ్, లైఫ్ సైన్సెస్ అండ్ హెల్త్‌కేర్ రంగా క్లయింట్ల నుంచి ఆదాయం పెరగడం కూడా కలిసివచ్చిందని కంపెనీ పేర్కొంది. సమీక్షా కాలానికి టీసీఎస్ నిర్వహణ మార్జిన్ 0.50 శాతం వృద్ధితో మార్కెట్ అంచనాలను మించి 25 శాతానికి ఎగబాకింది. కాగా, నికర మార్జిన్ 19.4 శాతంగా నమోదైంది. మరిన్ని విషయాలు..

- గడిచిన మూడు నెలల్లో కంపెనీ దక్కించుకున్న కాంట్రాక్టుల మొత్తం విలువ 810 కోట్ల డాలర్లకు పరిమితమైంది. క్యూ2లో లభించిన 1,120 కోట్ల డాలర్ల ఆర్డర్లతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. అంతేకాదు, కంపెనీ అంచనా 900-1,000 కోట్ల డాలర్ల కన్నా తక్కువే.
- ఈ ఆర్థిక సంవత్సరానికి గాను టీసీఎస్ బోర్డు వాటాదారులకు ఒక్కో షేరుకు మొత్తం రూ.27 డివిడెండ్ ప్రకటించింది. అందులో రూ.9 మధ్యంతర డివిడెండ్ కాగా, మరో రూ.18 ప్రత్యేక డివిడెండ్‌నూ చెల్లించనుంది. తొలి, రెండో త్రైమాసికాల్లోనూ కంపెనీ రూ.9 చొప్పున మధ్యంతర డివిడెండ్లను చెల్లించింది. అంటే, ఈ ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు సంస్థ ప్రకటించిన మొత్తం డివిడెండ్ రూ.45కు చేరుకుంది. డివిడెండ్‌కు అర్హులైన వాటాదారులను ఈ నెల 19న రికార్డు చేసి, వచ్చే నెల 5న చెల్లింపులు జరపనున్నట్లు కంపెనీ తెలిపింది.
- గడిచిన త్రైమాసికంలో టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య 5,680 తగ్గి 6,03,305కు పడిపోయింది. వరుసగా రెండు త్రైమాసికాలుగా కంపెనీ ఉద్యోగుల సంఖ్య తగ్గింది. క్యూ2లో కంపెనీ నుంచి నికరంగా 6,333 మంది వలసపోయారు. కాగా, క్యూ3లో ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 13.3 శాతానికి తగ్గింది.

బోణీ డీలా!

దేశీయ ఐటీ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్‌కు బోణీ చేశాయి. సాధారణంగానే ఐటీ రంగానికి క్యూ3 బలహీన త్రైమాసికం. ఈ రంగానికి అధిక ఆదాయ మార్కెట్లు అయిన అమెరికా, ఐరోపాలో ఆర్థిక మందగమనం గడిచిన మూడు నెలల్లో ఐటీ కంపెనీల పనితీరును మరింత ప్రభావితం చేసింది. దాంతో సమీక్షా కాలానికి టీసీఎస్ లాభం స్వల్ప వృద్ధికి పరిమితం కాగా.. ఇన్ఫీ ప్రాఫిట్ క్షీణించింది. మార్కెట్ అంచనాలను కూడా అందుకోలేకపోయింది.



ఇన్ఫీ లాభంలో 7.3% క్షీణత

క్యూ3లో రూ.6,106 కోట్లకు పరిమితం

ఆదాయం రూ.38,821 కోట్లుగా నమోదు

బెంగళూరు: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఇన్ఫోసిస్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 7.3 శాతం తగ్గి రూ.6,106 కోట్లకు పడిపోయింది. ఏకీకృత రాబడి మాత్రం 1.3 శాతం పెరిగి రూ.38,821 కోట్లకు చేరుకుంది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) మొత్తానికి ఆదాయ అంచనాను గతంలో ప్రకటించిన 1-2.5 శాతం నుంచి 1.5-2 శాతానికి కుదిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. గడిచిన మూడు త్రైమాసికాల్లో స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయ వృద్ధి 1.8 శాతంగా నమోదైందని, నాలుగో త్రైమాసిక పనితీరును కూడా దృష్టిలో పెట్టుకుని ఆదాయ అంచనాను కుదించినట్లు కంపెనీ పేర్కొంది. 20-22 శాతం నిర్వహణ మార్జిన అంచనాను మాత్రం యథాతథంగా కొనసాగించింది.

మరిన్ని ముఖ్యాంశాలు..

- గడిచిన మూడు నెలల్లో ఓ మెగా డీల్‌తో కలిపి 320 కోట్ల డాలర్ల విలువైన కొత్త కాంట్రాక్టులను దక్కించుకున్నట్లు కంపెనీ తెలిపింది. అందులో కొత్తగా లభించిన నికర ఆర్డర్ల విలువే 71 శాతమని కంపెనీ స్పష్టం చేసింది. అయితే, క్యూ2లో లభించిన 770 కోట్ల డాలర్ల డీల్స్‌తో పోలిస్తే విలువ సగానికి పైగా తగ్గింది.
- వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ ఇన్ఫీలో ఉద్యోగులు తగ్గారు. ఈ డిసెంబరుతో ముగిసిన మూడు నెలల్లో సంఖ్య వార్షిక ప్రాతిపదికన 7 శాతం (6,101) తగ్గి 3,22,663 మందికి పరిమితమైంది. అట్రిషన్ రేటు 12.9 శాతానికి తగ్గింది.

ఇన్ఫీ చేతికి ఇన్‌సెమీ

- బెంగళూరుకు చెందిన సెమీకండక్టర్ల (చిప్) డిజైనింగ్ సేవల కంపెనీ 'ఇన్‌సెమీ'ని రూ.280 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఇన్ఫీ బోర్డు ఆమోదం తెలిపింది. నియంత్రణ మండళ్ల అనుమతులకు లోబడి ఈ మార్చి చివరి నాటికల్లా డీల్ పూర్తి కావచ్చని అంచనా. ఇన్‌సెమీ కొనుగోలుతో ఇన్ఫోసిస్ కొత్త రంగంలోకి అడుగు పెట్టడమే కాకుండా, ఇప్పటివరకు ఈ రంగం నుంచి లేని క్లయింట్లను కూడా దక్కించుకునేందుకు వీలు కలుగనుందని కంపెనీ సీఎఫ్‌ఓ నీలాంజన్ రాయ్ అన్నారు. ప్రస్తుతం 50,000 కోట్ల డాలర్ల స్థాయిలో ఉన్న సెమీకండక్టర్ల మార్కెట్ మరికొన్నేళ్లలో లక్ష కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని అంచనా.

ప్రాంగణ నియామకాల్లేవ్..

- ఐటీ సేవలకు తగినంత డిమాండ్ లేని కారణంగా ఈ సారి ప్రాంగణ నియామకాలు చేపట్టకపోవచ్చని నీలాంజన్ రాయ్ తెలిపారు. ఒకవేళ మరింత మంది ఉద్యోగులు అవసరమైన పక్షంలో ఆఫ్-క్యాంపస్ నియామకాలు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు.

గాయత్రీ ప్రాజెక్ట్స్ లిక్విడేషన్‌కు రుణదాతల మొగ్గు!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గాయత్రీ ప్రాజెక్ట్స్‌ను విక్రయించే ప్రక్రియ చేపట్టాలని కంపెనీకి రుణాలు ఇచ్చిన రుణదాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా రూ.650 కోట్లకు గాయత్రీ ప్రాజెక్ట్స్‌ను సొంతం చేసుకోవడానికి మార్క్ ఏబీ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ఎల్ఎల్‌ఎల్‌సీ ముందుకు వచ్చిందని మార్కెట్ వర్గాల కథనం. ఇందులో భాగంగా ముందుగా రూ.50 కోట్లను చెల్లించడానికి అంగీకరించింది. దివాలా పరిష్కార ప్రక్రియలో మార్క్ ఏబీ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ మాత్రమే తుది బిడ్ దాఖలు చేసినట్లు సమాచారం. మార్క్ ఏబీ క్యాపిటల్ ఆఫర్ చేసిన విలువ చాలా తక్కువని రుణదాతలు భావించి.. దాన్ని తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో 60 శాతానికి పైగా రుణదాతలు కంపెనీ లిక్విడేషన్‌కు మొగ్గు చూపినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. లిక్విడేషన్‌కు రిసొల్యూషన్ ప్రొఫెషనల్ ఇప్పటికే పిటిషన్ దాఖలు చేసినట్లు సంబంధిత వర్గాల సమాచారం. కాగా కంపెనీ ప్రమోటర్లు ఇన్‌సాల్వెన్సీ ప్రొసెస్‌ను నిలిపివేయాలని ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు చేశారు. ఇది ఇంకా విచారణకు రావాల్సి ఉంది. రుణదాతలకు గాయత్రీ ప్రాజెక్ట్స్ రూ.9,000 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. ఇందులో బ్యాంకులకు రూ.7,147 కోట్లు చెల్లించాలి.

స్వల్ప లాభాలతోనే సరి

సెన్సెక్స్ 63 పాయింట్లు అప్

ముంబై: కార్పొరేట్ ఫలితాలు, దేశీయ ఆర్థిక గణాంకాలు, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు పెట్టుబడులకు నిరాసక్తత చూపించటంతో స్టాక్ మార్కెట్ పరిమిత లాభాలతోనే సరిపెట్టుకుంది. సెన్సెక్స్ ఒక దశలో 342 పాయింట్లు లాభపడినప్పటికీ చివరికి 63.47 పాయింట్లకే ఆ లాభాన్ని పరిమితం చేసుకుని 71,721.18 వద్ద ముగిసింది. నిఫ్టీ 28.50 పాయింట్ల లాభంతో 21,647.20 వద్ద క్లోజైంది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు లాభాలతో ముగిశాయి.

కుప్పకూలిన పాలీక్యాబ్ షేరు: విద్యుత్ ఉపకరణాల తయారీలోని పాలీక్యాబ్ షేరు గురువారం ఏకంగా 21 శాతం పడిపోయాయి. మార్కెట్ విలువ రూ.15,485.96 కోట్లు తుడిచిపెట్టుకుపోయి రూ.58,225.57 కోట్లకు పడిపోయింది. ఇటీవల ఈ కంపెనీపై నిర్వహించిన సోదాల్లో రూ.1,000 కోట్ల విలువ గల "లెక్కల్లో చూపని విక్రయాల"ను గుర్తించినట్లు ఆదాయపు పన్ను శాఖ ప్రకటించడం ఇందుకు కారణం. బీఎస్ఈలో ఈ షేరు 21.08 % నష్టంతో రూ.3,877.40 వద్ద ముగియగా ఎన్ఎస్ఈలో 20.50 % మేరకు దిగజారి రూ.3,904.70 వద్ద ముగిసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,830 ▼	57,600 ▼	77,500 ▼
ముంబై	62,262 ▼	57,032 ▼	71,532 ▲

మళ్లీ 10,000 కోట్ల డాలర్ల క్లబ్‌లోకి అంబానీ

ప్రపంచ సంపన్నుల్లో 11వ స్థానం

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్ ర్యాలీతో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ మళ్లీ 10,000 కోట్ల (100 బిలియన్) డాలర్ల క్లబ్‌లో చేరారు. గత రెండు రోజుల్లో ఆర్ఐఎల్ షేరు 5.4 శాతం లాభంతో రూ.2,718.40కి చేరాయి. గురువారం ఒక దశలో ఆర్ఐఎల్ షేరు రూ.2,724.95 జీవితకాల గరిష్ఠ స్థాయిని తాకింది. దీంతో ఆర్ఐఎల్ మార్కెట్ క్యాప్ రూ.18 లక్షల కోట్లకు చేరింది. గత వారం రోజుల్లో అంబానీ నిర్వహణలోని నెట్‌వర్క్ 18, టీవీ18 బ్రాడ్‌కాస్ట్ కంపెనీల షేర్లు 24 నుంచి 45 శాతం పెరిగాయి. దీంతో అంబానీ నికర సంపద 10,501 కోట్ల డాలర్లకు (సుమారు రూ.8.71 లక్షల కోట్లు) చేరింది. 2021 తర్వాత అంబానీ 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరడం ఇదే మొదటిసారి. వంద బిలియన్ డాలర్లకుపైగా నికర సంపద ఉన్న కుబేరులు ప్రపంచంలో 12 మంది ఉంటే అందులో అంబానీ 11వ స్థానంలో ఉన్నారు.

గూగుల్‌లో మళ్లీ కొలువుల కోత

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికా టెక్ కంపెనీల్లో కొలువుల కోత కొనసాగుతోంది. ఇంటర్నెట్ సెర్చ్ ఇంజన్ దిగ్గజం గూగుల్ తాజాగా మరింత మందిని ఇంటికి పంపింది. అయితే ఎంత మందిని ఉద్యోగాల నుంచి తొలగించిదనే విషయాన్ని మాత్రం కంపెనీ అధికారికంగా వెల్లడించలేదు. అయితే ఈ సంఖ్య వందల్లోనే ఉంటుందని తెలుస్తోంది. హార్డ్‌వేర్, వాయిస్ అసిస్టెన్స్, ఇంజనీరింగ్ టీమ్స్‌లో ఈ తీసివేతలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఖర్చుల తగ్గింపులో భాగంగా ఈ చర్య తీసుకున్నట్టు తెలిపింది. గూగుల్ చర్యపై ఉద్యోగుల సంఘం మండిపడింది. తమ కష్టంతో ప్రతి త్రైమాసికంలో వందల కోట్ల డాలర్ల లాభాలు ఆర్జిస్తున్నా.. ఇలా అర్థాంతరంగా తమ పొట్ట కొట్టడం అన్యాయమని విమర్శించింది.

'క్రిప్టో'ల వేలంవెర్రిని భరించలేం

- ఈ విషయంలో మా దారి మాదే
- ఆర్‌బీఐ గవర్నర్ దాస్

ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ మరోసారి క్రిప్టో కరెన్సీలపై తన వ్యతిరేకతను వెల్లడించారు. వర్ధమాన దేశాలు గానీ, సంపన్న దేశాలు గానీ 'క్రిప్టో' కరెన్సీల వేలంవెర్రిని భరించలేవన్నారు. మింట్ పత్రిక నిర్వహించిన ఒక సదస్సులో ఆయన ఈ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ విషయంలో తాము ఏ దేశ రెగ్యులేటరీ సంస్థలను అనుసరించలేమని స్పష్టం చేశారు. అమెరికా క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ 'సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ కమిషన్ '(ఎస్ఈసీ) క్రిప్టో కరెన్సీల ఈటీఎఫ్‌లను అనుమతించిన నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ దాస్ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. 'ఒకరికి మంచిదైంది మరొకరికి మంచిది కాకపోవచ్చు. ఈ విషయంలో నా అభిప్రాయం, ఆర్‌బీఐ అభిప్రాయం గతంలోలానే ఉంది' అన్నారు.

అదుపు చేయడమూ కష్టమే: క్రిప్టో కరెన్సీలను ప్రోత్సహించే వర్ధమాన, సంపన్న దేశాల ఆర్థిక వ్యవస్థలకు పెద్ద ముప్పు పొంచి ఉందని శక్తికాంత దాస్ హెచ్చరించారు. ఈ ముప్పును అదుపు చేయడం కూడా కష్టమని స్పష్టం చేశారు. క్రిప్టో కరెన్సీల ఈటీఎఫ్‌లను అనుమతిస్తూనే.. వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని అమెరికా ఎస్ఈసీ హెచ్చరించిన విషయాన్ని ఆర్‌బీఐ గవర్నర్ గుర్తు చేశారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే మధ్యంతర బడ్జెట్ ద్రవ్యోల్బణాన్ని పెంచే విధంగా ఉండకపోవచ్చన్నారు.

యూపీఐ ప్రపంచంలోనే మేటి: డిజిటల్ చెల్లింపులకు సంబంధించి ఎన్‌పీసీఐ అభివృద్ధి చేసిన యూపీఐ యాప్.. అత్యుత్తమ చెల్లింపుల యాప్ అని దాస్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎన్‌పీసీఐ గుత్తాధిపత్యం వహిస్తోందన్న విమర్శలను ఆయన కొట్టివేశారు. యూపీఐ యాప్ మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందన్నారు. చెల్లింపులకు సంబంధించి యూపీఐ ప్రపంచంలోనే అత్యుత్తమ యాప్ అన్నారు.సింగపూర్, యూఏఈ వంటి దేశాలు కూడా తమ డిజిటల్ చెల్లింపుల కోసం ఈ యాప్‌ను వినియోగిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. దేశంలో ఈ యాప్ ద్వారా జరిగే నెలవారీ లావాదేవీలు ఎప్పుడో 10,000 కోట్లు దాటిపోయాయన్నారు.

ప్రత్యక్ష పన్నుల వసూళ్లు అదుర్స్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ పన్నుల వసూళ్లు జోరందుకున్నాయి. ఈ నెల 10వ తేదీ నాటికి నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు (కార్పొరేట్ ట్యాక్స్+వ్యక్తిగత ఆదాయ పన్ను) రూ.14.7 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 19.41 శాతం ఎక్కువ. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకున్న రూ.18.23 లక్షల కోట్లలో ఇది 81 శాతానికి సమానం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

11వ తేదీ 12 జనవరి

హైదరాబాద్	540	విజయవాడ	555
చిత్తూరు	563	విశాఖపట్నం	599
గోదావరి	555	వరంగల్	542
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	87	గోదావరి	86
వరంగల్	87	విజయవాడ	86
కరీంనగర్	87	గుంటూరు	87
మహబూబ్‌నగర్	87	ఒంగోలు	87
కర్నూలు	87	చిత్తూరు	95
విశాఖపట్నం	81		

స్పోర్ట్స్

క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ

శ్రీకాంత్ ఇంటిదారి



కౌలాలంపూర్: ప్రపంచ బ్యాడ్మింటన్ డబుల్స్ రెండో ర్యాంక్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి మలేసియా ఓపెన్ సూపర్ సిరీస్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం ముగిసిన ప్రీక్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ 21-11, 21-18తో లుకాస్ కోర్వీ-రొనాన్ లాబార్ (ఫ్రాన్స్) ద్వయంపై నెగ్గి, ముందంజ వేసింది. గత ఏడాది సాత్విక్ జోడీ ఆసియా క్రీడలతో సహా ఆరు టైటిళ్లు సాధించడం తెలిసిందే. ఇక సింగిల్స్ రెండో రౌండ్లో కిడాంబి శ్రీకాంత్ 13-21, 17-21తో లాంగ్ అంగస్ (హాంకాంగ్) చేతిలో ఓటమి పాలై, టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్యాస్ట్రో జోడీ 21-19, 13-21, 21-15తో వకానా నగహారా-మయు మత్సుమోటో (జపాన్)పై గెలిచి, క్వార్టర్స్‌లో ప్రవేశించింది.



పోరాడి ఓడిన తెలుగు యోధాస్

అల్టిమేట్ ఖో-ఖో లీగ్ ఫైనల్లో చెన్నై, గుజరాత్

కటక్: అల్టిమేట్ ఖో-ఖో లీగ్ సెమీఫైనల్లో చెన్నై క్విక్ గన్స్ చేతిలో తెలుగు యోధాస్ జట్టు ఓటమి పాలైంది. మరో సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఒడిశా జగర్‌నాట్స్‌కు షాకిచ్చిన గుజరాత్ జెయింట్స్ ఫైనల్ చేరింది. గురువారం జరిగిన రెండో సెమీస్ పోరులో చెన్నై క్విక్ గన్స్‌పై ఆట ప్రారంభం నుంచి దాదాపుగా చివరి వరకు తెలుగు యోధాస్‌దే పైచేయిగా సాగింది. అయితే చివరి నాలుగు నిమిషాల్లో యోధాస్ ఆధిక్యం 26-24కు తగ్గింది. ఆఖరి రెండు నిమిషాల్లో చెన్నై ప్లేయర్ రాంజీ మ్యాజిక్‌తో ఆ జట్టు 31-29తో విజయం సాధించింది. అంతకుముందు తొలి సెమీఫైనల్లో గుజరాత్ జెయింట్స్ 29-27తో ఒడిశాపై నెగ్గింది. ఇక, శనివారం జరిగే మెగా ఫైనల్లో గుజరాత్ జెయింట్స్‌తో చెన్నై క్విక్ గన్స్, మూడో స్థానం పోరులో ఒడిశాతో యోధాస్ తలపడనుంది.

రిథమ్‌కు ఒలింపిక్ బెర్త్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో భారత షూటర్లు రికార్డు స్థాయిలో పాల్గొనబోతున్నారు. తాజాగా 20 ఏళ్ల యువ షూటర్ రిథమ్ సాంగ్వాన్‌కు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ దక్కింది. గురువారం జకార్తాలో జరిగిన ఆసియా ఒలింపిక్ క్వాలిఫికేషన్స్ మహిళల 25 మీ. స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో కాంస్యంతో తన



స్థానం ఖాయం చేసుకుంది. దీంతో ఈ ఏడాది జులై-ఆగస్టుల్లో జరిగే ఒలింపిక్స్‌లో భారత్ నుంచి అత్యధికంగా 16 మంది షూటర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. గతంలో టోక్యో ఒలింపిక్స్‌లో 15 మంది షూటర్లు మాత్రమే భారత్ తరఫున పాల్గొన్నారు.

జింబాబ్వేపై లంక సిరీస్ గెలుపు

● హసరంగకు7 వికెట్లు ● మూడో వన్డేలో విజయం

కొలంబో: హసరంగ (7/19) తిప్పేయడంతో.. మూడో, ఆఖరి వన్డేలో శ్రీలంక 8 వికెట్లతో జింబాబ్వేను ఓడించింది. దీంతో శ్రీలంక సిరీస్‌ను 2-0తో గెల్చుకుంది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 27 ఓవర్లకు కుదించారు. తొలుత జింబాబ్వే 22.5 ఓవర్లలో 96 పరుగులకు కుప్పకూలగా, లంక 16.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.



శివమ్ దూబే (60 నాటౌట్)

దూబే దూకుడు

తొలి టీ20

భారత్‌దే బోణీ

6 వికెట్లతో అఫ్ఘాన్‌పై విజయం

స్కోరుబోర్డు

అఫ్ఘాన్: గుర్బాజ్ (స్టంప్) జితేశ్ (బి) అక్షర్ 23; ఇబ్రహీం జద్రాన్ (సి) రోహిత్ (బి) దూబే 25; ఒమర్జాయ్ (బి) ముకేశ్ 29; రహ్మత్ షా (బి) అక్షర్ 3; నబీ (సి) రింకూ (బి) ముకేశ్ 42; నజీబుల్లా (నాటౌట్) 19; జనత్ (నాటౌట్) 9; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 158/5. వికెట్ల పతనం:** 1-50, 2-50, 3-57, 4-125, 5-130; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-1-28-0; ముకేశ్ 4-0-33-2; అక్షర్ 4-0-23-2; సుందర్ 3-0-27-0; దూబే 2-0-9-1; బిష్ణోయ్ 3-0-35-0.

భారత్: రోహిత్ (రనౌట్) 0; గిల్ (స్టంప్) గుర్బాజ్ (బి) ముజీబుర్ 23; తిలక్ వర్మ (సి) గుల్బదిన్ (బి) ఒమర్జాయ్ 26; దూబే (నాటౌట్) 60; జితేశ్ (సి) ఇబ్రహీం (బి) ముజీబుర్ 31; రింకూ సింగ్ (నాటౌట్) 16, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 17.3 ఓవర్లలో 159/4. వికెట్ల పతనం:** 1-0, 2-28, 3-72, 4-117; **బౌలింగ్:** ఫరూఖి 3-0-26-0; ముజీబుర్ 4-1-21-2; నబీ 2-0-24-0; నవీనుల్ 3.3-0-43-0; ఒమర్జాయ్ 4-0-33-1; నబీ 1-0-12-0.

1 భారత్‌పై టీ20ల్లో తమ అత్యధిక స్కోరు (158/5) సాధించిన అఫ్ఘాన్

మొహాలీ: అఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న మూడు టీ20ల సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. టీ20 ప్రపంచక్‌పలో చోటు ఆశిస్తున్న శివమ్ దూబే (40 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 60 నాటౌట్) బ్యాట్‌తో, బంతి (2-0-9-1)తోనూ అదరగొట్టాడు. దీంతో గురువారం జరిగిన తొలి టీ20లో టీమిండియా 6 వికెట్ల తేడాతో నెగ్గింది. అలాగే సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. రెండో మ్యాచ్ ఆదివారం ఇండోర్‌లో జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 158 పరుగులు చేసింది. నబీ (27 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 42), అజ్మతుల్లా (29) రాణించారు. అక్షర్, ముకేశ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 17.3 ఓవర్లలో 4 వికెట్లకు 159 పరుగులు చేసి గెలిచింది. జితేశ్ (31), తిలక్ (26), గిల్ (23) ఆకట్టుకున్నారు. ముజీబుర్‌కు రెండు వికెట్లు దక్కాయి. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా శివమ్ దూబే నిలిచాడు.

చెలరేగిన శివమ్: ఓ మాదిరి ఛేదనలో మిడిలార్డర్ బ్యాటర్ శివమ్ దూబే సూపర్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. చక్కటి భాగస్వామ్యాలతో జట్టును విజయం దిశగా నడిపాడు. అయితే 14 నెలల బ్రేక్ తర్వాత టీ20 ఆడిన కెప్టెన్ రోహిత్ ఖాతా తెరవకుండా ఇన్నింగ్స్ రెండో బంతికే రనౌటయ్యాడు. నాన్‌స్ట్రయికర్ ఎండ్‌లో ఉన్న గిల్ (23).. కెప్టెన్ పిలుపును పట్టించుకోకుండా బంతి వైపే చూస్తుండిపోయాడు. ఈలోగా రోహిత్ మరో ఎండ్‌కు చేరడంతో త్రో అందుకున్న కీపర్ గుర్బాజ్ వికెట్లను గిరాటేశాడు. అయితే గిల్ ఆ తర్వాత ధాటిగా ఆడి ఐదు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. మరోసారి భారీ షాట్‌కు వెళ్లి నాలుగో ఓవర్‌లో స్టంపౌట్ అయ్యాడు. పవర్ ప్లేలో 36 పరుగులే చేసినా.. శివమ్ దూబే మెరుపు ఇన్నింగ్స్‌తో మూడు కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. తిలక్‌తో కలిసి మూడో వికెట్‌కు 44, జితేశ్‌తో నాలుగో వికెట్‌కు 45 పరుగులు జత చేశాడు. 14వ ఓవర్‌లో ముజీబ్ బంతికి జితేశ్ అవుటయ్యాడు. 38 బంతుల్లో అర్ధసెంచరీ చేసిన దూబే 18వ ఓవర్‌లో వరుసగా 6,4 బాదేసి మ్యాచ్‌ను ముగించాడు. అప్పటికి ఐదో వికెట్‌కు దూబే అజేయంగా రింకూతో కలిసి 42 పరుగులు జత చేయడం విశేషం.

నబీ జోరుతో..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ జట్టు తమ ఇన్నింగ్స్‌ను ఆత్మవిశ్వాసంతోనే ఆరంభించింది. తొలి పది ఓవర్లలో 57 పరుగులే చేసినా.. ఆ తర్వాత గేరు మార్చి ఏకంగా 101 పరుగులు రాబట్టింది. టాపార్డర్‌లో గుర్బాజ్, జద్రాన్, ఒమర్జాయ్ భారత బౌలర్లను చక్కగా ఎదుర్కొన్నారు. మిడిలార్డర్‌లో వెటరన్ నబీ అదరగొట్టాడు. దీనికితోడు డెత్ ఓవర్లలో బౌండరీల రూపంలో ధారాళంగా పరుగులు రావడంతో అఫ్ఘాన్ సునాయాసంగా 150 దాటేసింది. పేసర్ అర్ష్‌దీప్, దూబే మాత్రం కట్టడి చేయగలిగారు. ఓపెనర్లు గుర్బాజ్, జద్రాన్ క్రీజులో నిలదొక్కుకుంటూ తొలి వికెట్‌కు 50 పరుగులు జత చేసి వరుస ఓవర్లలో వెనుదిరిగారు. అనంతరం అరంగేట్ర బ్యాటర్ రహ్మత్ షా (3) విఫలం కావడంతో టపటపా మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో నబీ, ఒమర్జాయ్ జట్టును ఆదుకున్నారు. 15వ ఓవర్‌లో ఒమర్జాయ్ సిక్సర్, నబీ రెండు ఫోర్లు, తర్వాతి ఓవర్‌లో నబీ రెండు సిక్సర్లతో స్కోరులో వేగం పెరిగింది. అయితే 18వ ఓవర్‌లో ముకేశ్ ఈ ఇద్దరినీ అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 68 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయినా చివరి రెండు ఓవర్లలో నజీబుల్లా (19 నాటౌట్), జనత్ (9 నాటౌట్)ల తుఫాన్ ఇన్నింగ్స్‌తో 28 పరుగులు రాబట్టింది.



జితేశ్ (31)

పారా క్రీడల్లో తెలుగోళ్ల సత్తా



శ్యామ్ పల్లవి మోహన్ హర్ష

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో ముగ్గురు తెలుగు క్రీడాకారులు పతకాలు సాధించారు. గోవాలో జరుగుతున్న ఈ పోటీల్లో గురువారం ముగిసిన హైజంప్ టి-44 కేటగిరీ పోటీల్లో ఐ.శ్యామ్ (గుంటూరు) రజతం సొంతం చేసుకున్నాడు. పోలియో బాధితుడైన శ్యామ్ 170 సెంటీమీటర్ల ఎత్తు దూకి ద్వితీయ స్థానంలో నిలిచాడు. అనంతపురానికి చెందిన అంధ క్రీడాకారిణి ఎస్.పల్లవి షాట్‌పుట్‌లో రజతంతో మెరిసింది. పల్లవి ఇనుప గుండును 6.13 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచింది. హైదరాబాద్ పారా స్ప్రింటర్ మోహన్ హర్ష 100 మీటర్ల పరుగును 11.25 సెకన్లలో పూర్తి చేసి, కాంస్యం సాధించాడు.



బ్యాట్‌తో జొకో.. రాకెట్‌తో స్మిత్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ స్టీవ్ స్మిత్ టెన్నిస్‌లోనూ తన ప్రావీణ్యాన్ని చాటుకున్నాడు. ఈనెల 14న ఆరంభమయ్యే ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రచారంలో భాగంగా డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్‌తో కలిసి స్మిత్ సరదాగా మ్యాచ్ ఆడాడు. ఇందులో భాగంగా జొకో సర్వీస్‌ను స్మిత్ సరైన రీతిలో చక్కగా కోర్టు లోపలే రిటర్న్ చేయడం విశేషం. దీంతో స్మిత్ ఆటతీరుతో ఆశ్చర్యానికి లోనైన జొకోతో పాటు అభిమానులు కూడా చప్పట్లతో తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అలాగే జొకోవిచ్ కూడా క్రికెట్ బ్యాట్‌తో టెన్నిస్ బంతిని ఆడాడు. అయితే బ్యాట్‌తో సరిగా ఆడలేకపోవడంతో టెన్నిస్ రాకెట్‌ను ఉపయోగించి బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు.

అమన్ పసిడి పట్టు



జాగ్రెబ్: భారత రెజ్లర్ అమన్ షెహ్రావత్ జాగ్రెబ్ ఓపెన్‌లో స్వర్ణ పతకంతో సంచలనం సృష్టించాడు. గురువారం జరిగిన 57 కిలోల ఫైనల్లో అమన్ 10-0తో వరల్డ్ నెంబర్ 7 వాన్‌హో జౌ (చైనా)ను చిత్తుగా ఓడించాడు. దీపక్ పూనియా 86 కిలోల విభాగంలో తొలి రౌండ్లోనే ఓటమి పాలయ్యాడు. ఇక, డబ్ల్యూఎఫ్ఐపై సస్పెన్షన్ ఉండడంతో ప్రస్తుతం భారత రెజ్లర్లు యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ తరఫున ఈ పోటీల్లో బరిలోకి దిగారు.

నందమూరి, నారా కుటుంబాలను విమర్శించే స్థాయి కేశినేని నానికి లేదు

- మా సోదరులు నడుమ 1999 నుంచే విభేదాలు
- వాటితో టీడీపీకి, చంద్రబాబుకు సంబంధం ఏమిటి?: కేశినేని చిన్ని

విజయవాడ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): 'నా సోదరుడు, విజయవాడ ఎంపీ కేశినేని నాని ఎన్ని అంటున్నా 1999 నుంచి సర్దుకుపోతూ వచ్చాను. మా కుటుంబంలో అప్పటి నుంచీ కలహాలు ఉన్నాయి. వాటితో టీడీపీకి, చంద్రబాబుకు సంబంధం ఏమిటి?' అని నాని సోదరుడు కేశినేని శివనాథ్(చిన్ని) ప్రశ్నించారు. బుధవారం సీఎం జగన్‌ను కలిసిన అనంతరం కేశినేని నాని చేసిన విమర్శలపై చిన్ని గురువారం స్పందించారు. 'మా కుటుంబంలో దశాబ్దాలుగా సమస్యలు ఉన్నాయి. ఎంపీ టికెట్ ఇచ్చి రెండుసార్లు ఆదరించిన నందమూరి, నారా కుటుంబాలను విమర్శించే స్థాయి నానికి లేదు. అమరావతిని సర్వనాశనం చేసిన జగన్ చెంతకు ఆయన చేరడాన్ని విజయవాడ ప్రజలు హర్షించరు. చంద్రబాబు పెట్టిన రాజకీయ భిక్షను మరచి మాట్లాడటం తగదు. కారుపై ఎంపీ స్టిక్కర్ గురించి నా భార్యపై నాని దొంగ కేసు పెట్టారు. ఇంట్లో ఆడవాళ్ల జోలికి వచ్చినా... కుటుంబం, పార్టీ విషయాలను కలపకూడదని ఏ రోజూ నేను మాట్లాడలేదు. యువగళం పాదయాత్రలో లోకేశ్ వెంట లక్షలాది మంది ప్రజలు, కార్యకర్తలు నడిచారు. విజయవాడకు హెచ్‌సీఎల్ సహా ఎన్నో సంస్థలు వచ్చాయంటే దానికి లోకేశే కారణం. ఎంతోమంది మహామహులు వీడినా టీడీపీకి ఏమీ కాలేదు. వచ్చేవాళ్లు వస్తుంటారు. పోయే వాళ్లు పోతుంటారు' అని కేశినేని చిన్ని వ్యాఖ్యానించారు.

కేశినేని వైసీపీ కోవర్టని తేలిపోయింది: బుద్ధా

విజయవాడ (వన్‌టౌన్), జనవరి 11: విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) వైసీపీ కోవర్ట్ అని తేలిపోయిందని ఉత్తరాంధ్ర టీడీపీ ఇన్‌చార్జి బుద్దా వెంకన్న గురువారం ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. 'కొడాలి నాని, వల్లభనేని వంశీ మాట్లాడే మాటల్లో కేశినేని నానికి కూడా భాగముందని తేలిపోయింది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీని నాశనం చేయడానికి, వెలంపల్లికి అనుకూలంగా పనిచేయడానికి అధినాయకత్వం వద్ద నాని బ్లాక్‌మెయిల్ రాజకీయాలు నడిపారు. నాగుల్ మీరాను కో-ఆర్డినేటర్‌గా వేయించుకున్నారు. ఆరోజే ఈ విషయం తెలిసింది. అయినా నా బాస్ చంద్రబాబుపై ఉన్న గౌరవంతో ఏం మాట్లాడకుండా ఉన్నా. ఈరోజు ప్రజలకు, టీడీపీ సైనికులకు కూడా తెలిసింది' అని బుద్దా అన్నారు.

బోరుకొచ్చిన బండి షెడ్డు మారిందంతే: పీవీపీ

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)పై వైసీపీ నేత పొట్లూరి వరప్రసాద్ (పీవీపీ) ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. 'కేశినేని' పేరు వాడకుండా పెట్టిన ఆ పోస్టులో... 'బోరుకొచ్చిన బండి షెడ్డు మారిందంతే. వీడి గుడిసేటి బుద్ధి గురించి బెజవాడంతా తెలుసుకదరా అబ్బాయ్!!' అని పీవీపీ వ్యాఖ్యానించారు.

షర్మిలకు ఏపీలో సముచితస్థానం: మాణిక్కం ఠాగూర్

ఒంగోలు(క్రైం), జనవరి 11: వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె వైఎస్ షర్మిలకు ఆంధ్రప్రదేశ్‌లో సముచిత స్థానం కల్పించి ముఖ్యమైన బాధ్యతలు అప్పగిస్తామని కాంగ్రెస్ పార్టీ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జీ మాణిక్కం ఠాగూర్ పేర్కొన్నారు. గురువారం ఒంగోలులో ఆయన మాట్లాడారు. 'కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు యువతకు ఉద్యోగ కల్పనలో విఫలమయ్యాయి. జగన్ ప్రభుత్వం 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి గెలిచాక మొండిచేయి చూపించింది. జాబ్ కేలెండర్ ప్రకటించకుండా నాలుగున్నరేళ్లుగా యువతను జగన్ మోసంచేశారు. కాంగ్రెస్ పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తాం. ఇసుక, భూములు, గనులలో అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేయాలి' అని డిమాండ్ చేశారు. కాగా, పీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ, వైఎస్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

మెజారిటీ స్థానాల్లో గెలుపునకు కృషి చేయాలి

- ఏపీ కోఆర్డినేటర్లతో ఖర్గే భేటీ

న్యూఢిల్లీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఏపీలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి రానుండడంతో మెజారిటీ స్థానాల్లో గెలుపొందేందుకు కృషి చేయాలని ఏపీ నేతలకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. గురువారం, ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏపీ లోక్‌సభ కోఆర్డినేటర్లతో ఆయన సమావేశమయ్యారు. ఏపీలో పార్టీ పరిస్థితిపై ఆరా తీశారు. సీనియర్ నేత తులసీరెడ్డి మాట్లాడుతూ... కలిసొచ్చే వాళ్లతో ఏపీలో పొత్తులుంటాయని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో నిర్బంధకాండను వ్యతిరేకిద్దాం: వడ్డే

విజయవాడ(మొగల్రాజపురం), జనవరి 11: రాష్ట్రంలో జరుగుతున్న నిర్బంధకాండను ప్రతి ఒక్క ప్రజాస్వామికవాది వ్యతిరేకించాలని రైతాంగ పరిరక్షణ కమిటీ కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. ఏపీటీఎఫ్ పూర్వప్రధాన కార్యదర్శి ఎన్.పరమేశ్వరరావు ద్వితీయ వర్ధంతి సభను గురువారం విజయవాడలోని పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య కాషాయీకరణ అనే అంశంపై ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు విద్యారంగంలో ఉన్న లౌకిక విలువలు ఎన్‌డీఏ పాలనలో కనుమరుగయ్యాయన్నారు. జాతీయ విద్యా విధానంలో విద్యను ప్రయివేటీకరించే కుట్ర జరుగుతోందని చెప్పారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.మంజుల, పూర్వ అధ్యక్షుడు ఎ.నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసుల తరలింపు అప్పీల్‌పై నేడు విచారణ

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సీఎం క్యాంపు కార్యాలయం తరలింపు వ్యవహారంపై హైకోర్టు శుక్రవారం విచారణ జరపనుంది. అమరావతి నుంచి ప్రభుత్వ కార్యాలయాలను విశాఖకు తరలిస్తున్నారంటూ దాఖలైన వ్యాజ్యాలను తగిన బెంచ్ విచారణ చేపట్టేవరకు ప్రభుత్వ కార్యాలయాలను విశాఖకు తరలించవద్దని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేయడం.. అప్పీల్ వేయడం తెలిసిందే. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావుతో కూడిన ధర్మాసనం విచారణ జరపనుంది.

స్వగ్రామానికి వస్తే అరెస్టు చేసే అవకాశం ఉంది

- చట్ట నిబంధనలు పాటించేలా పోలీసులను ఆదేశించండి
- హైకోర్టును ఆశ్రయించిన ఎంపీ రఘురామ

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో నర్సాపురం పార్లమెంట్‌నియోజకవర్గ ప్రజలను కలుసుకొనేందుకు రాష్ట్రానికి వస్తున్న తనను పోలీసులు తప్పుడు కేసు పెట్టి అరెస్ట్ చేసే ప్రమాదం ఉందని, చట్ట నిబంధనలు పాటించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. రఘురామ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్, పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది మహేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు. ఈ వ్యవహారంపై తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొంటూ న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

జనసేన ఫ్లెక్సీ చింపి.. కత్తితో వీరంగం

రావులపాలెంలో వైసీపీ కార్యకర్త బరితెగింపు

రావులపాలెం, జనవరి 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో జనసేన పార్టీకి చెందిన ఫ్లెక్సీని చించేసిన ఓ వైసీపీ కార్యకర్త.. నడిరోడ్డుపై కత్తి, ఇనుప రాడ్డుతో వీరంగం చేశాడు. కోనసీమ కల్యాణ మండపం వద్ద జనసేన జెండా దిమ్మె ఏర్పాటు చేశారు. అక్కడ పవన్, ఆ పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్‌తో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి జెండా దిమ్మె ప్రారంభోత్సవానికి ముందు కంబాల సూరిబాబు అనే వైసీపీ కార్యకర్త.. ఓ చేతిలో కత్తి, మరో చేతిలో రాడ్డు పట్టుకుని వీరంగం సృష్టించి ఫ్లెక్సీ చింపివేశాడు. బండారు శ్రీనివాస్, పెద్ద ఎత్తున జనసైనికులు అక్కడికి వద్దకు చేరుకుని సూరిబాబును వెంటనే అరెస్టు చేసి, చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. సుమారు 2గంటల పాటు నిరసన కొనసాగింది. సూరిబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ ఎస్ఐ కిరణ్‌కుమార్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.



జనసేన ఫ్లెక్సీ చించేసి.. కత్తి, రాడ్డుతో వీరంగం చేస్తున్న వైసీపీ కార్యకర్త కంబాల సూరిబాబు

మంత్ర'ముగ్గు'లైన వేళ!




ముగ్గుల పోటీ విజేత మొలుగు రాజుకు చెక్కును అందిస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి

- కనుల పండువగా 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్స్
- సంప్రదాయం ఉట్టిపడేలా రంగవల్లుల పండుగ
- ప్రథమ బహుమతి అందుకున్న విజయనగరం జిల్లాకు చెందిన మొలుగు రాజు
- గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతి
- రైతు గౌరవానికి సూచిక సంక్రాంతి
- తెలుగువారికి అతిపెద్ద పండుగ: పురందేశ్వరి

విజయవాడ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నింగిలోని నక్షత్రాలు నేలకు రాలాయి. మహిళల మునివేళ్ల నుంచి జాలువారి ముత్యాల ముగ్గులై అవనిని ముద్దాడాయి. చుక్కలతో అందంగా తీర్చిదిద్దిన రంగవల్లులు సంక్రాంతి శోభను ముందే తీసుకొచ్చాయి. 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ గురువారం విజయవాడలో జరిగాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ పోటీలను ప్రారంభించారు. విజేతలకు ముఖ్య అతిథి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ, తెలుగు ప్రజలకు అతిపెద్ద పండుగ సంక్రాంతి అని చెప్పారు. సంక్రాంతి అంటే చీకటి రోజులు వెళ్లిపోయి వెలుగు రోజులు వస్తాయని, మనలోని అజ్ఞానాన్ని తొలగించుకుని విజ్ఞానాన్ని పెంచుకోవడానికి దీన్ని ఒక నిదర్శనంగా తీసుకోవాలని తన నాయనమ్మ వివరించారని గుర్తుచేసుకున్నారు. తాము చిన్నతనంలో బియ్యంపిండిలో ఇసుకను కలిపి ముగ్గులు వేసేవాళ్లమని, ఆ పిండిని చీమలు తినేవని, ఇది ఒకవిధంగా అన్నదానంతో సమానమని తన తల్లి చెప్పారని వివరించారు. రైతులకు ఇచ్చే గౌరవానికి సంక్రాంతి సూచికని చెప్పారు. భోజనం చేసిన తర్వాత ఒక్క మెతుకు కూడా కంచంలో వదలొద్దని తన తండ్రి చెప్పేవారన్నారు. ఆయన భోజనం చేసేటప్పుడు అన్నం మెతుకు కింద పడితే తీసి కళ్లకు అద్దుకుని నోట్లో వేసుకునేవారని చెప్పారు. అన్నపూర్ణాదేవికి ఇచ్చిన గౌరవాన్ని రైతులకు ఇవ్వాలని ఆయన చెప్పేవారని, ఆ విషయాలను ఇప్పటి పిల్లలకు వివరించాలని తల్లిదండ్రులకు సూచించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడానికి 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' చేస్తున్న కృషిని పురందేశ్వరి ప్రశంసించారు. ముగ్గుల పోటీలు మహిళల్లో ఉన్న సహనానికి పరీక్షని అభిప్రాయపడ్డారు. గద్దె అనురాధ మాట్లాడుతూ ఈ సంక్రాంతి ప్రజల అందరి జీవితాల్లో ఆనందాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు మాట్లాడుతూ పెరడు, వాకిలి అనే పదాలను మరచిపోయి బాల్కనీకి అలవాటుపడిన నేటి రోజుల్లో ఇటువంటి ముగ్గుల పోటీలు ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువస్తాయన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా సామాజిక కార్యకర్తలు అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. మొదటి బహుమతిని విజయనగరం జిల్లాకు చెందిన మొలుగు రాజు సాధించారు. ఆమెకు రూ.30వేల చెక్కును పురందేశ్వరి అందజేశారు. గుంటూరు జిల్లాకు చెందిన ఎ.సునీత, అనంతపురం జిల్లాకు చెందిన కె.ఉమాదేవి, తమిళనాడుకు చెందిన కె.రాధ రెండో బహుమతిని సాధించి ఒక్కొక్కరు రూ.10వేల చెక్కులు అందుకున్నారు. కన్సొలేషన్ బహుమతులను కెనరా బ్యాంక్ ఏజీఎం జీవీ నరసింహారావు అందజేశారు. కాగా, అంగన్వాడీ హెల్పర్‌గా పనిచేస్తున్న తన తల్లి ఇంటి ముందు వేసే ముగ్గులను చూసి తనకూ ఆసక్తి కలిగిందని విజేత ములుగు రాజు తెలిపారు. ఆర్కెస్ట్రాలో గాయనిగా ఉంటూ ముగ్గులు వేయడం నేర్చుకున్నానని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో మొదటి ప్రయత్నంలోనే రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఎ.సునీత - గుంటూరు, ద్వితీయ బహుమతి గ్రహీత


కె.ఉమాదేవి - అనంతపురం ద్వితీయ బహుమతి గ్రహీత


కె.రాధ - తమిళనాడు, ద్వితీయ బహుమతి గ్రహీత


ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

జనసేనలోకి ముద్రగడ!

జగన్‌కు కాపు ఉద్యమ నేత షాక్!!

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముంగిట సీఎం జగన్‌కు గట్టి షాకే తగిలింది. మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం వైసీపీని కాదని... టీడీపీ/జనసేనల్లో ఒక పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. వాస్తవానికి ముద్రగడ ప్రత్యక్ష రాజకీయాలకు కొన్నేళ్లుగా దూరంగా ఉంటున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచీ ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చారు. కాపు రిజర్వేషన్ల దగ్గర నుంచి కాపు కార్పొరేషన్లను జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసినా ఏరోజూ ఆయన నోరు విప్పలేదు. సరికదా.. ప్రశ్నించిన టీడీపీపైనే తిరిగి విమర్శలు చేస్తూ లేఖాస్త్రాలు విడుదల చేసేవారు. ఈ నేపథ్యంలో పూర్తి వైసీపీ నేతగా ముద్రగడ చలామణీ అవుతున్నారంటూ ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోశాయి. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ముద్రగడ కొంత ఆసక్తిగా ఉన్నారు. తనతోపాటు తనయుడిని కూడా ఎన్నికల బరిలోకి దించాలని ఉవ్విళ్లూరుతున్నారు. వైసీపీ సైతం ఆసక్తి చూపించింది. టీడీపీ, జనసేన ఎన్నికల పొత్తు కుదుర్చుకున్న నేపథ్యంలో ఆ ప్రభావం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అత్యంత బలంగా ఉన్నందున టీడీపీ కూటమి వైపు కాపు సామాజికవర్గ ఓట్లు మళ్లకుండా కొంతైనా చీలిక తెచ్చేందుకు జగన్ ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకు ముద్రగడను పార్టీలో అధికారికంగా చేర్చుకుని ఎక్కడో చోట సీటు ఇవ్వాలని భావించారు. జగన్ సన్నిహితుడైన కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి తరచూ ముద్రగడతో సంప్రదింపులు కూడా జరుపుతున్నారు. ఆయన తనయుడికి కాకినాడ ఎంపీ టికెట్ ఇప్పించేందుకు ప్రయత్నాలు చేశారు. ముద్రగడ సైతం జిల్లాలో పిఠాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట సీట్లలో ఎక్కడో చోట పోటీ చేయడానికి సానుకూలత చూపారు. ఈలోపు జగన్ అక్కడ సిటింగ్ ఎమ్మెల్యేలను తప్పించి కొత్త ఇన్‌చార్జులను ప్రకటించారు. దీంతో ముద్రగడ మనస్తాపం చెందారు. ఇటీవల తాడేపల్లి వెళ్లి అక్కడే రెండు రోజులు మకాం వేశారు. కానీ జగన్ అపాయింట్‌మెంట్ దొరకలేదని ఆయన సన్నిహితులు పేర్కొన్నారు. అటు పార్టీ జిల్లా పరిశీలకుడు మిథున్‌రెడ్డి నుంచి కూడా సరైన స్పందన రాకపోవడం, తన వద్దకు వీరెవరూ రాకపోవడంతో ముద్రగడ నొచ్చుకున్నట్లు సమాచారం. వైసీపీకి ఇంతకాలం పరోక్షంగా సహకరించినా.. ఇదేనా ఇచ్చే మర్యాద అని గుర్రుగా ఉన్నట్లు ఆయన వర్గంలో ప్రచారం జరుగుతోంది. ఈ అవమానం నేపథ్యంలో వైసీపీకి దూరంగా ఉండాలని ముద్రగడ నిర్ణయించారు.

దారి అటేనా..!

బుధ, గురువారాల్లో జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడిలో ఉన్న ముద్రగడ స్వగృహానికి తాడేపల్లిగూడెం జనసేన నేతలు వచ్చి ఆయన్ను కలిశారు. జగ్గంపేట టీడీపీ ఇన్‌చార్జి జ్యోతుల నెహ్రూ గురువారం వెళ్లి సమావేశమయ్యారు. బయటకు సాధారణ భేటీ అని నేతలు చెబుతున్నా టీడీపీ, జనసేనల్లో ఎందులో చేరాలనేదానిపై విడివిడిగా చర్చలు జరిపినట్లు సమాచారం. జనసేనలో చేరేందుకు దాదాపుగా నిర్ణయించారని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఇదే విషయమై ముద్రగడ తనయుడు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. టీడీపీ, జనసేనల్లో ఏదో ఒక పార్టీలో తాము చేరే అవకాశం ఉందన్నారు. వైసీపీలోకి వెళ్లడానికి తన తండ్రి ఆసక్తిగా లేరని చెప్పారు. ఈసారి కచ్చితంగా పోటీలో ఉంటామని, త్వరలోనే నిర్ణయం ఉంటుందన్నారు. అన్నింటికీ సిద్ధపడి గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నామని తెలిపారు.


పవన్ కల్యాణ్‌ను కలిసిన మాగంటి బాబు

నా ఇంటికి వైసీపీ వాళ్లు రావొద్దు!

తాజా పరిణామాల నేపథ్యంలో వైసీపీ జిల్లా పరిశీలకుడు మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు.. ముద్రగడతో చర్చించడానికి సిద్ధమయ్యారు. కానీ ఆయన తిరస్కరించినట్లు తెలిసింది. వైసీపీ నుంచి ఎవరూ తన ఇంటికి రావద్దని ఘాటుగానే చెప్పినట్లు సమాచారం. ఆయన ఆ పార్టీపై కోపంగా ఉండడానికి కారణముంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ముద్రగడ పోటీ చేసినా ఫలితం ఉండదని వైసీపీ పెద్దలు వ్యాఖ్యానించడంతో ఆయన నొచ్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన్ను బుజ్జగించడానికి రాజ్యసభకు పంపుతామని వైసీపీ నాయకత్వం ప్రతిపాదిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ప్రతి చేతికీ పని.. ప్రతి చేనుకూ నీరు

- వ్యవసాయం, ఉద్యోగం, యువతకు ఉపాధి
- జనసేన మేనిఫెస్టో కమిటీ భేటీ... సుదీర్ఘ చర్చ

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ మేనిఫెస్టో రూపకల్పనపై చర్చ 'ప్రతి చేతికీ పని... ప్రతి చేనుకీ నీరు' అనే లక్ష్యం దిశగా కమిటీ చర్చలు సాగాయి. జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ గురువారం విజయవాడలో పార్టీ మేనిఫెస్టో కమిటీతో సమావేశం అయ్యారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల మెరుగుదల, వ్యవసాయ రంగానికి అండగా నిలవడం, పేదల సంక్షేమం, మహిళా భద్రత, రాష్ట్రాభివృద్ధి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కాపు సంక్షేమ సేన తరఫున ఆ సంస్థ వ్యవస్థాపకులు చేగొండి హరిరామజోగయ్య పంపించిన పీపుల్స్ మేనిఫెస్టోపై చర్చించారు. జనసేన మేనిఫెస్టో కమిటీని ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్, పార్శిల్ లారీ అసోసియేషన్, ట్రాలర్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి రవాణా రంగాన్ని ప్రోత్సహించాలని కోరారు. ఏపీ నిరుద్యోగ ఐక్య కార్యాచరణ సమితి ప్రతినిధులు తమ సమస్యలను, నోటిఫికేషన్లు విడుదల కాకపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెల్లడించి వినతిపత్రం అందచేశారు.

జనసేనానిని కలిసిన పలువురు నేతలు

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను పలువురు నేతలు మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. కాపు సంక్షేమ సేన అధ్యక్షులు చేగొండి హరిరామ జోగయ్య, పవన్‌తో భేటీ అయ్యారు. జనసేనానితో మర్యాదపూర్వకంగా సమావేశమైన మాగంటి బాబు... సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, పవన్‌తో సమావేశమయ్యారు. పలు అంశాలు భేటీలో చర్చకు వచ్చాయి.

అవే జిత్తులు.. ఏమార్చే ఎత్తులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రజలను ఒప్పించి, మెప్పించి ఎన్నికల్లో గెలిచే పరిస్థితులు లేకపోవడంతో వైసీపీ అడ్డదారులకు వ్యూహాలు పన్నుతోంది. ఓ వైపు ఉద్యోగ సంఘాలు రోడ్డెక్కడం, రైతులు సంతృప్తిగా లేకపోవడం, ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమంలో వైసీపీ సర్కారు విఫలంగా కావడం, మైనారిటీలను పూర్తిగా వదిలేయడంతో, యువత, మహిళ, విద్యార్థులు జగన్ సర్కారుపై మండిపడుతున్నారు. ప్రభుత్వం, జగన్ పాలనపై రాష్ట్ర వ్యాప్తంగా అసంతృప్త జ్వాలలు పెల్లుబుకుతున్నాయి. ప్రజల వ్యతిరేకతను తగ్గించుకునే మార్గాలు అన్వేషించకుండా ఉద్యమాలను అణిచివేసే ధోరణిలో జగన్ సర్కారు వ్యవహరిస్తోంది. దీంతో అన్నీ వర్గాల ప్రజలు ప్రభుత్వంపై కసితో ఉన్నారు. ఎన్నికలు ఎప్పుడొస్తే అప్పుడు ప్రభుత్వం అంతుచూడాలని ఎదురుచూస్తున్నారు. దీంతో గత ఎన్నికల్లో వేసిన ఎత్తులు, తొక్కిన దొంగదారుల్నే ఆశ్రయించాల్సిన పరిస్థితి! అప్పట్లో ఓటర్ల జాబితా ప్రక్రియలో తిమ్మినిబమ్మిని చేశారు. సోషల్ మీడియాలో అబద్ధాలు ప్రచారం చేశారు. ఫారం-6, ఫారం-7పై దృష్టిపెట్టి జాబితాలో వైసీపీ సానుభూతిపరులను ఇబ్బడిముబ్బడిగా చేర్చగలిగారు. ఓటరు నమోదుపై ఇప్పుడుంత చైతన్యం, విపక్షాల్లో కనిపిస్తున్న అవగాహన లేకపోవడంతో జగన్ వేసిన ఎత్తు అప్పుడు పారింది.

30 నియోజకవర్గాల్లో ఓటర్ల తారుమారు

నెల్లూరు నగర నియోజకవర్గంలో గత ఎన్నికల ముందు సుమారు 47వేల ఓట్లు జాబితాలో నమోదయ్యాయి. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు కలిగిన ఓట్లే సుమారు 30 వేలకు పైగా ఉన్నాయి. ఈ ఓట్లన్నీ కేవలం వైసీపీ సానుభూతిపరులవే. ఆ ఎన్నికల్లో అందరూ అప్పటి మంత్రి నారాయణ గెలుస్తారని భావించినప్పటికీ స్వల్ప మెజారిటీతో ఆయన ప్రత్యర్థి అనీల్‌కుమార్ యాదవ్ గెలిచారు. ఓటర్ల జాబితాకు సంబంధించి వైసీపీ చేసిన కసరత్తుతోనే ఈ విజయం సాధ్యమైందని తాజా విశ్లేషణలో వెల్లడైంది. రాష్ట్రంలో సుమారు 30 నియోజకవర్గాల్లో ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రత్యర్థి పార్టీల ఓటర్లను తొలగించడంలోనూ వైసీపీ నేతలు అప్పట్లో సఫలీకృతమయ్యారు.

అదే వైసీపీ దృష్టి...

వైసీపీ సర్కారు తొలినుంచీ ఫారం-7, ఫారం-6 పైనే దృష్టిపెట్టింది. మూడేళ్లుగా ప్రత్యర్థి పార్టీలకు చెందిన ఓట్లను కోసే పనిలోనే ఉంది. సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల సేవలను ఎన్నికల కోసమే ఉపయోగించుకుంటోంది. వీరు వేసే ఎత్తులను టీడీపీ వర్గాలు సత్వరం పసిగట్టలేకపోయాయి. అప్పటికీ టీడీపీ రాష్ట్ర స్థాయి టెక్నికల్ విభాగం.. వైసీపీ జిమ్మిక్కులపై ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు ఇస్తూ అప్రమత్తం చేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో టీడీపీ కార్యకర్తలు.. వైసీపీ ఎత్తుగడలను, జిమ్మిక్కులను ఎదుర్కొలేకపోతున్నారు. దీంతో ఇప్పటికీ గ్రామాల్లో ఓటర్ల జాబితా గందరగోళంగానే ఉంది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ దొంగ ఓట్లను చేర్చేందుకు, ప్రత్యర్థి ఓటర్లను తొలగించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. వారి ఎత్తుగడలతో టీడీపీ కార్యకర్తలు ఓటర్ల జాబితాకు కాపలాదారులుగా మారిపోయారు. రాష్ట్రంలో ఏదో ఒక నియోజకవర్గంలో దొంగ ఐడీలను ఉపయోగించి ఓటర్ల జాబితాలోని ప్రత్యర్థి ఓట్ల తొలగింపునకు వైసీపీ నాయకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్నారు. అయితే చంద్రబాబు ఫిర్యాదు తర్వాత ఫారం-7 గంపగుత్త దరఖాస్తుల గురించి త్రీమెన్ కమిటీతో విచారణ చేపట్టాలని ఈసీ నిర్ణయించింది. ఆ తర్వాత నుంచి వైసీపీ కొత్త మార్గాన్ని అన్వేషించ సాగారు. గ్రామాల్లో పలువురు ఐడీలతో ఐదు ఓట్లలోపు తొలగింపుల కోసం ఫాం-7 దరఖాస్తు చేశారు. క్షేత్రస్థాయిలో ఈ దరఖాస్తులను పరిశీలించడానికి దరఖాస్తుదారులను వాకబు చేయగా, చాలాచోట్ల ఆ దరఖాస్తులు తాము పెట్టలేదని, తమకు తెలియదని చెప్పసాగారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికల సిబ్బంది...ఫిర్యాదుదారులను ట్రేస్ చేయలేక విచారణను మూసేస్తున్నారు. ఇలా ఏదో ఒక ఎత్తుగడతో ఎన్నికల సిబ్బందికి వైసీపీ నేతలు, కార్యకర్తలు నిద్ర లేకుండా చేస్తున్నారు. గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు అప్రమత్తంగా లేనిచోట వైసీపీ శ్రేణుల ఎత్తుగడలు ఫలించి ఓటర్ల జాబితా వారి ఇష్టానుసారంగా తయారవుతోంది.

ఎన్నికలకు సమయం ఉండటంతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా ముందస్తుగా కొంతమేర అప్రమత్తమైనా... నోటిఫికేషన్ తర్వాత ఎన్నికల ముందు చేర్పులు, తొలగింపులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఓటర్ల చేర్పులకు సంబంధించి నామినేషన్లు దాఖలు ఆఖరితేదీ దాకా అవకాశం ఉంది. నోటిఫికేషన్ వేసిన తర్వాత మరో పది రోజుల వరకు తొలగింపులకు గంపగుత్తగా ఫారం-7 దరఖాస్తు చేసేందుకు అవకాశం ఉంది. వాటి పరిశీలన మూడు వారాల్లో చేపడతారు. అంటే ఎన్నికల తేదీకి ఐదారు రోజుల ముందు ఓటర్ల జాబితాలో పలు ఓట్లు గల్లంతయ్యే అవకాశముంది. ఈ సమయంలోనే ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ ఎత్తుగడలను పసిగట్టిన కొంత మంది సాఫ్ట్‌వేర్ నిపుణులు... వైసీపీ ఇప్పుడు కూడా పలు రకాల జిత్తులమారి ఎత్తుగడలు వేస్తోందని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. టీడీపీ వర్గాలను చైతన్య పరిచేందుకు నిపుణుల బృందం...ఓటర్ల జాబితాకు సంబంధించి ఎన్ని రకాల మోసాలు జరుగుతున్నాయో వివరిస్తున్నారు.

వైసీపీ విజయంలో దొంగ ఓట్లే కీలకం

గత ఎన్నికల అక్రమాలు వెలుగులోకి



ప్రొద్దుటూరు ఎస్ఈబీ ఎస్ఐ అలీబేగ్ కుర్చీలో కూర్చొన్న ఎమ్మెల్యే రాచమల్లు.. అన్ని కుర్చీలనూ వైసీపీ నేతలు ఆక్రమించడంతో.. నిలబడి ఉన్న ఎస్ఐ అలీబేగ్, ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ఎస్పీ కాదు.. వాళ్లమ్మ మొగుడికి చెప్పు!

- మద్యం పట్టుకుంటే రోజూ స్టేషనుకు వస్తా
- ప్రొద్దుటూరు ఎస్ఈబీ అధికారులపై ఎమ్మెల్యే రాచమల్లు ఆగ్రహం

ప్రొద్దుటూరు, జనవరి 11: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒకవ్యక్తి 30 మద్యం బాటిళ్లను తీసుకెళుతుండగా ఎస్ఈబీ అధికారులు పట్టుకోవడంపై ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి నేరుగా ఎస్ఈబీ కార్యాలయానికి వెళ్లి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రూల్స్ ప్రకారం తాము పట్టుకున్నామని ఎస్ఈబీ ఎస్ఐ అలీబేగ్ వివరణ ఇవ్వగా "ఎస్పీ కాదు.. వాళ్లమ్మ మొగుడికి చెప్పు.. మీరు మద్యం పట్టుకుంటే వారిపక్షాన రోజూ స్టేషనుకు వస్తా" అని హెచ్చరించారు. గురువారం మధ్యాహ్నం ఈ సంఘటన వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో చోటుచేసుకుంది. వివరాలిలా.. ప్రొద్దుటూరు పట్టణ శివారు ఎర్రగుంట్లరోడ్డు వాసవీ సర్కిల్ సమీపంలో గురువారం మధ్యాహ్నం పల్లా పుల్లయ్య అనే వ్యక్తి 30 మద్యం బాటిళ్ల బ్యాగులో తీసుకెళుతుండగా ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది పట్టుకున్నారు. చట్టప్రకారం అతడిని ఎస్ఈబీ కార్యాలయానికి తీసుకొచ్చి కేసు నమోదు చేశారు. ఈ విషయం ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి దృష్టికి వైసీపీ నేతలు తీసుకెళ్లగా, ఆయన తన అనుచరగణంతో ఎస్ఈబీ కార్యాలయం చేరుకుని ఎస్ఐ అలీబేగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వ్యక్తికి రోజుకు ఎన్నిమద్యం బాటిళ్లు ఇస్తారని ఎమ్మెల్యే.. ఎస్ఐని ప్రశ్నించారు. రోజుకు మూడు బాటిళ్లు మాత్రమే ఇస్తారని చెప్పగా.. 'నలుగురు ఐదుగురు మంది తీసుకున్న బాటిళ్లు ఒకరు తీసుకెళితే తప్పా. పుల్లయ్య అనే వ్యక్తి వాళ్లమ్మ దినం కోసం మద్యం బాటిళ్లు తీసుకెళ్తున్నాడు.. పేదలను పట్టుకుంటారా?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూల్స్ అతిక్రమించి తాము వ్యవహరించలేమని ఎస్ఐ చెప్పగా.. 'చట్టాన్ని మార్చుకో' అని ఎమ్మెల్యే బల్లగుద్ది గద్దించారు. ఇలా ప్రభుత్వ మద్యం పట్టుకుంటే రోజూ స్టేషనుకు వస్తానని, ఇలాగే ప్రశ్నిస్తానని ఆవేశం వెలిబుచ్చారు. 'ఎస్పీ కాదు.. వాళ్లమ్మ మొగుడుకి చెప్పు.. మీరు మద్యం పట్టుకోవద్దు' అని మరోసారి వారిని హెచ్చరించారు. ఆయన వెంట పలువురు వైసీపీ ముఖ్య నేతలు ఉన్నారు. కాగా.. ఎమ్మెల్యే, ఆయన అనుచరులంతా ఎస్ఈబీ కార్యాలయానికి వచ్చేటప్పటికి ఎస్ఐ అక్కడ లేరు. వీరు కాసేపు చర్చించుకున్న తర్వాత ఎస్ఐని పిలిపించారు. అప్పటికే ఎస్ఐ కుర్చీలో ఎమ్మెల్యే రాచమల్లు కూర్చొని ఉండగా, మిగిలిన అన్ని కుర్చీల్లో వైసీపీ నేతలంతా కూర్చొని ఉండటంతో తన స్టేషన్‌లో ఎస్ఐ నిలబడి ఉండాల్సి వచ్చింది. దీనిపై అలీబేగ్‌ను వివరణ కోరగా..కుర్చీ లేకుండా నిలబెట్టి మాట్లాడడాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు.

అక్రమార్జనలో తోపులు!

అమ్మో ఎమ్మెల్యే

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబం పనిగా పెట్టుకుంది. ఎమ్మెల్యేగా ప్రజలు ఆ కుటుంబంలో ఒకరిని గెలిపిస్తే, ఎమ్మెల్యే సోదరులు, వారి కుటుంబ సభ్యులు షాడో ఎమ్మెల్యేలుగా చలామణి అవుతున్నారు. అక్రమార్జనకు కాదేదీ అనర్హమంటూ అన్నింటిలోనూ తలదూరుస్తూ రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. హైదరాబాద్, బెంగళూరు జాతీయ రహదారికి ఇరువైపులా ఆ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం ఉంటుంది. దాదాపు 60 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి నియోజకవర్గం పరిధిలో ఉండటంతో.. దానికి ఇరువైపులా ఉన్న వివాదాస్పద భూముల పంచాయితీలు ఎమ్మెల్యే సోదరుల కనుసన్నల్లోనే పరిష్కారమవుతున్నాయి. అందుకు ఎవరైనా సరే కప్పం కట్టాల్సిందే. ఇక ప్రభుత్వ భూముల ఆక్రమణ సరేసరి. మాట వినకున్నా... ఎదురు తిరిగినా... విమర్శలు చేసినా... వారిపై దాడులు తప్పవు. అనుచరులే ఈ తోపు ఎమ్మెల్యే కుటుంబానికి బినామీలుగా వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన పరిశ్రమ ఇక్కడి నుంచి పరారవడానికి ఆ ఎమ్మెల్యే కుటుంబసభ్యులే కారణమనేది ఇక్కడ ఎవరినడిగినా చెబుతారు. దళితుల భూములను ఆ ఎమ్మెల్యే అనుచరులు ఆక్రమించుకున్నారు. బాధితులు అధికారులకు మొరపెట్టుకున్నా.. ఎమ్మెల్యే చెంతకు వెళ్లి ప్రాధేయపడాలని సూచనలు ఇచ్చారే తప్ప.. చేసింది ఏమీ లేదు. పేదల బియ్యంలోనూ ఆయనకు వాటా ఇవ్వాల్సిందే.



గద్దల్లా వాలి..

జాతీయ రహదారికి ఇరువైపులా ఆ నియోజకవర్గం విస్తరించి ఉండటంతో ఎక్కడ వెంచర్లు వేసినా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు గద్దల్లా వాలిపోతుంటారు. వెంచర్లు వేయాలంటే కప్పం కట్టాల్సిందేనని హుకుం జారీ చేస్తుంటారు. ఎకరాకు ఏకంగా రూ.10 లక్షలు చొప్పున దండుకుంటున్నారు. గత ప్రభుత్వంలో వేసిన వెంచర్లనూ వదలడం లేదు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఆ నియోజకవర్గం ఉంది. అనంతపురం నగరం రోజురోజుకు విస్తరిస్తుండటంతో రియల్ వెంచర్లు ఈ నియోజకవర్గం వరకు విస్తరించాయి. ఇంకేముంది.. ఈ తోపులు అక్కడ వాలిపోయారు. ముక్కుపిండి మరీ రూ.కోట్ల మామూళ్ల వసూలు చేస్తున్నారు. సిటీ పేరుతో వేసిన ఓ వెంచర్ నిర్వాహకులను బెదిరించి దాదాపు రూ.15 కోట్లు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఓ వివాదాస్పద భూమిలో జోక్యం చేసుకుని, భారీగా ప్లాట్లు రాయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరో లేఅవుట్ నిర్వాహకుల నుంచి ఏకంగా రూ.5 కోట్లు, ఓ రియల్టర్ నుంచి రూ.2 కోట్లు వసూలు చేశారు. అడిగినంత కప్పం కట్టకపోతే బెదిరిస్తున్నారని బాధిత రియల్టర్లు బహిరంగంగానే చెప్పుకొంటున్నారు. సివిల్ సప్లయిస్ స్టేజ్-1 కాంట్రాక్టర్‌తోనూ ఒప్పందం కుదుర్చుకుని, పేదల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ అందులోనూ వాటాలు పొందుతున్నారన్న ఆరోపణలున్నాయి. చివరికి టమోటా మార్కెట్ సుంకం, టోల్‌ప్లాజా నుంచీ కమీషన్లను వదలడం లేదు. రోజుకు రూ.లక్ష ముట్టజెప్పాల్సిందేనని బాధితులు బహిరంగంగానే చెబుతున్నారు.

భూములను వదలని షాడో ఎమ్మెల్యేలు

ఎక్కడ వివాదాస్పద భూములున్నా షాడో ఎమ్మెల్యేలు రంగ ప్రవేశం చేస్తారు. జాతీయ రహదారి పక్కనున్న దాదాపు 100 ఎకరాలకుపైబడి భూమిని బలవంతంగా లాక్కున్నట్లు విమర్శలు ఉన్నాయి. గతంలో రాజకీయాల్లో పేరుమోసిన ఓ కుటుంబానికి చెందిన రూ.కోట్ల విలువ చేసే భూమిని లాక్కున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రైతులనూ వదలడం లేదు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో, పలువురు రైతులకు సంబంధించిన 15 ఎకరాలను లాక్కున్నట్లు సమాచారం. ఈ లెక్కన 200 ఎకరాలకుపైగానే సొంతం చేసుకుని ఉంటారని అధికార పార్టీ శ్రేణుల్లోనే చర్చ జరుగుతోంది.

ధాబానే అరాచకాలకు అడ్డా

ఆ ఎమ్మెల్యే కుటుంబానికి ఎవరు అడ్డు చెప్పినా, చెప్పిన మాట వినకపోయినా.. పోలీసులను అడ్డు పెట్టుకొని బెదిరిస్తారు. లేకుంటే ఎమ్మెల్యే సోదరులే నేరుగా రంగంలోకి దిగుతారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ ధాబాను అడ్డాగా చేసుకుని ఎమ్మెల్యే సోదరులు అరాచకాలు, దౌర్జన్యాలు, పంచాయితీలు చేస్తున్నారు. ఈ విషయం నియోజకవర్గంలో అందరికీ తెలిసిందే. వారి అరాచకాలు, దౌర్జన్యాలతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ మారితే.. వారిపై దాడులు చేయిస్తారు. ఈ ఎమ్మెల్యే కుటుంబానికి ఫ్యాక్షన్ నేపథ్యం కూడా ఉండడంతో ఎన్ని అరాచకాలు చేసినా, బెదిరించినా.. బాధితులెవరూ బయటకురాలేని పరిస్థితులు ఆ నియోజకవర్గంలో ఉండడం గమనార్హం.

భూములు.. బాదుడు!

అనుచరులను బినామీలుగా చేర్చి, ప్రభుత్వ భూములను రిజిస్టర్ చేయించుకుంటున్నారు. సొంత సామాజికవర్గానికి చెందిన అనుచరుల పేరిటే భూములను రాయించుకుంటున్నారు. ఆ ఎమ్మెల్యే సోదరులతో పాటు సొంత సామాజిక వర్గానికి చెందిన ఆరుగురు బినామీల పేరిట భూములు ఉన్నట్లు తెలుస్తోంది. ఓ యూనివర్సిటీకి చెందిన ఐదెకరాల భూమిని కబ్జా చేసేందుకు ఆ భూమిని చదును చేశారు. ప్రస్తుతం ఆ భూమికి సంబంధించి వివాదం నడుస్తోంది. జగనన్న లేఅవుట్ల ముసుగులో కొండలను పిండిచేసి ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు. సొంత పార్టీ నేతలు అనుమతులు పొంది ఎర్రమట్టిని తరలించినా.. ఎమ్మెల్యే కుటుంబానికి కప్పం కట్టాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు.

మహిళల సొమ్ముతో వ్యాపారం

డెయిరీ ఏర్పాటు ముసుగులో ఈ షాడో ఎమ్మెల్యేలు మహిళల నుంచి రూ.కోట్లు వసూలు చేశారు. రెండు మూడేళ్లు ఈ సొమ్మును ఎమ్మెల్యే కుటుంబం తమవద్దే ఉంచుకుని వడ్డీ వ్యాపారం చేసిందన్న ఆరోపణలు ఉన్నాయి. మహిళల నుంచి దాదాపు రూ.6 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. ఆ డెయిరీ ఏర్పాటు కోసం జిల్లా కేంద్రానికి సమీపంలోని ఓ గ్రామంలో ఐదెకరాలు భూమిని కబ్జా చేసినట్లు ఆరోపణలున్నాయి. మహిళల ఉపాధి కోసం గత ప్రభుత్వ హయాంలో ఓ పరిశ్రమను తీసుకొచ్చారు. ప్రభుత్వం మారిన తర్వాత ఆ పరిశ్రమ నిర్వాహకులను ఎమ్మెల్యే రూ.10 కోట్లు డిమాండ్ చేశారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో వారు పరిశ్రమను పొరుగు రాష్ట్రానికి తరలించారు.

అప్పుల్లో నుంచి వందల కోట్లకు

గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కుటుంబం అప్పుల్లో ఉంది. అప్పటికే రెండు సార్లు ఓటమి చెందడంతో ఆర్థికంగా కుదేలయ్యారు. ఆస్తులు కూడా అమ్ముకున్న పరిస్థితి. ఒక్క చాన్స్ గాలివాటంతో ఎమ్మెల్యేగా గెలవగా.. అక్రమార్జనకు అవసరమైన అన్ని అడ్డదారులను తొక్కారు. ప్రస్తుతం ఈ తోపు కుటుంబం రూ.వందల కోట్లకు పడగలెత్తిందన్న ప్రచారం ఉంది. పొరుగు రాష్ట్ర రాజధానిలోనూ ఆస్తులు కూడబెట్టుకున్నారు. ఎమ్మెల్యే కుటుంబ ఆస్తుల విలువ రూ.500 కోట్ల దాకా ఉంటుందని వైసీపీ వర్గాలే బాహాటంగా చెప్పుకోవడం గమనార్హం.

టీచర్లకూ ఎన్నికల డ్యూటీ!

(మొదటి పేజీ తరువాయి)

దూరం చేసేందుకు ఎత్తు వేసింది. బోధనేతర పనులు ఉపాధ్యాయులకు అప్పగించకూడదంటూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కేంద్ర ఎన్నికల సంఘం...ఉపాధ్యాయుల వివరాలు పంపమనడంతో జగన్ సర్కార్‌కు షాక్ తగిలినట్లయింది. పోలింగ్ విధులు నిర్వహించే వారిని మూడు విభాగాలుగా విభజించి పంపాలని కలెక్టర్లను మీనా ఆదేశించారు. రాష్ట్రంలో పోలింగ్ విధులకు మొత్తం ఎంత మంది ఉద్యోగులు అవసరం....టీచర్లు ఎంత మంది అందుబాటులో ఉన్నారు....గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు కాక మిగిలిన డిపార్టుమెంట్లలో ఎంతమంది ఉద్యోగులు అందుబాటులో ఉన్నారు....గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ఎంత మంది ఉన్నారు.....గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, టీచర్లు, ఇతర డిపార్టుమెంట్లలోని ఉద్యోగులు కాకుండా ఇంకా మిగిలిన ఉద్యోగులు ఎంత మంది ఉన్నారో పూర్తి వివరాలతో వెంటనే వివరాలు పంపాలంటూ జిల్లా కలెక్టర్లను సీఈవో ఆదేశాలు జారీ చేశారు. టీచర్లను బోధనేతర పనులకు అప్పగించకూడదని జగన్ సర్కార్ గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఓటర్ల జాబితాల్లోని మార్పులు చేర్పులను సచివాలయ సిబ్బందితో చేయించింది. దీనిపై టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను కూడా కలిసి టీచర్లకే ఎన్నికల నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు కోరారు. దీంతో రాష్ట్రంలోని టీచర్ల పూర్తి వివరాలు కేంద్ర ఎన్నికల సంఘం సేకరించే పనిలోపడింది.

వివరాలు ప్రొఫార్మాలో పంపండి...

విద్యాశాఖ పరిధిలోని ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది వివరాలను ప్రొఫార్మాలో పంపాలని విద్యాశాఖాధికారులు...మండల విద్యాశాఖాధికారులకు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యాశాఖ పరిధిలోని టీచర్లు, బోధనేతర సిబ్బంది వివరాలను 34 కాలమ్స్ ప్రొఫార్మాలో నింపి పంపాలని పేర్కొన్నారు. 12వ తేదీ ఉదయానికల్లా వాటిని జిల్లా విద్యాశాఖ కార్యాలయాలకు పంపాలని ఆదేశించారు. దీంతో ఉపాధ్యాయులు ఉరుకులుపరుగులు మీద ప్రొఫార్మాలను నింపి పంపే పనిలో బిజీబిజీగా ఉన్నారు. ఆ ప్రొఫార్మాలో గతంలో పోలింగ్ విధుల్లో పని చేశారా? చేస్తే ఏఏ విధులు నిర్వర్తించారు. పీవోనా, ఏపీవోనా, ఓపీవోనా మరే ఇతర విధులు నిర్వర్తించారు. ఎన్ని సార్లు పోలింగ్ విధులు నిర్వర్తించారు. తదితర వివరాలను, వారి నివాస ప్రాంతం, నియోజకవర్గం, సొంత ఊరు, సొంత నియోజకవర్గం ఎపిక్ కార్డు నెంబరు తదితర వివరాలను ప్రొఫార్మాలో పొందుపర్చాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులే కీరోల్...

ఉపాధ్యాయులు అంటే సహజంగా క్రమశిక్షణకు, నిబద్ధతకు మారుపేరుగా వ్యవహరిస్తారనే నమ్మకం ప్రజల్లో ఉంది. దేశంలో ఇప్పటి వరకు ఏ ఎన్నికలు జరిగినా సార్వత్రిక ఎన్నికల నుంచి పంచాయతీ ఎన్నికల వరకు ఉపాధ్యాయులు పోలింగ్ విధుల్లో లేని ఎన్నికలేలేవు. గతంలో జరిగిన శాసనసభ, పార్లమెంటు ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులే కీలక పాత్ర పోషిస్తూ వచ్చారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఉపాధ్యాయులే ఎన్నికల విధులు నిర్వహించారు. జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చాక జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతో సహా ఉపాధ్యాయులు ఎన్నికల విధులు నిర్వర్తించారు. జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయులపై వేధింపులకు దిగింది. దీంతో వారంతా జగన్‌పై గుర్రుగా ఉన్నారు.

జగన్ ఎత్తుకు కేంద్ర ఎన్నికల సంఘం పై ఎత్తు...

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఏదో విధంగా ఉపాధ్యాయులు పాల్గొనకుండా చేసి, తాము తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఎన్నికలు జరిపించుకుని మరోసారి గద్దెనెక్కాలనుకున్న జగన్ సర్కార్ ఆశాలపై కేంద్ర ఎన్నికల సంఘం నీళ్లు చల్లింది.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అన్ని శాఖల్లో కేటగిరీల వారీగా ఉద్యోగుల వివరాలతోపాటు ఉపాధ్యాయుల వివరాలు పంపాలని ఆదేశించింది. ఈ ఆదేశాలతో జిల్లాల్లోని రాబోయే శాసనసభ, పార్లమెంట్లు పోలింగ్ విధుల కోసం ఆయా యాజమాన్యాల్లోని ఉపాధ్యాయుల వివరాలు పంపాలని ఆయా జిల్లాల విద్యాశాఖాధికారులు ఆదేశాలు కింది స్థాయి అధికారులను ఆదేశించారు. చకచకా విద్యాశాఖాధికారులు వివరాలు పంపే పనిలో ఉన్నారు.దీంతో జగన్ సర్కార్ వెన్నులో వణుకు మొదలైంది. తమ ఎత్తు చిత్తయిందనే చింత మొదలైంది.

సీఈసీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- ఓటర్ల జాబితాలో లోపాలు సరిదిద్దే బాధ్యతా టీచర్లకు ఇవ్వాలి: సీఎఫ్‌డీ

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా ఉపాధ్యాయులను నియమించాలని చీఫ్ ఎలక్షన్ కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్ కుమార్, జాయింట్ సెక్రటరీ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని వినియోగించడం వల్ల అది లోపభూయిష్ఠంగా తయారైందని, వీరిపై అధికార పార్టీ నేతల జోక్యం ఎక్కువగా ఉండటం అనేక విమర్శలకు ఆస్కారమిచ్చిందని పేర్కొన్నారు. బల్క్‌గా ఫాం-7 స్వీకరించడం ద్వారా ప్రత్యర్థుల ఓట్లను తొలగించడం సర్వసాధారణంగా మారిందని ఆరోపించారు. అధికార పార్టీ కార్యకర్తలే 95 శాతంపైగా వలంటీర్లుగా నియమితులవడం, ఎలాంటి అనుభవం లేని సచివాలయ సిబ్బందిని బీఎల్వోలుగా నియమించడం, వీరు ప్రత్యక్షంగా, పరోక్షంగా అధికార పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములు కావడంపై సీఎఫ్‌డీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిందని వివరించారు. ఎన్నికల విధుల్లో వలంటీర్లను, సచివాలయ సిబ్బందిని వినియోగించరాదని కేంద్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ఎన్నికల అధికారులకి పలుమార్లు లేఖల ద్వారా విజ్ఞప్తులు చేశామని తెలిపారు. ఈ సమస్యపై వివిధ రాజకీయ పార్టీలు కూడా ఫిర్యాదు చేయడంతో స్పందించిన సీఈసీ ఈ నెల 12లోపు ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ వివరాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

మమ్మల్ని ఎందుకు సమ్మెలోకి దించారు?

- మధ్యలోనే కాడి వదిలేయడం కరెక్టేనా?
- సమగ్రశిక్ష జేఏసీపై తీవ్ర విమర్శలు

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె విరమిస్తున్నట్లు జేఏసీ ప్రకటించడంపై విమర్శలు మొదలయ్యాయి. సమ్మెలోకి దించి ఏం సాధించారో చెప్పాలంటూ ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిలదీస్తున్నారు. బుధవారం రాత్రి విద్యాశాఖ మంత్రి వద్ద చర్చలు జరిపిన అనంతరం సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మెను విరమిస్తున్నట్లు సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ బి.కాంతారావు ప్రకటించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన హామీలు రాకుండానే ఆయన సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించేశారు. దీనిపై జిల్లాల్లోని సమగ్రశిక్ష నాయకత్వం, ఉద్యోగులు మండిపడుతున్నారు. అసలు ఎవరిని అడిగి ఆ నిర్ణయం తీసుకున్నారని ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగుల వాట్సాప్ గ్రూపుల్లోనూ గురువారం ఇదే కీలక చర్చగా మారింది. మరికొంతకాలం సమ్మెను కొనసాగించి ఉంటే ఫలితాలు వచ్చేవని అనేక మంది అభిప్రాయపడ్డారు. ఏం సాధించారని సమ్మె విరమించారో అర్థకావడం లేదని ఉద్యోగులంతా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేయగా అది కుదరదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. మినిమం టైమ్ స్కేలు వర్తింపజేయాలని కోరగా దానిపై స్పష్టమైన హామీ ఇవ్వకుండా దీనిపై మూడు కేటగిరీల్లో వివరాలు సేకరిస్తున్నామని సమగ్రశిక్ష ఎస్పీడీ వారికి చెప్పారు. హ్యూమన్ రీసోర్స్ పాలసీపై ఉద్యోగులు పట్టుబట్టినా దీనిపై ఒక కమిటీని నియమిస్తామని మాత్రమే మంత్రి హామీ ఇచ్చారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఒక్కసారి కూడా జీతాలు పెరగనివారికి 23శాతం పెంచుతామని మంత్రి హామీ ఇచ్చారు. గత చర్చల్లోనే వీటిని ప్రకటించారు. కారుణ్య నియామకాలు చేపడతామని, కేజీబీవీల్లో పీజీటీలను తిరిగి విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

బరిలోకి దించి నీరుగార్చారు

సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందడం లేదు. గత ఆరు నెలలుగా మూడు నెలలకోసారి జీతాలు ఇస్తున్నారు. దీంతో సకాలంలో జీతాలు ఇవ్వాలనే డిమాండ్‌తో ఉద్యోగులు సమ్మెకు దిగారు. అనంతరం క్రమబద్ధీకరణ లేకపోతే ఎంటీఎస్ అయినా ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత ఇతర ప్రయోజనాలు ఇచ్చే హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని పట్టుబట్టారు. జీతాలు పెంచాలనేది మరో డిమాండ్. ఈ డిమాండ్లతో డిసెంబరు 20 నుంచి సమ్మెలోకి వెళ్లారు. అనంతరం కొద్దిరోజులకు విద్యాశాఖ మంత్రి విశాఖపట్నంలో వీరితో చర్చలు జరిపి ప్రధాన డిమాండ్లు పరిశీలిస్తామని, ఈ ప్రభుత్వంలో జీతాలు పెరగనివారికి 23శాతం పెంచుతామని హామీ ఇచ్చారు. చర్చల అనంతరం బయటికొచ్చిన జేఏసీ చైర్మన్ కాంతారావు చర్చలు విఫలమైనట్లు ప్రకటించారు. అనంతరం కేజీబీవీ టీచర్లు కూడా సమ్మెలోకి వచ్చారు. సమ్మె చేస్తున్నవారిని తొలగించాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ ఆదేశించడంతో కొందరు టీచర్లు భయపడి సమ్మె విరమించారు.



తమను పట్టించుకోకుంటే సీఎం కుర్చీ లాగేస్తామంటూ అనంతపురం కలెక్టరేట్ వద్ద తలపై కుర్చీలు పెట్టుకుని ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

మాతో పెట్టుకుంటే.. కుర్చీ లాగేస్తాం!

హెచ్చరించిన అంగన్వాడీలు

- నేడు అంగన్వాడీ సంఘాలతో మంత్రుల కమిటీ చర్చలు

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మమ్మల్ని పట్టించుకోకుంటే మీ కుర్చీ లాగేస్తామని సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు సీఎం జగన్మోహన్‌రెడ్డిని హెచ్చరించారు. ప్రభుత్వం మొండిగా ముందుకు వెళితే వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతామని చెప్పారు. వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, తదితర డిమాండ్లతో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 31వ రోజుకు చేరుకుంది. ఒకవైపు ఎస్మా ప్రయోగించినా, షోకాజ్ నోటీసులు ఇస్తున్నా అంగన్వాడీలు సమ్మెను యథావిధిగా కొనసాగిస్తున్నారు. పారిశుధ్య కార్మికులను చర్చలకు పిలిచిన ప్రభుత్వం తమను చర్చలకు పిలవకుండా కక్షసాధింపులకు పాల్పడుతోందని మండిపడ్డారు. కాగా, అంగన్వాడీల ఉద్యమం ఉధృతంగా కొనసాగుతుండడంతో జగన్ సర్కార్ మరోమారు అంగన్వాడీలతో చర్చలకు సిద్ధమయ్యింది. శుక్రవారం అమరావతి సచివాలయంలో అంగన్వాడీ సంఘాలతో మంత్రుల కమిటీ భేటీ కానుంది. ఈమేరకు గురువారం అంగన్వాడీ సంఘాల నేతలకు సమాచారం అందజేసింది. కాగా రాష్ట్రవ్యాప్తంగా గురువారం అంగన్వాడీల ఆందోళనలు కొనసాగాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడి వైనతేయ నదిలో జల దీక్ష చేశారు. విజయనగరం జిల్లాలో ఓవైపు అధికారుల నోటీసుల జారీ జోరుగా కొనసాగుతుండగా.. మరోవైపు అంగన్వాడీలు ఆందోళనలు చేస్తున్నారు. కలెక్టరేట్ వద్ద దీక్షలు చేస్తున్న కార్యకర్తలు గురువారం కూడా రాత్రి అక్కడే నిద్రకు ఉపక్రమించారు. పార్వతీపురం కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు నిరసన దీక్ష కొనసాగించారు. పాలకొండ సమ్మె శిబిరంలోనే నిద్రపోయారు. గరుగుబిల్లిలో ఒంటి కాలిపై నిలబడి, కొమరాడలో పురుగు మందు డబ్బాలతో, సీతానగరంలో చెంపలు వేసుకుని, బలిజిపేటలో చెరువులో దిగి నిరసన వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లావ్యాప్తంగా నోరు, కళ్లు, చెవులు మూసుకుని ప్రదర్శనలు నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద రోడ్డుపైకి వచ్చిన కుర్చీలు తలపై పెట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమతో పెట్టుకుంటే కుర్చీలు తిరగబడతాయని హెచ్చరించారు. మరోవైపు అంగన్వాడీలకు ఐసీడీఎస్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు షోకాజ్ నోటీసులు అందజేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం, ముదిగుబ్బ తహసీల్దారు కార్యాలయాల వద్ద అంగన్వాడీలు దీక్షలు కొనసాగించారు.తిరుపతి జిల్లా పిచ్చాటూరులో ఊయలకు సీఎం జగన్ ఫొటో అంటించి నిరసన తెలిపారు. కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. బద్వేలులో మెడలకు ఉరితాళ్లతో నిరసన తెలిపారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. బి.కొత్తకోటలో 31 ఆకారంలో కూర్చున్నారు. తంబళ్లపల్లెలో రిలే దీక్షలు చేపట్టారు. కోటకొండ, రెడ్డికోట అంగన్వాడీ కేంద్రాలను వైసీపీ నాయకుల ఒత్తిడితో తెరిచారు. యూనియన్ నాయకులు వాటిని మూయించారు. వాల్మీకీపురంలో అంగన్వాడీలు గడ్డి తింటూ, రాయచోటిలో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఎస్మా జీవో ప్రతులను దహనం చేశారు. లక్కిరెడ్డిపల్లెలో ఒంటికాలిపై నిలబడి ఆందోళన చేశారు. శ్రీకాకుళంలో 24 గంటల నిరాహార దీక్షలు చేశారు. కాగా, అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం సిగ్గు చేటన్నారు. అంగన్‌వాడీల ఉద్యమానికి మద్దతుగా ఉమ్మడి కార్యాచరణకు సన్నద్ధమవుతున్నామని సీపీఎం నాయకులు ఏలూరులో చెప్పారు. సంక్రాంతిలోపు సమస్యలు పరిష్కరించని పక్షంలో పండుగ తర్వాత రాష్ట్ర బంద్‌కు ఇప్పటి నుంచే సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

● టీడీపీ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జనవరి 11: అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని టీడీపీ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీల వద్దకు గురువారం టీడీపీ నేతలతో కలిసి వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. చాలీచాలని జీతాలతో అంగన్వాడీలు అవస్థలు పడుతున్నారని టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు న్యాయం చేస్తారన్నారు. టీడీపీ నేతలు జాస్తి వెంకటేశ్వరరావు, దొంతు చిన్న, ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి సాయి కల్యాణి, మేడేపల్లి రమా, మండవ రమ్యకృష్ణ, బుస్సే సరితాదేవి, వేములపల్లి శ్రీనివాసరావు, దండు సుబ్రమణ్యం రాజు, జనసేన నేత రవివర్మ పాల్గొన్నారు.




అంగన్వాడీలకు మద్దతుగా మాట్లాడుతున్న యార్లగడ్డ, ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వెంకట్రావు

రాజకీయ, సామాజిక సంస్కరణలకు ఆద్యుడు ఎన్టీఆర్

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్‌దేనని యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అంపాపురంలో మోతుకూరి చిట్టిబాబు తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఎన్టీఆర్ లాంటి గొప్పవ్యక్తి విగ్రహాన్ని చిట్టిబాబు తన స్వంత నిధులతో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సూరెడ్డి బెనర్జీ, గొడ్డపాటి నాగరాజు, సర్నాల బాలాజీ, ఆళ్ల హనోక్, చిరుమామిళ్ల సూర్యం, దయాల రాజేశ్వరరావు, మూల్పూరి సాయికల్యాణి, జాస్తి వెంకటేశ్వరరావు, గొడ్డళ్ల రామారావు, వేగిరెడ్డి పాపారావు, మేడేపల్లి రమ, పొదిలి లలిత, మొవ్వా వెంకటేశ్వరరావు, సరిత, కాటూరి విజయభాస్కర్, బేతాళ ప్రమీలారాణి, పరుచూరి నరేష్, మందాడి రవీంద్ర పాల్గొన్నారు.

ఒక్క చాన్స్‌తో రాష్ట్రం అంధకారం

ఉంగుటూరు: ఒక చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిందని వెంకట్రావు విమర్శించారు. జగన్ అస్తవ్యస్త పాలనలో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు తీ వ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు.



జంక్షన్ సెంటర్‌లో కొట్లాడుకుంటున్న జనసేన కార్యకర్తలు

జనసేన నేతల బాహాబాహీ

● స్థలం విషయంలో వివాదం ● జంక్షన్ సెంటర్‌లో ఉద్రిక్తత

హనుమాన్‌జంక్షన్, జనవరి 11: స్థలం సరిహద్దు వివాదం చెలరేగి జనసేన పార్టీకి చెందిన ఒకే సామాజిక వర్గంలోని ఇరువర్గాలు జంక్షన్ నాలుగు రోడ్ల కూడలిలో బాహాబాహీ తలపడి కర్రలతో దాడులకు పాల్పడడంతో గురువారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఎస్సై జనార్దన్ ఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టడంతో వివాదం సద్దుమణిగింది. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు సీఐ ఏఎస్ నరసింహారావు ఇరువర్గాలపై బైండోవర్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే గురువారం మధ్యాహ్నం స్థానిక ఇందిరానగర్ కాలనీలో ప్రైవేట్ వ్యక్తుల స్థలం సరిహద్దు వివాదంలో జనసేన సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, అదే పార్టీకి చెందిన మరో యువనేత గరికపాటి శివశంకర్ మధ్య వివాదం రేగింది. దీంతో వారిరువురూ సవాళ్లు విసురుకుని కొట్లాడుకోవడానికి నాలుగు రోడ్ల సెంటర్ వేదికగా సమయం కూడా నిర్ణయించుకుని తమ అనుచరులతో బాహాబాహీ తలపడ్డారు. దీంతో జంక్షన్ సెంటర్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎస్సై జనార్దన్ సంఘటన స్థలికి వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టి శాంతింపజేశారు. వైసీపీ నేతలు దుట్టా రామచంద్రరావు, చిన్నాల సత్యగణేష్, అదే సామాజికవర్గానికి చెందిన కొంత మంది నేతలు జోక్యం చేసుకొని శాంతింపజేశారు.

ఇరువర్గాలపై బైండోవర్ కేసులు

జంక్షన్ నాలుగు రోడ్ల కూడలిలో కొట్లాటకు దిగిన చలమలశెట్టి రమేష్ బాబు, గరికపాటి శివశంకర్ వారి అనుచరులపై సీఐ ఏఎస్ నరసింహమూర్తి బైండోవర్ కేసు నమోదు చేశారు. ఇరువర్గాలను జంక్షన్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ చేశారు.

స్వచ్ఛ పురస్కారాల్లో నగరానికి ఆరో ర్యాంక్

స్వచ్ఛసర్వేక్షణ్‌లో గతం కంటే వెనుకబాటు

చెత్త రహితనగరాల్లో 5 స్టార్ రేటింగ్

చిట్టినగర్, జనవరి 11: స్వచ్ఛసర్వేక్షణ్-2023 అవార్డుల్లో నగరానికి జాతీయ స్థాయిలో ఆరో ర్యాంక్ దక్కింది. గతంలో ఐదో ర్యాంక్ రాగా దానికంటే మెరుగైన ర్యాంక్ సాధించేందుకు ప్రయత్నించి ఆరో ర్యాంక్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని భారతమండపంలో గురువారం జరిగిన స్వచ్ఛ్‌సర్వేక్షణ్ అవార్డుల వేడుకల్లో కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి, సెక్రటరీ మనోజ్ జోషి, విషన్ డైరెక్టర్ రూపమిశ్రా చేతుల మీదుగా మంత్రి ఆదిమూలపు సురేష్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ అవార్డును అందుకున్నారు. చెత్తరహిత నగరాల్లో నగరానికి 5స్టార్ రేటింగ్ వచ్చింది. మంత్రి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని నగరాలకు జాతీయస్థాయిలో టాప్ టెన్‌లో 3 ర్యాంకులు వచ్చాయన్నారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి టాప్ టెన్‌లో మూడు ర్యాంకులు కైవసం చేసుకున్నాయన్నారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విజయవాడ నగరం ఇతర నగరాలకు రోల్ మోడల్‌గా నిలుస్తోందన్నారు. దానికవసరమైన కృషి వీఎంసీ చేస్తోందన్నారు. అవార్డు సాధనకు కారకులైన నగర పౌరులు, పారిశుధ్య కార్మికులు, అధికారులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అదనపు కమిషనర్ ప్రాజెక్ట్స్ కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పీ.రత్నావళి, చీఫ్ ఇంజనీర్ ఎం ప్రభాకరరావు పాల్గొన్నారు.



కేంద్రమంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న మంత్రి సురేష్, మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్

వీఎంసీలో ఆరు ప్రత్యేక కమిటీలు

చిట్టినగర్: వీఎంసీ సెక్రటరీసెల్ సెక్రటరీ వసంత లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం సెక్రటరీ సెల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఆరు ప్రత్యేక క మిటీలను ఏర్పాటు చేశారు. మంచినీటి సరఫరా భూగర్భనీటి పారుదల ప్రత్యేక కమిటీ చైర్మన్‌గా అ బ్దుల్ అకీబ్ అర్షద్, డిప్యూటీ చైర్మన్‌గా వియ్యపు అ మర్నాథ్‌ను నియమితులైయ్యారు. క్రీడలు, ట్రాఫిక్ ప్రత్యేక కమిటీ చైర్మన్ పుప్పాల నరసకుమారి, డి ప్యూటీ చైర్మన్‌గా ఉమ్మడి రమాదేవి, రోడ్డు డ్రెయిన్ లు, వంతెనలు భవనాల నిర్మాణం ప్రత్యేక కమిటీ చైర్మన్‌గా యార్లగడ్డ ఆంజనేయ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ కలపాల అంబ్కేదర్‌ను నియమించారు. లైటింగ్ నా ర్కుల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా అలంపురం విజయలక్ష్మి, డిప్యూటీ చైర్మన్ బుల్లా విజయ్ కుమార్, ప్ర జా ఫిర్యాదుల కమిటీ చైర్మన్‌గా కొండాయగుంట మల్లేశ్వరి, డిప్యూటీ చైర్మన్ చాగంటి కోటిరెడ్డి, మురికివాడల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఉద్దంటి సునీత, డిప్యూటీ చైర్మన్ గుడివాడ రాఘవను నియమించారు.

పెళ్లి చేసుకోనన్నాడని యువతి ఆత్మహత్య

కంకిపాడు: ప్రేమించానన్నాడు.. చట్టాపట్టాలు వేసుకొని తిరిగారు.. తీరా పెళ్లి చేసుకోమంటే నిరాకరించి మరో యువతిని వివాహం చేసుకున్నాడన్న మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిం ది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం కంకిపాడు కు చెందిన యువతి షేక్ షాహీన (20) ప్రధాన సెంటర్‌లో ఓ కొరియర్ షాపులో పనిచేస్తోంది. ఎదురుగా ప్లాస్టిక్ గ్లాసులు, ఇస్తరాకులు తయారుచేసే దుకాణంలో చోడవరపు రాజు అనే యువకుడు పని చేస్తున్నాడు. కొంతకాలంగా ప్రేమించుకున్నారు. యువతి పెళ్లి చేసుకోమని కోరగా రాజు నిరాకరించి రెండురోజుల క్రితం మరో అమ్మాయిని వివాహం చే సుకున్నాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించి ఈనెల 9న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పా ల్పడింది. చికిత్స పొందుతూ గురువారం ఉదయం యువతి మృతి చెందింది. రాజుపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు ఎస్సై కె.సుధాకర్ చెప్పారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ ప్రధాన కార్యదర్శిగా సినీ నటి సరస్వతి

విద్యాధరపురం: జాతీయ బీసీసంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సినీ నటి కూన సరస్వతి (శ్రీరితిక) నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని సరస్వతి తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

అజయ్‌కుమార్‌రెడ్డికి శాప్ ఎండీ అభినందనలు

కృష్ణలంక: రాష్ట్రానికి చెందిన భారత జాతీయ అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ ఐ.అజయ్‌కుమార్ రెడ్డి కి అంధుల క్రికెట్ క్రీడలో సాధించిన విజయాలకి గాను భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే క్రీడా పురస్కారమైన అర్జున అవార్డుతో సత్కరించిం ది. ఈ సందర్భంగా శాప్ వైస్ చైర్మన్, ఎండీ ధ్యానచంద్ర, అజయ్‌కుమార్‌రెడ్డిని ఆయన సాధించిన విజయాలకు గాను శాప్ కార్యాలయంలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని, దేశానికి, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు.

కేఆర్‌యూకు హ్యాట్రిక్ విజయం

విజయవాడ స్పోర్ట్సు: చెన్నైలోని హిందూస్థాన్ వ ర్శిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్శి టీ క్రికెట్ టోర్నీలో కృష్ణా వర్శిటీ పురుషుల జట్టు హ్యా ట్రిక్ విజయంతో ముందంజ వేసింది. గురువారం మ్యా చ్‌లో కేఆర్‌యూ 20 ఓవర్ల మ్యాచ్‌లో అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ వర్శిటీపై 56 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వరుసగా మూడో మ్యాచ్‌లోను తొలుత బ్యాట్‌పట్టిన కేఆర్‌యూ 20 ఓవర్లలో 187/4 పరుగులను చేసింది. 188 పరుగుల ల క్ష్యంతో బరిలోని నెహ్రూ వర్శిటీ జట్టు 20 ఓవర్లలో 129/9 పరుగులను చేసి పరాజయం పాలైంది.

అక్రమ నిర్మాణాన్ని నిలిపేయండి

● పోలీసులకు గ్రామస్థుల ఫిర్యాదు

ఉంగుటూరు, జనవరి 11: వాగు పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి, ప్రహరీగోడ నిర్మాణం చేపట్టిన ఆక్రమణదారుడిపై గ్రామస్థులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. మండల పరిధి పొట్టిపాడులో నివాసముంటున్న చెరుకుపల్లి లక్ష్మి, శ్రీనివాసరావు దంపతులు 2017లో ఆర్ఎస్‌నెం. 362/2లో 97 చదరపు గజాల స్థలాన్ని గ్రామానికి చెందిన కలిదిండి శాంతకుమారి, నాగమునేశ్వరరావు దంపతుల నుంచి కొనుగోలు చేశారు. ఆ స్థలానికి ఆనుకుని ఉన్న వాగు పోరంబోకులో సుమారు 67 చదరపు గజాల స్థలాన్ని ఆక్రమించి, 2022లో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రయత్నించారు. పంచాయతీ అధికారులు నోటీసులివ్వడంతో శ్రీనివాసరావు దంపతులు సివిల్‌కోర్టులో దావా వేశారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా గురువారం మళ్లీ ప్రహరీగోడ నిర్మాణం చేపట్టడంతో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, సర్పంచ్ కత్తుల జ్యోతి, మాజీ సర్పంచ్ గుడ్డేటి సుధాకర్, గ్రామస్థులతో కలిసి ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.వార్డుమెంబర్లు షేక్ వలీ, కడియాల బాబు, బొబ్బిలి నవీన్‌కుమార్, బక్కా ఇమ్మానియేల్ పాల్గొన్నారు.



పొట్టిపాడులో వాగు పక్కనే ఆక్రమణదారుడు చేపడుతున్న ప్రహరీ నిర్మాణం

'పల్లెకుపోదాం' బహిష్కరణ

ఆక్రమణకు గురౌతున్న వాగు సమస్యకు పూర్తి పరిష్కారం చూపేంతవరకు గ్రామంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకాబోమని సర్పంచ్ కత్తుల జ్యోతి, ఎంపీపీ వడ్లమూడి సరోజిని, మాజీ సర్పంచ్ గుడ్డేటి సుధాకర్, వార్డుమెంబర్లు అధికారులకు తెగేసి చెప్పారు. ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు అధ్వర్యంలో గురువారం పొట్టిపాడు గ్రామ సచివాలయంలో సర్పంచ్ అధ్యక్షతన జరగాల్సిన 'పల్లెకుపోదాం' ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు బాయ్‌కాట్ చేశారు.

చిరువ్యాపారులకు 'జగనన్న తోడు'

జేసీ డాక్టర్ పి.సంపత్‌కుమార్

కృష్ణలంక, జనవరి 11: చిరువ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు పథకాన్ని అమలు చేస్తోందని, జిల్లాలో 8వ విడతలో 16,967 మంది లబ్ధిదారులకు రూ.17.95 కోట్ల రుణాలను మంజూరు చేయడం జరిగిందని, అలాగే సకాలంలో రుణాలు చెల్లించిన 18,397 మందికి రూ. 51.29 లక్షల వడ్డీ రీఎంబర్స్ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసినట్టు జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. జగనన్న తోడు పథకం ద్వారా గురువారం సీఎం జగన్మోహనరెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి లబ్ధిదారుల ఖాతాలకు బటన్ నొక్కి. రూ.10వేలు, అంతకుపైగా రుణాలతోపాటు వడ్డీ రీ ఎంబర్స్ మొత్తాన్ని జమచేశారు. కలెక్టరేట్ నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులతో కలిసి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించిన అనంతరం జిల్లాకు చెందిన లబ్ధిదారులకు ఆర్థిక సహాయ మెగా చెక్‌ను ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషుతో కలిసి జేసీ అందజేశారు. భట్రాజ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలీ దేవి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, ఎల్‌డీఎం కె.ప్రియాంక పాల్గొన్నారు.



వెబ్‌సైట్ పోర్టల్‌ను ప్రారంభిస్తున్న జేసీ

ఉపాధి అవకాశాలు పెంచేందుకు వెబ్‌సైట్

రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసిందని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఆన్‌లైన్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ వెబ్సైట్ పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగ యువత ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక సంస్థల్లో ఉపాధి అవకాశాలను తెలుసుకొని దరఖాస్తు చేసుకొనేలా వెబ్‌సైట్‌ను రూపొందించారన్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి డీ విక్టర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వినూత్న ఆలోచనతో నూతన వెబ్‌సైట్ పోర్టల్‌కు శ్రీకారం చుట్టిందన్నారు. ఉపాధి అధికారి వైసత్యబ్రహ్మం (ఒకేషనల్ గైడెన్స్), యంగ్ ప్రొఫెషన్ ఎస్.జయరాజు పాల్గొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్స్ సమస్యలపై ప్రభుత్వంతో చర్చలు

● బొప్పరాజు, మంజునాథ

కృష్ణలంక, జనవరి 11: గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో పనిచేసే ఎనర్జీ అసిస్టెంట్స్ వివిధ సమస్యలతో సతమతమవుతున్న సమయంలో ఎనర్జీ అసిస్టెంట్స్ అందరూ ఉద్యమానికి సిద్ధమైన తరుణంలో సీఎండీ విజయానంద్ వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకొని గురువారం సంఘ నేతలతో నగరంలోని విద్యుత్‌సౌధలో సమావేశం ఏర్పాటు చేశారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీటీయాసీ జనరల్ సెక్రటరీ ఓబులేష్, గ్రామ సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అర్లయ్య, ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీవీ మంజునాథ్, కోశాధికారి పి.సుధీర్ పాల్గొన్నారు. ఎనర్జీ అసిస్టెంట్ల తదితర ముఖ్యమైన సమస్యలు పరిష్కరించాలని సీఎండీ విజయానంద్‌ను వివిధ స్థాయిల్లోని అధికారుల సమక్షంలో కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్టు బొప్పరాజు తెలిపారు. ఏపీ వీఆర్‌వో సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ సాంబశివరావు, ఏపీ వీఆర్‌ఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీసత్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం ప్రపంచంలోనే అద్భుత కళాఖండం

● రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్

కృష్ణలంక, జనవరి 11: ప్రపంచంలోనే అద్భుతమైన కళాఖండంగా అంబేడ్కర్ స్మృతివనాన్ని తీర్చిదిద్దారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. స్థానిక స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన స్మృతివనం పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నగరం నడిబొడ్డున 205 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించడం చరిత్రాత్మకమన్నారు.

19న సీఎంతో ప్రారంభోత్సవం: శ్రీలక్ష్మి

ఈనెల 19న అంబేడ్కర్ స్మృతివనం, అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని సీఎం జగన్మోహనరెడ్డి ప్రారంభించనున్నట్టు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వైశ్రీలక్ష్మి తెలిపారు. స్మృతివనం పనులను గురువారం అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలో అతి ఎత్తైన అంబేద్కర్ విగ్రహం ఇదేనన్నారు. స్మృతివనానికి వన్నె తేవడానికి రాజస్థాన్ పింక్ ఇసుకరాయితో తాపడం చేయడం జరిగిందని, రికార్డు సమయంలో పనులు పూర్తిచేసినట్టు ఆమె పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి

విద్యారంగంలో కాషాయీకరణ

● ఏపీ టీచర్స్ ఫెడరేషన్ విద్యాసదస్సులో వక్తలు

మొగల్రాజపురం, జనవరి 11: విద్యారంగం కాషాయికరణ వేగంగా జరుగుతోందని దీనివల్ల లౌకిక, ప్రజాస్వామ్య విలువలు కనుమరుగవుతాయని ఏపీటీచర్స్ ఫెడరేషన్ గురువారం ఏర్పాటు చేసిన విద్యాసదస్సులో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఏపీటీఎఫ్ పూర్వ కార్యదర్శి ఎస్.పరమేశ్వరరావు రెండో వర్ధంతి సందర్భంగా పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో విద్యా సదస్సు నిర్వహించారు. మాజీ మంత్రి, రైతు పరిరక్షణ కమిటీ కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న పరిపాలన నిర్బంధకాండను తలపిస్తోందన్నారు. ఉపాధ్యాయ ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ పి.రఘు వర్మ మాట్లాడుతూ విద్యారంగంలో ప్రభుత్వాలు తీసుకొస్తున్న మార్పులు లౌకికతత్వానికి విరుద్ధంగా ఉన్నాయన్నారు. సెంట్రల్ వర్శిటీ టీచర్స్ అసోసియేషన్ ప్రొఫెసర్ ఆనందకుమార్, గాంధీ ట్రస్టు ఫౌండర్, చైర్మన్ ఢిల్లీ కె .విజయరావు, ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఏ నరసింహారెడ్డి, పి.పాండురంగ ప్రసాద్, మానవ వికాసవేదిక నిర్వాహకులు బి.సాంబశివరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడు షేక్ జిలానీ, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సరస్వతి, ఉపాధ్యక్షులు శ్యాంసుందర్ రెడ్డి, కె. అశోక్‌కుమార్, టి.త్రినాథ్, కె.నాగసోమేశ్వరమ్మ, ఎస్.సుబ్రహ్మణ్యం, కార్యదర్శులు సాల్మన్‌రాజు, రఘుబాబు, చాంద్‌బాషా, ఇతర జిల్లాల నుంచి వచ్చిన నేతలు పాల్గొన్నారు.

పాయకాపురంలో వ్యక్తి హల్‌చల్.. ఇంటికి నిప్పు పెట్టి మహిళలపై దాడి

పాయకాపురం, జనవరి 11: పాయకాపురం ప్రాంతంలో గురువారం రాత్రి ఓ వ్యక్తి ఇంటికి నిప్పుపెట్టి హల్‌చల్ చేశాడు. అదేమని ప్రశ్నించిన ఇద్దరు మహిళలపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. దాసి వెంకట నాగ పోతురాజు (58) స్థానిక ఏపీఎస్ రెడ్డి రోడ్డులోని ఓ ఇంట్లో అద్దెకుంటున్నాడు. ప్రభుత్వ టీచరైన పోతురాజు ఇటీవల వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాడు. గురువారం రాత్రి పోతురాజు పోర్షన్ నుంచి మంటలు వస్తుండటంతో ఇద్దరు మహిళలు చూసేందుకు వెళ్తున్నారు. పోతురాజు కిందికి దిగుతూ మహిళలకు ఎదురు వచ్చాడు. నా తల్లి మీ వల్లే చనిపోయిందంటూ కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో సింహాచలం (41), సునీత (30) అనే ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. పోలీసు, ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పోలీసులు పోతురాజును అదుపులోకి తీసుకుని, గాయపడిన మహిళలను ఆసుపత్రికి తరలించారు. పోతురాజుకు వివాహం కాలేదని వృద్ధురాలైన తల్లి ఇటీవల మరణించడాన్ని జీర్ణించుకోలేక మానసికంగా బాధపడుతున్నాడని తేలింది. దానికి కారణం ఆ భవనంలోని వారేనని ఈ అఘయిత్యానికి పాల్పడి ఉంటాడని తెలుస్తుంది.

ప్లానింగ్ అసిస్టెంట్‌పై వైసీపీ మహిళా నేత దాడి

చిట్టినగర్, జనవరి 11: అధికార పార్టీ నేతల ధనదాహానికి అంతులేకుండా పోతోంది. డివిజన్‌లో ఏం జరిగినా తమకు తెలిసి తీరాలంటున్నారు. పదవుల్లో ఉన్నవారే కాకుండా ఎలాంటి పదవి లేనివారూ ఇలాగే వ్యవహరిస్తున్నారు. ఇళ్ల యజమానులను బెదిరిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులపై దాడులకు తెగబడుతున్నారు. తాజాగా 50వ డివిజన్ గొల్లపాలెంగట్టు కొండ ప్రాంతంలో వైసీపీ కార్పొరేటర్‌గా పోటీచేసి ఓడిపోయిన తల్లికూతుళ్లు ఇక్కడ హల్‌చల్ చేస్తున్నారు. సీపీఎం అభ్యర్థి బోయి సత్తిబాబు ఇక్కడ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. వైసీపీ అధికారంలో ఉండడంతో తల్లీకూతుళ్ల ఆగడాలకు అడ్డులేకుండా పోతోంది. బాబాయ్ రౌడీషీటర్ అండగా ఉండడంతో రెచ్చిపోతున్నారు. డివిజన్‌లో ఓ వ్యక్తి 23 గజాల స్థలంలో శ్లాబ్ వేసుకున్నాడు. ఈ విషయం ఆలస్యంగా వారికి తెలిసింది. దీంతో కూతురు వచ్చి సచివాలయ ప్లానింగ్ అసిస్టెంట్‌ను ఇష్టానుసారం దూషించడమే కాక చేయి చేసుకుంది. అంతు చూస్తానంటూ కాలు తన్నింది. గురువారం జరిగిన ఈ ఘటనను ధ్రువీకరించడానికి అధికారులు భయపడి ముఖం చాటేస్తున్నారు. వీరికి ఎమ్మెల్యే వెల్లంపల్లి అండదండలుండడంతో రెచ్చిపోతున్నారు.



ఎంపికైన పవన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమేష్, చినబాబు

క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్‌కు సిద్ధార్థ విద్యార్థి పవన్

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 11: బీహార్‌లో ఈ నెల 15 నుంచి జ ర గనున్న 58వ జాతీయ క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే ఏపీ జ ట్టుకు మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాలలో బీకామ్ ఫస్టియర్ చదువుతున్న బి.పవన్ ఎంపికయ్యాడు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్, ఫిజికల్ డైరెక్టర్ ఎ.చినబాబు పవన్‌ను అభినందిస్తూ స్వర్ణపతకంతో రావాలని ఆకాంక్షించారు.

బ్యాడ్మింటన్‌లో రష్మితకు కాంస్యం



చెన్నైలోని ఎస్ఆర్ఎం వర్శిటీ ఆధ్వర్యంలో జరిగిన ప్రతిష్టాత్మకమైన ఆలిండియా వర్శిటీ బ్యాడ్మింటన్ ఉమెన్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన షట్లర్ దోనేపూడి రష్మిత కాంస్యంతో సత్తా చాటింది. ఈ నెల 7 నుంచి 10 వరకు జరిగిన టోర్నీలో రాజస్థాన్ జేజే వర్శిటీతో జరిగిన సె మీస్‌లో 1-2తో పోరాడి ఓడి కాంస్యం దక్కించుకుంది. రష్మితను కేడీబీఏ అధ్యక్షుడు పోలినేని అంకమ్మ చౌదరి, జనరల్ సెక్రటరీ పరసా శ్రీనివాసరావు అభినందించారు.



విజేతలతో టోర్నీ డైరెక్టర్ సూదగాని రామకృష్ణ

ముగిసిన సీనియర్స్ ఐటీఎఫ్ టెన్నిస్ టోర్నీ

నగరంలోని ఐజీఎంసీ టెన్నిస్ కాంప్లెక్సులో ఆరు రోజులుగా జరుగుతున్న సీనియర్స్ ఐటీఎఫ్-200 (ఎస్‌వీ.రామయ్య మెమోరియల్) టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం ఘనంగా ముగిశాయి. 55 ప్లస్ పురుషుల డబుల్స్‌లో రామసుబ్రహ్మణ్యన్, బాలకృష్ణన్ జోడి మధుకర్ కుమార్ కాంతి మహంతు రూప్, లింగంనేని ఉదయేశ్వరరావుపై 3-6,6-1,(10-3)తో గెలిచి టైటిల్‌ను వశం చేసుకున్నారు. 75 ప్లస్ పురుషుల డబుల్స్‌లో వెంకటాచలం మణివిక్రమ్ స్వామినాథన్, సూదగాని రామకృష్ణ జోడి సీబీఎస్ వరప్రసాద్, బాలకృష్ణన్ దక్షిణామూర్తిపై 6-0, 6-3తో విజయం సాధించి టైటిల్‌ను వశం చేసుకున్నారు.



సెమీస్‌కు చేరిన ఏపీ హ్యాండ్‌బాల్ టీమ్

హ్యాండ్‌బాల్ సెమీస్‌కు ఏపీ

విజయవాడస్పోర్ట్సు, జనవరి 11: రాజస్థాన్‌లో ఈ నెల 9 నుంచి జరుగుతున్న జాతీయ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్‌షి ప్‌లో ఏపీ జట్టు వరుస విజయాలు అందుకుంటోంది. గురువారం జరిగి న హోరాహోరీ మ్యాచ్‌లో ఒక పాయింట్‌తో విజయం సాధించి సెమీస్‌లోకి ప్రవేశించింది. తొలుత ఏపీ హ్యాండ్‌బాల్ టీమ్ 9న ఒడిశాపై 22-13 తో విజయం సాధించగా, 10న ఢిల్లీ చేతిలో పోరాడి 26-32తో పరాజ యం పాలైంది. తర్వాత 11న ప్రీక్వార్టర్స్‌లో జార్కండ్‌పై 30-18తోను, క్వా ర్టర్ ఫైనల్స్‌లో గురువారం చండీఘర్‌పై హోరీహోరీగా పోరాడి 39-38తో విజయం సాధించి సెమీస్‌కు చేరింది. టైటిల్ రేసులో నిలబడేందుకు శుక్రవారం హర్యానాతో ఏపీ తలపడనుంది. నగరంలో గతేడాది నిర్వహించిన ఇదే టోర్నీలో ఏపీ జట్టు టైటిల్‌తో సత్తాచాటిందని, ఈ సారి కూడా టైటిల్ ఆశిస్తున్నట్టు ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పెనుమత్స సత్యనారాయణరాజు తెలిపారు.

న్యాయస్థానం ఆదేశిస్తేనే నీరు-చెట్టు బిల్లులు!

» కోర్టు ధిక్కార వ్యాజ్యాలకు సిద్ధమైన రైతులు

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో 665 మండలాల్లో చేపట్టిన నీరు-చెట్టు కార్యక్రమంలో పనులు జరిగాయంటూ నిఘా సంస్థ నివేదికలు ఇస్తున్నా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రం అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. జల వనరుల శాఖ అంతర్గత నిఘా విభాగంతో సహా రాష్ట్ర విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కూడా 2015 నుంచి 2019 దాకా చేపట్టిన నీరు-చెట్టు కార్యక్రమంలో పనులు జరిగాయని నివేదికలు ఇచ్చాయి. మొత్తంగా రూ.18,265 కోట్ల మేర నీరు చెట్టు పథకం కింద పనులు చేపట్టారు. ఈ పనులకు రూ.1,277 కోట్లు చెల్లించేందుకు ఆర్థిక శాఖ అనుమతులు ఇచ్చింది. వాటిని 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం నిలిపివేసింది. ఈ పనులపై పంచాయతీరాజ్ శాఖతో విచారణ జరిపించింది. ప్రస్తుత డీజీపీ రాజేంద్రనాథరెడ్డి విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో దర్యాప్తు కూడా చేయించింది. పనులు జరిగాయని, కొన్నిచోట్ల ఇంజనీరింగ్ అధికారుల తప్పులున్నాయంటూ విజిలెన్స్ డైరెక్టరేట్ నివేదిక ఇచ్చింది. నివేదికలు క్లియర్‌గా ఉన్నా ప్రభుత్వం మాత్రం బిల్లులు చెల్లించడంలేదు. దీంతో 8,070 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. అయినా ప్రభుత్వం చలించలేదు. రైతులు కోర్టు ధిక్కార పిటిషన్లు వేయడంతో 2022 మార్చి నుంచి 2023 డిసెంబరు దాకా రూ.1076 కోట్లు రైతుల ఖాతాల్లో వేసింది. మరో రూ.272 కోట్ల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ బిల్లుల కోసం రైతులు మళ్లీ ధిక్కార పిటిషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు.

జగన్ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలి: ఆలపాటి

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జగన్ నిజంగా మనిషైతే, ఆయనకు సిగ్గూ శరం ఉంటే అవినీతి కేసుల్లో తన నిర్దోషితత్వాన్ని నిరూపించుకోవాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సవాల్ విసిరారు. గురువారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఏ నాయకుడిపైనా లేనన్ని పెద్ద కేసులు తనపై ఉన్నా.. కోర్టుల విచారణకు హాజరు కాకుండా జగన్ కుంటిసాకులు చెబుతున్నారని విమర్శించారు.

అరాచకవాది పక్కన అవకాశవాది: నెట్టెం

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అహంకారంతో చంద్రబాబు, లోకేశ్‌లపై నిందలేసి, అమరావతిని హేళన చేసిన కేశినేని నానికి కాలమే సమాధానం చెప్తుందని మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ అన్నారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'నాని రెండోసారి ఎంపీగా గెలిచాక తానే విజయవాడకు అధిష్ఠానం అన్న విధంగా వ్యవహరించారు. తన స్వార్థం కోసం నేడు అరాచకవాది జగన్ పక్కన అవకాశవాది నాని చేరారు' అని నెట్టెం అన్నారు.

దళితులంటే నానికి ఎందుకు చులకన?: దేవదత్

ఎంపీ కేశినేని నాని ముందస్తు ప్రణాళికలతోనే టీడీపీని వీడారని తిరువూరు టీడీపీ ఇన్‌చార్జ్ శావల దేవదత్ ఆరోపించారు. 'తిరువూరులో జరిగిన రా... కదలిరా బహిరంగ సభను అప్రతిష్ఠ పాల్జేసి తెలుగుదేశానికి, చంద్రబాబుకి చెడ్డపేరు తీసుకురావాలన్న దురుద్దేశంతోనే కేశినేని వ్యవహరించారు. సభా నిర్వహణ కోసం టీడీపీ ముందస్తుగా నిర్ణయించిన సన్నాహక సమావేశంలో తన అనుచరులతో వీరంగం సృష్టించారు. దళితుడినైన నన్ను కనీస గౌరవం లేకుండా ఏకవచనంతో మాట్లాడటం నిజం కాదా? దళితులంటే నానికి అంత చులకన ఎందుకు' అని నిలదీశారు.

స్థానిక నిధులు మరో 600 కోట్లు లాగేశారు

» వెంటనే పంచాయతీలకు నిధులు జమ చేయాలి: వైవీబీ

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రానికి పంపిన 15వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ.600 కోట్లు సర్కార్ లాగేసుకుంది. వెంటనే ఆ నిధులను స్థానిక సంస్థలకు జమ చేయాలి' అని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం రూ.988 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి పంపితే, రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను పంచాయతీలకు జమచేయకుండా రూ.393 కోట్లు మాత్రమే ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. లాక్కొన్న రూ.600 కోట్లను వెంటనే స్థానిక సంస్థలకు జమ చేయకపోతే రాజకీయాలకు అతీతంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో కలిసి తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించి తడఖా చూపిస్తామని హెచ్చరించారు.

టీడీపీ కార్యాలయంలో వడ్డె ఓబన్న జయంతి వేడుకలు

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వడ్డెరల ఆరాధ్య దైవం వడ్డె ఓబన్న జయంతి కార్యక్రమాన్ని టీడీపీ జాతీయ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, శాసన మండలి సభ్యులు దువ్వారపు రామారావు ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులర్పించారు. బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకటగురుమూర్తి, వడ్డెర సాధికార సమితి కన్వీనర్ వడ్డె వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వ్యూహం సినిమా వివాదంపై 22న తీర్పు

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వ్యూహం సినిమాకు సెన్సార్‌బోర్డు జారీచేసిన సర్టిఫికెట్‌ను కొట్టేయాలని కోరుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. ఈ నెల 22న తీర్పు వెలువరిస్తామని జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం గురువారం పేర్కొంది.

యూట్యూబ్ ఇండియాకు సమన్లు

» జారీ చేసిన జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ

» తల్లులు-కుమారులపై అసభ్య వీడియోల పోస్టింగ్‌తోనే!

న్యూఢిల్లీ, జనవరి 11: తల్లులు-కుమారులపై కొన్ని చానెళ్లు అసభ్య వీడియోలు పోస్టింగ్ చేస్తున్న నేపథ్యంలో.. ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ మాధ్యమం యూట్యూబ్ ఇండియా హెడ్ (ప్రభుత్వ వ్యవహారాలు- ప్రజా విధానాలు) మీరా ఛట్‌కు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ (ఎన్‌సీపీసీఆర్) సమన్లు జారీ చేసింది. ఛట్ ఈ నెల 15న తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించింది. సమన్లపై స్పందించకుంటే అరెస్టు తప్పదని హెచ్చరించింది. అసభ్య వీడియోల పోస్టింగ్.. పోక్సో చట్టం ఉల్లంఘనే అని, అశ్లీల వీడియోలు మైనర్లూ చూసేలా ఉండడం పిల్లల భద్రతకు తీవ్ర హానికరమని ఎన్‌సీపీసీఆర్ చీఫ్ ప్రియాంక్ కానుంగో ఆందోళన వ్యక్తం చేశారు. అశ్లీల కంటెంట్ తొలగింపుపై చేపట్టిన చర్యలు వెల్లడించాలని.. సంబంధిత వీడియోల జాబితాతో రావాలని నిర్దేశించారు. మరోవైపు తల్లీ-కొడుకుకు సంబంధించిన అసభ్య వీడియోను అప్‌లోడ్ చేసినందుకు యూట్యూబ్ ఇండియా ప్రతినిధులపై ముంబై సైబర్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది.

సీఐడీ విచారణకు ఎన్ఆర్ఐ యశ్


సీఐడీ విచారణకు హాజరైన ఎన్ఆర్ఐ యశ్

తిరుపతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఘటనలో నోటీసులు అందుకున్న ఎన్ఆర్ఐ యశ్ బొద్దులూరి విచారణ నిమిత్తం గురువారం తిరుపతిలోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లిని పరామర్శించేందుకు వచ్చిన ఆయన్ని గతనెలలో శంషాబాద్ విమానాశ్రయంలో సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకుని గుంటూరు సీఐడీ కార్యాలయానికి తరలించిన విషయం తెలిసిందే. అనంతరం ఈనెల 11న తిరుపతికి కార్యాలయానికి విచారణకు రావాలని 41ఏ సీఆర్పీసీ కింద యశ్‌కు సీఐడీ నోటీసులు జారీచేసింది.

తనిఖీలతో టోల్‌గేట్ల వద్ద రద్దీ

» హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు కార్ల బారులు

కంచికచర్ల, జనవరి 11: సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చే వారితో హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై గురువారం వాహనాల రద్దీ ఏర్పడింది. హైదరాబాద్‌తో పాటు ఇతర తెలంగాణ జిల్లాల్లో స్థిరపడిన వారందరూ సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులతో జరుపుకునేందుకు స్వగ్రామాలకు తరలివస్తున్నారు. విద్యా సంస్థలకు సెలవులివ్వటంతో భార్యాపిల్లలతో కలిసి సొంత కార్లలో వస్తున్నారు. హైదరాబాద్-విజయవాడ రూటులో జిల్లాలో చిల్లకల్లు, కీసర వద్ద టోల్‌గేట్లు ఉన్నాయి. తెలంగాణాలో మరో రెండు టోల్‌గేట్లు ఉన్నాయి. ఫాస్టాగ్ సదుపాయం ఉండటంతో కొద్ది నిమిషాల్లోనే వాహనాలు వాటి నుంచి బయటకు వెళ్లిపోతున్నాయి. అయితే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండు రోజుల నుంచి రాష్ట్ర సరిహద్దు గరికపాడు వద్ద, కీసర టోల్‌గేట్ వద్ద పోలీసులు కార్లను, ఇతర వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఒకవైపు రద్దీ, మరోవైపు తనిఖీ వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని వాహనదారులు అంటున్నారు. శుక్ర, శనివారాల్లో వాహనాల రద్దీ ఇంకా ఎక్కువగా ఉంటుందని టోల్‌గేట్ల నిర్వాహకులు చెబుతున్నారు.



» స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయస్థాయి నాలుగో ర్యాంకు

» టాప్ టెన్‌లో విజయవాడ, తిరుపతి కూడా..

న్యూఢిల్లీ, విశాఖపట్నం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్-2023 పోటీలో విశాఖపట్నం జాతీయ స్థాయిలో నాలుగో ర్యాంకు దక్కింది. గురువారం ఢిల్లీలో కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హరదీప్‌సింగ్‌పురీ ఈ అవార్డులను ప్రకటించారు. లక్షకుపైగా జనాభా కలిగిన నగరాల కేటగిరీలో 4,477 నగరాలు పోటీ పడగా 9,500 మార్కులకు గాను 9348.39 సాధించి ఇండోర్, సూరత్‌కు ఉమ్మడిగా మొదటి ర్యాంకు సాధించాయి. 9,240.3 మార్కులతో ముంబై మూడు, 8879.23 మార్కులతో విశాఖపట్నం నాలుగో స్థానంలో నిలిచాయి. ఏపీలో విజయవాడకు ఆరు, తిరుపతికి ఎనిమిదో ర్యాంకు దక్కాయి. తెలంగాణ నుంచి హైదరాబాద్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) తరఫున రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్, జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి అవార్డులను స్వీకరించారు. కాగా, స్వచ్ఛ సర్వేక్షణ్-2022లో నాలుగో ర్యాంకు సాధించిన విశాఖ నగరం...ఈ ఏడాది కూడా ఆ స్థానాన్ని నిలబెట్టుకుంది. కాగా, స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో ఏపీలోని మూడు నగరాలు టాప్ టెన్‌లో నిలిచాయి. క్లీన్ సిటీ కేటగిరిలో అఖిలభారత స్థాయిలో విశాఖపట్నం(4), విజయవాడ(6), తిరుపతి(8) ర్యాంకులు సాధించాయి. అలాగే, "ఫాస్ట్ మూవింగ్ సిటీ" విభాగంలో 5 స్టార్ రేటింగ్స్‌తో గుంటూరు 2వ ర్యాంక్ పొందింది. క్లీన్ సిటీ కేటగిరిలో జాతీయ స్థాయిలో 8వ ర్యాంకు పొందిన తిరుపతి పది లక్షల జనాభా కలిగిన పట్టణాల్లో రెండవ ర్యాంకులో నిలిచింది. విజయవాడ జాతీయ స్థాయిలో ఆరవ ర్యాంకు సాధించింది. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి సురేశ్ మాట్లాడుతూ ఏపీలోని నగరాలకు టాప్ టెన్‌లో మూడు ర్యాంకులు వచ్చాయని చెప్పారు.

ఆ కాంట్రాక్టర్‌పై ఎంత ప్రేమో!

» ఎప్పటి బిల్లులు అప్పుడే చెల్లింపు

» కాంట్రాక్టర్లకే కాకుండా వైసీపీ నేతలకూ చుక్కలు చూపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

» కానీ, ఆయనకు జాప్యం లేకుండా అప్‌లోడ్

» తేడా జరిగితే ఉన్నతాధికారులు లైన్‌లోకి..

» కేంద్ర దర్యాప్తు సంస్థలో అధికారిగా కాంట్రాక్టర్ బంధువు?

» ముఖ్యనేతకు అవసరం కాబట్టే పెద్దపీట

(నెల్లూరు - ఆంధ్రజ్యోతి)

చేసిన పనులకు బిల్లులు తెచ్చుకోవడమంటే ఒక పెద్ద విజయమే సాధించినట్లుగా తయారయ్యాయి రాష్ట్రంలో పరిస్థితులు. సాధారణ కాంట్రాక్టర్లకే కాకుండా వైసీపీ నేతలకు కూడా చుక్కలు కనిపిస్తున్నాయి. ఆఖరుకు ఎంపీ, ఎమ్మెల్యే వంటి ప్రజాప్రతినిధులు కూడా తాము చేసిన పనులకు బిల్లులు విడుదల చేయించుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల దుస్థితే దీనికి నిదర్శనం. అయితే ఒక కాంట్రాక్టర్‌కు మాత్రం ఇటు బిల్లు అప్‌లోడ్ చేయడం.. అటు విడుదల చేయడం జరిగిపోతోంది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో సుమారు రూ.300 కోట్ల వర్కులు చేస్తున్న ఈ కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్న బిల్లులను చూసి.... మిగిలిన కాంట్రాక్టర్లు, అధికారులు ఆశ్చర్యపోతున్నారు. ఈయన కన్నా ముందు చేసిన వర్కులకు మాత్రం రూపాయి కూడా బిల్లు విడుదల కాలేదు. ఆఖరుకు సోమశిల ఆప్రాన్ పనులు అత్యవసరంగా చేపట్టాలని హైపవర్ కమిటీ సూచించినా, ఆ పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదు. రాష్ట్రంలో ఉన్న పెద్ద కాంట్రాక్టర్లకు కూడా సాధ్యం కాని పని హైదరాబాద్‌కు చెందిన ఆ కాంట్రాక్టర్‌కు ఎలా సాధ్యమవుతోందని మిగిలిన కాంట్రాక్టర్లు ఆరా తీయగా అసలు గుట్టు బయటపడింది. సదరు కాంట్రాక్టర్ బంధువు ఓ కేంద్ర దర్యాప్తు సంస్థలో పనిచేస్తున్నారని సమాచారం. దీంతో ఆ కాంట్రాక్టర్ అవసరం ముఖ్య నేతకు ఎంతో ఉంది. ముఖ్య నేతకు సంబంధించిన కొన్ని కేసులను దర్యాప్తు చేస్తున్న ఆ కేంద్ర దర్యాప్తు సంస్థలో సదరు కాంట్రాక్టర్ బంధువు అధికారిగా ఉండడంతోనే హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్‌కు పెద్దపీట దక్కుతోందని చెప్పుకొంటున్నారు. కేంద్ర అధికారి ప్రాపకం కోసం ఈ కాంట్రాక్టర్‌ను మచ్చిక చేసుకొని ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నట్లు కాంట్రాక్టర్ల వర్గాలు చర్చించుకుంటున్నాయి. నెల్లూరులో రూ.42 కోట్లతో ఓ కాలువ ఆధునికీకరణ పనులు జరగ్గా ఇప్పటికి రూ.37 కోట్ల బిల్లులు సదరు కాంట్రాక్టరుకు చెల్లించారు. చివరి రెండు బిల్లులకు గాను మరో రూ.5 కోట్లు మాత్రమే పెండింగ్ ఉన్నాయి. అయితే ఇదే కాలువకు కొనసాగింపుగా ఉన్న మరో కాలువ పనులు రూ.5 కోట్లతో ఎప్పుడో పూర్తి చేసినా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. అలానే ఈ కాంట్రాక్టర్ చేస్తున్న వర్కుల్లో ఇంకో కాలువ పనులు రూ.7 కోట్లు జరగ్గా అందులో రూ.4 కోట్లు ఇప్పటికే ఇచ్చేశారు. చివరగా పెట్టిన మరో బిల్లు రావాల్సి ఉంది. అయితే ఇదే కాలువ రెండో ఫేజ్ వర్కులను వేరే కాంట్రాక్టర్ ముందే చేసి బిల్లు పెట్టినా అది విడుదల కాలేదు. ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు సంబంధించిన బిల్లులను కూడా ఆలస్యం లేకుండా అప్‌లోడ్ చేసేస్తున్నారు. ఏమాత్రం ఆలస్యమైనా రాష్ట్ర ఉన్నతాధికారులు లైన్లోకి వస్తారని బహిరంగంగానే చెప్పుకొంటున్నారు.

బంధం బలమైనదే!

కాలువ ఆధునికీకరణ కోసం తొలుత రూ.89 కోట్లతో 2019 డిసెంబరులో టెండర్లు పిలిచారు. మొత్తం ఐదుగురు కాంట్రాక్టర్లు బిడ్‌లు దాఖలు చేశారు. అందులో సదరు కాంట్రాక్టర్‌కే వర్కు దక్కేలా మిగిలిన నలుగురు కాంట్రాక్టర్లపై ప్రభుత్వ స్థాయిలో తీవ్ర ఒత్తిళ్లు వచ్చాయి. దీంతో ఆ నలుగురిలో ఒక్క కాంట్రాక్టర్ కూడా రివర్స్ టెండరింగ్‌లో పోటీపడలేదు. ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు టెండరు దక్కింది. ఆ తర్వాత ఈ వర్కును రూ.89 కోట్ల నుంచి 110 కోట్లకు అంచనాలు పెంచినట్లు తెలిసింది. కానీ ఈ విషయాలు బయటపెట్టేందుకు అధికారులు భయపడిపోతున్నారు. కాగా వరద ముంపు రక్షణకై మట్టి కట్ట నిర్మాణానికి సుమారు రూ.100 కోట్లతో రెండేళ్ల క్రితం టెండర్లు పిలిచారు. కానీ ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు కాకుండా మరో కాంట్రాక్టర్‌కు ఈ వర్కు దక్కింది. దీంతో ఏకంగా ఈ టెండర్‌నే రద్దు చేశారు. ఈ దఫా మట్టి కట్ట కాదు కాంక్రీట్ వాల్ అంటూ మళ్లీ టెండర్ పిలిచారు. ఈసారి ఎలాగైనా ఆ కాంట్రాక్టర్‌కే టెండర్ దక్కేలా ప్రయత్నాలు జరిగాయి. మొదట దఫా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఈ దఫా పోటీలో లేకుండా ఏకంగా ఓ ప్రజాప్రతినిధి బెదిరింపులకు దిగారు. దీంతో కాంట్రాక్టర్ ఆ ప్రజాప్రతినిధిపై కేసు కూడా పెట్టారు. ఎన్ని జరిగినా చివరకు అనుకున్న విధంగా ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు పనులు దక్కేలా చేశారు. ఇప్పుడు ఆ వర్కును మళ్లీ డిజైన్ మార్చారు. దీంతో అంచనాలు పెరిగిపోయాయి. ఇదే విధంగా మరో కాలువ ఆధునికీకరణకై సుమారు రూ.40 కోట్లతో రెండేళ్ల క్రితం టెండర్లు పిలిచారు. ఇక్కడ కూడా మరో కాంట్రాక్టర్ పోటీకి రాకుండా ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. సదరు కాంట్రాక్టర్‌కు ముఖ్యనేతతో ఉన్న బంధం బలాన్ని తెలిపే ఇలాంటి ఉదంతాలెన్నో నెల్లూరు జిల్లాలో వినిపిస్తున్నాయి.

"మంగళగిరి అభివృద్ధికి సీఎం రూ.1200 కోట్లు కేటాయిస్తామన్నారు. కానీ రూ.125 కోట్లకు కుదిస్తూ జీవో ఇచ్చారు. కానీ నిధులు మాత్రం విడుదల కాలేదు. ధనుంజయరెడ్డితో చాలా సార్లు మాట్లాడినా డబ్బులు విడుదల కాలేదు. కాంట్రాక్టర్ల నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చింది. స్వయంగా నేనే అప్పులు తీసుకొచ్చి ఇచ్చాను. ఇలాంటి పరిస్థితుల్లో నేను ఏం చేయాలి?"

- మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆవేదన

"రోడ్లు వేశాం. రోడ్డున పడ్డాం. వర్కులు చేసేందుకు ఆస్తులు అమ్ముకొని, అప్పులు తెచ్చాం. కానీ దీర్ఘకాలంగా బిల్లులు చెల్లించడం లేదు. ఇది చాలా దుర్మార్గం. మా కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి. కొందరికే బిల్లులు చెల్లిస్తూ మిగిలిన వారిపై వివక్ష చూపుతున్నారు. ఇటువంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు"

- ఇటీవల విజయవాడలో చేసిన ఆందోళనల్లో కాంట్రాక్టర్ల ఆక్రోశం

దర్యాప్తు చేతకాదా.?

» ఈసీతో మాట పడ్డాం, ఏమి చెబుతారు?

» తిరుపతి పోలీసులకు డీజీపీ ఆఫీస్ క్లాస్

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): 'మీరందరూ పోలీసులే కదా! శాంతి భద్రతలు, దర్యాప్తు పోలీసు డ్యూటీలో ముఖ్యం. మరి దర్యాప్తు చేతకాదా? మీ నిర్లక్ష్యం వల్ల ఎన్నికల కమిషన్‌తో మాట పడ్డాం, ఏమని సమాధానం చెబుతారు' అంటూ పోలీసు ఉన్నతాధికారి తిరుపతి పోలీసులకు క్లాస్ పీకారు. తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి, డీఎస్పీలు, సీఐలుసహా పన్నెండు మంది పోలీసు అధికారులకు మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం చీవాట్లు పెట్టారు. ఎన్నికల వాతావరణం నెలకొనడంతో రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర ఎన్నికల కమిషన్ మూడు రోజులపాటు విజయవాడలో జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించింది. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక నుంచి వస్తోన్న మద్యం అక్రమ రవాణాను అరికట్టడంలో విజయవాడ పోలీస్ కమిషనర్ క్రాంతి రాణాతోపాటు అనంతపురం ఎస్పీ అన్బురాజన్‌కు అక్షింతలు వేసింది. అంతకన్నా సీరియస్‌గా తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక సందర్భంగా నమోదైన ఎన్నికల అక్రమాలకు సంబంధించిన కేసుల దర్యాప్తులో స్థానిక పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై సీఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఎన్నికల కమిషన్ అంటే అంత లెక్కలేనితనమా..? పక్షపాతం చూపిస్తామంటే కుదరదు. అటువంటి ఆలోచన ఉంటే వెళ్లిపోండి. ఎన్నికల కమిషన్ నిఘా పెట్టి వెంట పడుతుంది. వెంటనే బై ఎలక్షన్ కేసులపై ఏమి చేశారో నివేదిక ఇవ్వండి' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యల్ని సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి తిరుపతి ఉప ఎన్నికల్లో నమోదైన కేసుల దర్యాప్తుపై సమీక్షించారు. తిరుపతి జిల్లా ఎస్పీతో పాటు ఇతర అధికారులను డీజీపీ కార్యాలయానికి పిలిపించారు. ముఖ్యమంత్రి జగన్ వ్యక్తిగత వైద్యుడైన గురుమూర్తిని ఎంపీగా గెలిపించుకోవడానికి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పలు ఉల్లంఘనలకు పాల్పడ్డారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన వేలాది మంది వైసీపీ కార్యకర్తల్ని తిరుపతికి తీసుకొచ్చి దొంగ ఓట్లు వేయించారంటూ టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు అప్పట్లో ఫిర్యాదు చేశారు. తిరుపతి జిల్లా పరిధిలో పదుల సంఖ్యలో పోలీసు కేసులు నమోదయ్యాయి. ఉప ఎన్నిక అనంతరం ఎఫ్ఐఆర్ కాపీలను పక్కన పడేసిన పోలీసులు దర్యాప్తు పూర్తిగా ఆపేశారు. దీంతో ఆయా కేసుల వివరాలతో, కేసులు ఏ స్టేషన్ పరిధిలో నమోదయ్యాయో వాటి ఎస్‌హెచ్‌వోలను సైతం డీజీపీ పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. శాంతిభద్రతల ఏడీజీ శంకబ్రత బాగ్చి ఈ కేసులన్నింటిపై సుదీర్ఘంగా సమీక్షించి వీలైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

హిందూమతంపై కాంగ్రెస్ వ్యతిరేకత బహిర్గతం

» మోదీపైన ఆ పార్టీ నేతలకు అసూయ, ద్వేషం: బీజేపీ

న్యూఢిల్లీ, జనవరి 11: అయోధ్యలో రామ మందిరం ప్రతిష్ఠ కార్యక్రమానికి తమ పార్టీ అగ్రనేతలు హాజరు కావడం లేదన్న కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తప్పుబట్టింది. ఇది భారత దేశ సంస్కృతి, హిందూ మతం పట్ల ఆ పార్టీకి అంతర్లీనంగా ఉన్న వ్యతిరేకతను బహిర్గతం చేసిందని ఆరోపించింది. ప్రధాని మోదీపై అసూయ, ద్వేషంతో పాటు ఆత్మన్యూనతా భావం వంటి కారణాలతో దేశాన్ని వ్యతిరేకించే స్థాయికి కాంగ్రెస్ వెళ్లిందని, ఇప్పుడు ఏకంగా దేవుడినే వ్యతిరేకిస్తోందని బీజేపీ అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది ధ్వజమెత్తారు. భారతీయ సంప్రదాయాలు, సంస్కృతి, అత్యున్నత విలువలకు అయోధ్యలోని రామమందిరం ప్రతీకగా పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్‌కు, అలాంటి భావజాలమే ఉన్న దాని మిత్రపక్షాలకు అతివాద రాజకీయాలే ముఖ్యమన్నారు. మరోవైపు కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయాన్ని కర్ణాటక సీఎం సిద్దరామయ్య సమర్థించారు. మతపరమైన కార్యక్రమాన్ని బీజేపీ నేతలు రాజకీయ వ్యవహారంగా మార్చారని ఆరోపించారు. దీనికి నిరసనగా ఆలయ ప్రతిష్ఠను నాలుగు శంకరాచార్య మఠాల పీఠాధిపతులు బహిష్కరించారని చెప్పారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధాన్ని రాజేశాయి. హిందుత్వకు కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకమేనని కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు సీటీ రవి మండిపడ్డారు. "సోమనాథ్ ఆలయాన్ని సర్దార్ పటేల్, బాబూ రాజేంద్రప్రసాద్, కేఎం మున్షీ పునర్నిర్మించారు అప్పుడు ప్రధానిగా ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ, ఆ ఆలయాన్ని సందర్శించనే లేదు. అలాంటప్పుడు ప్రస్తుత కాంగ్రెస్ నాయకత్వం అయోధ్యకు ఎలా వెళ్తుంది? ముందు తమకు ఆహ్వానం అందలేదన్నారు. అది అందిన తర్వాత దానిని అంగీకరించడానికి నిరాకరిస్తున్నారు" అని రవి ధ్వజమెత్తారు.

రామమందిర ప్రతిష్ఠకు అద్వాణీ: వీహెచ్‌పీ

రామ జన్మభూమి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బీజేపీ అగ్రనేత అద్వాణీ(96) అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కానున్నారని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అధ్యక్షుడు అలోక్ కుమార్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి వస్తానని అద్వాణీ చెప్పారని, అవసరమైతే ఆయన కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. తాను కూడా అయోధ్యకు రావడానికి ప్రయత్నిస్తానని పార్టీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషీ చెప్పారన్నారు. రామమందిరం ట్రస్టు ఆహ్వానాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు తిరస్కరించడంపై అలోక్ స్పందించారు. ప్రధాని మోదీని ఆహ్వానించిన విధంగానే ప్రతిపక్ష నేతలకూ ఆహ్వానాలు పంపామన్నారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు అన్ని పార్టీల అధ్యక్షులనూ ఆహ్వానించామని తెలిపారు. అయోధ్యకు రావాలా, వద్దా అనే విషయాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అలోక్ పేర్కొన్నారు.

రుణాల మంజూరుకు మరింత సహకరించాలి

» బ్యాంకర్లకు ఆర్థిక మంత్రి బుగ్గన విజ్ఞప్తి

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ పథకాల లబ్ధిదారులకు రుణాల మంజూరు విషయంలో బ్యాంకర్లు మరింత తోడ్పాటు అందించాలని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కోరారు. అమరావతి సచివాలయంలో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ 225వ సమావేశం గురువారం జరిగింది. మంత్రి మాట్లాడుతూ.. "ఈ ఏడాది 3లక్షల మంది కౌలురైతులకు రూ.4వేల కోట్ల రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నా, 75వేల మందికే ఇచ్చారు. మిగతావారికీ రుణాలివ్వాలి. టిడ్కో గృహాలకు పెద్దఎత్తున రుణాలివ్వాలి. విద్యారుణాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ముద్రా, ఇతర కేంద్ర ప్రయోజిత పథకాల లక్ష్యాలు సాధించాలి' అని సూచించారు. ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్, యూబీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితీష్ రంజన్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ రవీంద్రబాబు, ఆర్బీఐ జీఎం రాకేశ్ మాట్లాడారు. కాగా, 2023-24 బ్యాంకుల వార్షిక రుణ ప్రణాళికలో స్వల్పకాలిక పంట రుణాలు రూ.లక్షా48వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా, ఖరీఫ్‌లో రూ.82వేల కోట్లతో 56% సాధించినట్లు బ్యాంకర్లు వివరించారు. దీర్ఘకాల రుణాల్లో రూ.68వేల కోట్ల లక్ష్యంలో రూ.43వేల కోట్లతో 58%, అగ్రి ఇన్‌ఫ్రా, ఎక్స్‌పోర్టుకు రూ.15వేల కోట్ల రుణాల్లో 101% లక్ష్యాన్ని సాధించగా, ఎంఎస్ఎంఈ రుణాల్లో రూ.69వేల కోట్లకు రూ.53వేల కోట్లతో 78%, ముద్రా రుణాల్లో 77%, పీఎంఎఫ్ఎంఈ 83%, పీఎం స్వానిధి 96%, స్టాండ్ ఆప్ ఇండియా రుణాల్లో 93% లక్ష్యాలు సాధించినట్లు చెప్పారు.

బాబు చేస్తే ఒప్పు.. మేం చేస్తే తప్పా..?

మాజీ సీఎం చంద్రబాబు అప్పు చేస్తే తప్పు కాదు.. మేం చేస్తే తప్పా అని మంత్రి బుగ్గన ప్రశ్నించారు. చంద్రబాబు రాజకీయంగా అనుసరించిన విధానాల వల్లే రాష్ట్రంపై అప్పుల భారం పెరిగిందని విలేకరులతో అన్నారు. 'రాష్ట్ర ప్రభుత్వ అప్పులపై టీడీపీ నేతలు తలోరకంగా మాట్లాడుతున్నారు. చంద్రబాబు రూ.13 లక్షల కోట్లు అంటే, యనమల రూ.10 లక్షల కోట్లు అంటారు. ఇంకొకరు రూ.7 లక్షల కోట్లంటారు. అసలు రాష్ట్రంపై అప్పు ఎంత ఉందో టీడీపీ నేతలకే స్పష్టత లేదు. రూ.లక్షా 70 వేల కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయని వారికి ఎవరు చెప్పారు? కేంద్రం, కాగ్, ఆర్బీఐ, బ్యాంకులకు తెలియకుండా అప్పులు చేయడం కుదరదని బాబు, యనమలకు తెలియదా? సీపీఎస్ రద్దు చేస్తే, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. అందుకే జీపీఎస్ అమలు చేస్తాం. కేంద్రం నుంచి మేం ఏదైనా సాధిస్తే బీజేపీతో కుమ్మక్కయ్యారంటారు. ప్రత్యేక హోదా తేకపోతే.. మా వల్ల కాలేదంటారు. తండ్రీకొడుకులు ఊరూరా తిరిగి వైసీపీ ఎమ్మెల్యేలకు పేర్లు పెడుతున్నారు. వారిద్దరికీ మేం పేర్లు పెట్టలేమా? లోకేశ్‌ను రేలంగి అని అనలేమా' అని ప్రశ్నించారు. సీపీఎస్ రద్దు, మెగా డీఎస్సీ, ఏటా జాబ్ కేలెండర్ హామీలు ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించగా.. 95 శాతం హామీలు నెరవేర్చితే, మిగతా 5 శాతం గురించే మీడియా హైలైట్ చేయడం సరికాదని బుగ్గన అన్నారు.

సరయూ నది ఒడ్డున 'రామాయణ ఆధ్యాత్మిక వనం'

» వనవాసంలో శ్రీరాముడి ప్రయాణ విశేషాలతో ప్రాజెక్టు

న్యూఢిల్లీ, జనవరి 11: అయోధ్యను సందర్శించే భక్తులు నగరంలోని సరయూ నది ఒడ్డున నిర్మితమవుతున్న 'రామాయణ ఆధ్యాత్మిక వనాన్ని' సందర్శించడం ద్వారా శ్రీరాముడి 14ఏళ్ల వనవాసం గురించి మరిన్ని విశేషాలు తెలుసుకోవచ్చు. రామాయణ వైభవాన్ని ప్రదర్శించే ఓపెన్ ఎయిర్ మ్యూజియంను తలపించేలా ఈ వనం పర్యావరణహితంగా ఉండనుంది. అయోధ్య మాస్టర్ ప్లాన్‌లో భాగంగా దీన్ని సిద్ధం చేస్తున్నారు. శ్రీరాముడు, రామాయణం, అయోధ్యతో పాటు సరయూ నది కూడా హిందూమతం నుంచి విడదీయరాని భాగమని అయోధ్య పునరాభివృద్ధి ప్రాజెక్టు చీఫ్ ప్లానర్ దిక్షు కుక్రేజా అన్నారు. నది ఒడ్డు వెంబడి ప్రతిపాదిత ఆధ్యాత్మిక వనాన్ని రామాయణం ఇతివృత్తంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో రాముడు వనవాస సమయంలో చేసిన ప్రయాణాన్ని ప్రత్యేకంగా వివరించినట్లు తెలిపారు. ఈ వనం భక్తులతో పాటు పర్యాటకులను, ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తుందని చెప్పారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం రూ.85వేల కోట్లకు పైగా పెట్టుబడులతో అయోధ్య నగర పునర్నిర్మాణం పదేళ్లలో పూర్తికానుంది.

22న అయోధ్యకు 100 చార్టర్డ్ విమానాలు: సీఎం యోగి

రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించే జనవరి 22న సుమారు 100 వరకూ చార్టర్డ్ విమానాలు అయోధ్య విమానాశ్రయంలో ల్యాండ్ అవుతాయని భావిస్తున్నామని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. గతేడాది డిసెంబరు 30న ప్రధాని ప్రారంభించిన మహర్షి వాల్మీకి విమానాశ్రయం సామర్థ్యానికి ఇదో పరీక్షగా పేర్కొన్నారు. రాష్ట్రానికి నాలుగో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఇచ్చినందుకు మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయోధ్య నుంచి అహ్మదాబాద్‌కు ఇండిగో విమాన సర్వీసును ఆయన గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఢిల్లీ నుంచి అయోధ్యకు ఇప్పటికే విమాన సదుపాయం ఉండగా ఇకపై అహ్మదాబాద్‌కు కూడా నేరుగా సర్వీసులు నడుస్తాయి. ఇక ఈ నెల 15నుంచి ముంబైకి కూడా విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి.

అంబేడ్కర్ కుటుంబ సభ్యులకు అయోధ్య ఆహ్వానం

» జగజ్జీవన్‌రాం, కాన్షీరాంల వారసులకు కూడా..

» సీఎంలలో ఒక్క యోగికి మాత్రమే

న్యూఢిల్లీ, జనవరి 11: అయోధ్య రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ప్రముఖ దళిత నాయకులైన బి.ఆర్. అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్‌రాం, కాన్షీరాంల కుటుంబ సభ్యులకు నిర్వాహకులు ఆహ్వానాలు పంపారు. ఈ నెల 22న జరగనున్న ఈ ఉత్సవానికి రావాల్సిందిగా కోరుతూ ఆహ్వానాలు పంపిన ప్రముఖుల వివరాలను విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వినహా ఏ ఇతర ముఖ్యమంత్రికీ ఆహ్వానం పంపలేదు. అన్ని పార్టీల అధ్యక్షులకు ఆహ్వానాలు పంపినా ఏ ఒక్క కేంద్ర మంత్రికిగానీ, రాష్ట్ర మంత్రికిగానీ, ఇతర రాజకీయ నాయకులకుగానీ ఇందులో చోటు దక్కలేదు. రామజన్మభూమి ఉద్యమంలో పాల్గొని ప్రాణాలు కోల్పోయిన కరసేవకుల కుటుంబ సభ్యులకు ఆహ్వానాలు అందాయి. ముగ్గురు విశ్రాంత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తులు, పదవీ విరమణ చేసిన ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌లు, మాజీ రాయబారులు, సివిల్ సర్వెంట్స్, మాజీ ఐపీఎస్ అధికారులు కూడా ప్రముఖుల జాబితాలో ఉన్నారు. అయోధ్యలోని అన్ని పార్టీల ప్రతినిధులకు ఆహ్వానపత్రికలు అందాయి. గిరిజన, సంచార జాతుల ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపార వేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నోబెల్, భారతరత్న, పరంవీర్ చక్ర, పద్మ అవార్డుల గ్రహీతలను ఆహ్వానించనున్నారు. ప్రముఖ ఆలయాల ధర్మకర్తలు, 150 సంప్రదాయాల పూజారులు, నేపాల్‌కు చెందిన సంత్ సమాజ్ ప్రముఖులు, జైన, బౌద్ధ, సిక్కు మతాల ప్రతినిధులు, 50 దేశాలకు చెందిన 55 హిందూ సంఘాల ప్రతినిధులనే కాకుండా దాతలను ఆహ్వానించారు. వారందరికీ అయోధ్యలో ఉచిత వసతి, రవాణా, భోజన సౌకర్యాలు కల్పించనున్నారు.

పదోన్నతుల్లో 'సుప్రీం' ఆదేశాలు పాటించండి

» విద్యుత్ సంస్థలకు హైకోర్టు ఆదేశం.. తీర్పుపై ఉద్యోగుల హర్షం


అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పదోన్నతుల్లో సుప్రీం కోర్టు మార్గదర్శకాలు, ఆదేశాలను పాటించాల్సిందేనని విద్యుత్ సంస్థలకు హైకోర్టు స్పష్టం చేసింది. పదోన్నతులపై విద్యుత్ సంస్థల యాజమాన్యాలు అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. ఉద్యోగులకు పదోన్నతుల విషయంలో నాగరాజు, జోర్నైల్ సింగ్, బీకే పవిత్ర-1 కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పాటించాల్సిందేనని జస్టిస్ వి.సుజాత తీర్పును వెలువరించారు. రాష్ట్ర విద్యుత్ ఓసీ ఉద్యోగ సంఘాలు పదోన్నతుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును విద్యుత్ సంస్థలు అమలు చేయడం లేదంటూ హైకోర్టును ఆశ్రయించింది. పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలుచేయడంలో గతంలోనే సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలతో కడిన ఆదేశాలను ఇచ్చినందున దానిని కచ్చితంగా అమలు చేయాల్సిందేనని హైకోర్టు ఇటీవల తీర్పును వెలువరించింది. భవిష్యత్తులో కచ్చితంగా సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకే పదోన్నతులు ఇవ్వాలని సూచించింది. హైకోర్టు ఆదేశాలపై విద్యుత్ సంస్థల ఉద్యోగుల రాష్ట్ర ఓసీ సంఘం ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

బంగ్లా ప్రధానిగా హసీనా ప్రమాణ స్వీకారం

ఢాకా, జనవరి 11: బంగ్లాదేశ్ ప్రధానిగా అవామీ లీగ్ నేత షేక్ హసీనా (76) గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. దేశ 12వ ప్రధానిగా ఆమె చేత అధ్యక్షుడు మహమ్మద్ షహాబుద్దీన్ ప్రమాణం చేయించారు. దీంతో ఆమె 5సార్లు ప్రధాని పదవిని చేపట్టినట్టయింది. వరుసగా 4సార్లు ప్రధాని కావడం విశేషం. తొలిసారిగా 2009లో ప్రధాని అయ్యారు. ప్రస్తుతం ప్రపంచంలోనే ఎక్కువ కాలంపాటు అధికారంలో కొనసాగుతున్న మహిళా ప్రభుత్వాధినేతగా గుర్తింపు పొందారు. ఆమెతో పాటు 25 మంది మంత్రులు, 11 మంది సహాయ మంత్రులు ప్రమాణం చేశారు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శుక్రవారం 12 జనవరి 2024

హైదరాబాద్ నార్మ్‌లో పీజీడీఎం



హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ఐకార్-నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్)- 'పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రి-బిజినెస్ మేనేజ్‌మెంట్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 66 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, అనుభవం, క్యాట్/సీమ్యాట్ స్కోర్, అనలిటికల్ రైటింగ్ స్కిల్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి నాలుగేళ్ల డిగ్రీ(అగ్రికల్చర్/అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్/కమర్షియల్ అగ్రికల్చర్/అగ్రికల్చరల్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/డెయిరీ సైన్స్/ఫిషరీస్/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్/ఫారెస్ట్రీ/హార్టికల్చర్/సెరీకల్చర్/వెటర్నరీ సైన్సెస్/హోం సైన్స్/కమ్యూనిటీ సైన్స్/అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకూ ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: ఇందులో భాగంగా అనలిటికల్ రైటింగ్ స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ పరీక్షలో అభ్యర్థులు ఇచ్చిన అంశంపై ఇంగ్లీష్‌లో వ్యాసం రాయాల్సి ఉంటుంది. ఇరవై నిమిషాల సమయం ఇస్తారు. తరవాత గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి సీటుకు అయిదుగురిని ఇంటర్వ్యూకి అనుమతిస్తారు.

- క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్‌కు 30 శాతం, స్కిల్ టెస్ట్ స్కోర్‌కు 10 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 20 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 20 శాతం, అకడమిక్ మెరిట్‌కు 10 శాతం, అనుభవానికి 5 శాతం, డైవర్సిటీ ఫాక్టర్‌కు 5 శాతం వెయిటేజీ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు; క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ కార్డ్; టీసీ; కులం, ఆదాయం, వైకల్యం, అనుభవం సంబంధిత ధ్రువపత్రాలు; దరఖాస్తు ఫీజు రిసీట్; అభ్యర్థి ఫొటో.
- **వెబ్‌సైట్:** naarm.org.in

జేఎన్ టాటా లోన్ స్కాలర్‌షిప్

విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకొనే భారతీయ అభ్యర్థుల కోసం ఉద్దేశించిన 'జేఎన్ టాటా ఎండోమెంట్ లోన్ స్కాలర్‌షిప్ 2024' నోటిఫికేషన్ వెలువడింది. ఏ విభాగంలోనైనా ఫుల్ టైం పీజీ, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టొరల్, రీసెర్చ్ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లలో చేరదలచుకొన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. దేశవ్యాప్తంగా 5,700 మందికి పైగా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అప్లయిడ్ సైన్సెస్, ప్యూర్ సైన్సెస్, సోషల్ సైన్సెస్, ఐటీ అండ్ కంప్యూటింగ్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, లా, కామర్స్, ఫైన్‌ఆర్ట్స్ విభాగాల్లో ప్రోగ్రామ్‌లు ఎంచుకొన్నవారు అత్యధికంగా ఈ లోన్ స్కాలర్‌షిప్ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు.



అర్హత: గుర్తింపు పొందిన ఇండియన్ యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు, విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్స్ కోసం ప్రయత్నిస్తున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు ప్రవేశం పొందిన విదేశీ యూనివర్సిటీ వివరాలను నిర్దేశిత సమయంలోపు ఈమెయిల్ ద్వారా తెలపాలి. జీఆర్ఈ/జీమ్యాట్/టోఫెల్/ఐఈఎల్‌టీఎస్/పీటీఈ స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులు సబ్మిట్ చేసే 'స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ (ఎస్ఓపీ)'కు ప్రాధాన్యం ఉంటుంది. ఎంచుకొన్న కోర్సు వ్యవధి రెండేళ్లు ఉండాలి. గతంలో లోన్ స్కాలర్‌షిప్ కోసం ప్రయత్నించి విఫలమైనవారు, వచ్చినా వినియోగించుకోనివారు, ఇప్పటికే విదేశాల్లో రెండో ఏడాది కోర్సు చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థి వయసు 2024 జూన్ 30 నాటికి 45 ఏళ్లు మించకూడదు. సెమినార్‌లు, కాన్ఫరెన్స్‌లు, ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లు, వర్క్‌షాప్‌లు, పేపర్ ప్రెజంటేషన్‌ల కోసం విదేశాలకు వెళ్లేవారు; డిగ్రీ స్థాయి కోర్సులు ఎంచుకొన్నవారు; ఆన్‌లైన్/దూరవిద్య విధానంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ/డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సులు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. ఇప్పటికే లోన్ స్కాలర్‌షిప్ మొత్తాన్ని పూర్తిగా చెల్లించినవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అకడమిక్ మెరిట్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, అనుభవం ఆధారంగా స్క్రీనింగ్ చేసి షార్ట్‌లిస్ట్ రూపొందిస్తారు. వీరికి మాత్రమే థింకింగ్ స్కిల్స్ అసెస్‌మెంట్ కోసం ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో అర్హత పొందినవారికి టెక్నికల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో అభ్యర్థి చూపిన ప్రతిభ ఆధారంగా ఫైనల్ సెలెక్షన్ ప్రక్రియ నిర్వహిస్తారు.

లోన్ స్కాలర్‌షిప్ వివరాలు: అభ్యర్థి ఎంచుకొన్న ప్రోగ్రామ్‌ను అనుసరించి రూ.1,00,000 నుంచి రూ.10,00,000ల మధ్య లోన్ స్కాలర్‌షిప్ అందిస్తారు. ట్రావెల్ అసిస్టెన్స్ కింద గరిష్ఠంగా రూ.50,000 ఇస్తారు. ప్రోగ్రామ్ సమయంలో అభ్యర్థి చూపిన ప్రతిభ ఆధారంగా గిఫ్ట్ అవార్డ్ కింద రూ.2,00,000 నుంచి రూ.7,50,000 వరకు చెల్లిస్తారు. ప్రోగ్రామ్‌లో చేరిన మూడో ఏడాది నుంచి ఏడో సంవత్సరంలోపు అభ్యర్థులు ఈ లోన్ స్కాలర్‌షిప్‌ను అయిదు ఇన్‌స్టాల్‌మెంట్‌లలో తిరిగి చెల్లించాలి. ఈ మేరకు సంబంధిత ట్రస్టీతో లీగల్‌గా ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సినవి:** అభ్యర్థి ఫొటో, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, డిగ్రీ/పీజీ సర్టిఫికెట్‌లు, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్; వర్కింగ్ ప్రొఫెషనల్స్ అయితే అనుభవ ధ్రువీకరణ పత్రం, అపాయింట్‌మెంట్ లెటర్, ఐటీఆర్/మూడు నెలల పే స్లిప్స్‌ను కూడా నిర్దేశిత సైజ్‌లో అప్‌లోడ్ చేయాలి.
- దరఖాస్తు సబ్మిట్ చేసిన తరవాత ఏవైనా మార్పులు చేయదలచుకుంటే ఈ-మెయిల్ ద్వారా సంస్థకు సమాచారమివ్వాలి.
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 1
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థులు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** రెజ్యూమె; డిగ్రీ/పీజీ మార్కుల పత్రాలు; జీఆర్ఈ/జీమ్యాట్/టోఫెల్/ఐఈఎల్‌టీఎస్/పీటీఈ స్కోర్ కార్డ్; ఇప్పటి వరకు పొందిన స్కాలర్‌షిప్‌లు, బహుమతుల వివరాలు; రీసెర్చ్ వర్క్/ప్రాజెక్ట్ వర్క్‌లు; విదేశీ విశ్వవిద్యాలయం నుంచి అడ్మిషన్ లెటర్; హామీదారుకు సంబంధించిన ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, ఐటీఆర్/మూడు నెలల పే స్లిప్స్, ఫొటో
- **ఫైనల్ సెలెక్షన్‌కి ఎంపికైన అభ్యర్థులు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పాన్ కార్డ్, బ్యాంక్ స్టేట్‌మెంట్, హామీదారుకు సంబంధించిన ఐటీఆర్, ఫొటో, పాన్ కార్డ్, ఆధార్ కార్డ్.
- **వెబ్‌సైట్:** jntataendowment.org

లిటిల్స్



నక్క కొంగ స్నేహం

ఒక అడవిలో కొంగ ఉండేది. దానికి అనుకోకుండా ఓ స్నేహితుడు పరిచయమైంది. అదో నక్క. సంబరంగా నక్క స్నేహితుడని పక్షులకంతా చెప్పుకునేది. అయితే నక్కను మాత్రం నమ్మకు అంటూ పక్షులు హితబోధ చేశాయి. అప్పటి నుంచి జాగ్రత్తగానే ఉంది కొంగ.


ఆ నక్క విషయానికొస్తే టక్కరి. పక్షులను, చేపలను తినటంలో అందెవేసిన చేయి. నమ్మించి మోసం చేయటంలో ముందుంటుంది. పక్షులను తిని రుచి మరిగిన నక్క ఈ కొంగను కూడా తినాలనుకుంది. అయితే కొంగ మంచితనం చూసి నక్కకు దుర్బుద్ధి పోయింది. ఒక మంచి స్నేహంగా చూసింది. తను ఆపదలో ఉంటే ఆదుకోవాలి. తద్వారా తన మంచితనాన్ని చాటుకోవాలనే ఆలోచనలోకి పడింది నక్క.



నక్క ఒక రోజు సింహం తినగా మిగిలిన మాంసాన్ని తినింది. ఆశతో తినటంతో చూసుకోలేదు. ఒక ముక్క తన నోటిలో గుచ్చుకుంది. బాధతో విలవిలలాడింది. ప్రాణం పోతుందేమోనని భయపడింది. వెంటనే ఆ ముక్కను ఎలాగైనా బయటకు తీయించుకోవాలని పరిగెత్తింది. నక్కలూ పట్టించుకోలేదు. దారిలో ఓ నెమలి కనపడింది. నోటిలో ఇరుక్కున ఎముకను తీయమని బతిమలాడింది. నీ మాటలు నమ్మలేనంది నెమలి. కోతి కనపడింది. నక్క సంతోషడింది. కోతి బావా ఎలాగైనా నా బాధనుంచి విముక్తి కలిగించు అని వేడుకుంది. నక్క బావా నీ మాటలు నమ్మలేను. నీ జాతి గురించి నాకు తెలీదా? అన్నది భయంతో. ఇక చావే శరణ్యం అనుకున్న సమయంలో కొంగ వచ్చింది. కొంగకు తన బాధచెప్పింది. వెంటనే నక్క నోటిలోని ఎముకను తీయటానికి ఇష్టపడలేదు. స్నేహితుడిని కాపాడలేవా? అన్నది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా తన పొడవైన ముక్కుతో ఆ ఎముక ముక్కను క్షణాల్లో తీసేసింది. నక్కకు ఉపశమనం కలిగింది.

అసలు నన్ను ఎవరూ నమ్మలేదు. నీలాంటి స్నేహితురాలు ఉండటం అదృష్టమంటూ సంతోషపడింది నక్క. నిన్ను నమ్మలేకపోయా.. నీ స్నేహం గురించి ఇప్పుడే అర్థమైందన్నది కొంగ.

దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



చుక్కలు కలపండి



రంగులు వేయండి



డైలీ సుడోకు - 202

	7		8					9
5		1			7			
		8		1			3	7
	4		3		5			
	5						8	
			1		4		9	
3	9			5		2		
			7			9		3
6					9		1	

సుడోకు - 201 సమాధానం

5	4	3	6	7	8	9	1	2
7	2	9	1	4	3	6	5	8
6	1	8	2	5	9	3	7	4
3	5	4	8	1	7	2	6	9
9	7	1	3	2	6	4	8	5
8	6	2	5	9	4	1	3	7
4	9	6	7	8	1	5	2	3
1	8	5	9	3	2	7	4	6
2	3	7	4	6	5	8	9	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

జ్యోతిబా పూలే గురుకులాల బ్యాక్‌లాగ్ ఎంట్రెన్స్ టెస్ట్

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీటీబీసీడబ్ల్యుఆర్ఎస్) - రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకోసం బ్యాక్‌లాగ్ ఎంట్రెన్స్ టెస్ట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా బీసీ బాల బాలికల పాఠశాలల్లో ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో ప్రవేశ పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ కేటగిరీలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్రంలోని పాత జిల్లా కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. స్టేట్ సిలబస్‌ను అనుసరిస్తారు. యోగా, వ్యాయామం, క్రీడలు, ఆటపాటలకు ప్రాధాన్యం ఉంటుంది. కంప్యూటర్ విద్య, డిజిటల్ తరగతులు ఉంటాయి. విద్య, భోజనం, వసతి ఉచితం. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.



ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. తెలుగులో 15, లెక్కల్లో 30, సామాన్యశాస్త్రంలో 15, సాంఘిక శాస్త్రంలో 15, ఇంగ్లీష్‌లో 25 ప్రశ్నలు అడుగుతారు. ప్రవేశం పొందే తరగతిని అనుసరించి ముందు తరగతి సిలబస్ ప్రకారం ప్రశ్నలు ఇస్తారు. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్న పత్రం తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.

మిగిలిన సీట్ల వివరాలు

ఆరోతరగతిలో: మొత్తం సీట్లు 2152. బాలురకు 1015, బాలికలకు 1137 సీట్లు ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో 100, రంగారెడ్డిలో 170, హైదరాబాద్‌లో 225, మెదక్‌లో 311, నిజామాబాద్‌లో 366, ఆదిలాబాద్‌లో 55, కరీంనగర్‌లో 317, వరంగల్‌లో 96, ఖమ్మంలో 390, నల్లగొండలో 132 సీట్లు ఉన్నాయి.

ఏడోతరగతిలో: మొత్తం సీట్లు 976. బాలురకు 448, బాలికలకు 528 సీట్లు ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో 49, రంగారెడ్డిలో 97, హైదరాబాద్‌లో 24, మెదక్‌లో 167, నిజామాబాద్‌లో 176, ఆదిలాబాద్‌లో 28, కరీంనగర్‌లో 120, వరంగల్‌లో 46, ఖమ్మంలో 234, నల్లగొండలో 35 సీట్లు ఉన్నాయి.

ఎనిమిదోతరగతిలో: మొత్తం సీట్లు 1095. బాలురకు 501, బాలికలకు 594 సీట్లు ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో 47, రంగారెడ్డిలో 104, హైదరాబాద్‌లో 59, మెదక్‌లో 154, నిజామాబాద్‌లో 175, ఆదిలాబాద్‌లో 73, కరీంనగర్‌లో 138, వరంగల్‌లో 47, ఖమ్మంలో 255, నల్లగొండలో 43 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఆరోతరగతిలో ప్రవేశానికి అయిదో తరగతి, ఏడోతరగతిలో ప్రవేశానికి ఆరోతరగతి, ఎనిమిదో తరగతిలో ప్రవేశానికి ఏడోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రభుత్వ/గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి. విద్యార్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి ఆరోతరగతికి 12 ఏళ్లు, ఏడోతరగతికి 13 ఏళ్లు, ఎనిమిదోతరగతికి 14 ఏళ్లు మించకూడదు. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ విద్యార్థులకు రూ.1,50,000; పట్టణ ప్రాంతాల విద్యార్థులకు రూ.2,00,000 మించకూడదు.


దరఖాస్తు నిబంధనలు: ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి వివరాలు పూర్తిగా నింపాలి. విద్యార్థి ఫొటో; పుట్టిన తేదీ, కులం, ఆదాయం, ప్రత్యేక కేటగిరీ ధృవీకరణ పత్రాలు; బోనఫయిడ్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్‌లను అప్‌లోడ్ చేయాలి. సొంత జిల్లాకు చెందిన పరీక్ష కేంద్రాలను మాత్రమే ఎంచుకోవాలి. సంస్థ వెబ్‌సైట్‌లో ఇచ్చిన పాఠశాలల పట్టికను పరిశీలించి పాఠశాల ప్రాధాన్యక్రమాన్ని సూచించాలి. దరఖాస్తును అప్‌లోడ్ చేసిన తరవాత మార్పులకు వీలు లేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. విద్యార్థులకు సొంత జిల్లా పాఠశాలల్లో మాత్రమే ప్రవేశం లభిస్తుంది. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీలు ఉండవు. పూర్తి వివరాలకోసం విద్యార్థులు దగ్గరలోని సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని సంప్రదించవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 15
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 26 నుంచి
- **బ్యాక్‌లాగ్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** మార్చి 3
- **అడ్మిషన్ ప్రక్రియకు ముగింపు:** జూలై 31
- **చిరునామా:** మహాత్మా జ్యోతిబా పూలే వెనకబడిన తరగతుల గురుకుల విద్యాలయాల సంస్థ ప్రధాన కార్యాలయం, రూం నెం. 206, రెండో అంతస్తు, డీఎస్ఎస్ భవన్, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్.
- **వెబ్‌సైట్:** mjptbcwreis.telangana.gov.in

జాబ్ కార్నర్

బీఐఎస్‌లో కన్సల్టెంట్స్



బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్)... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న విభాగాల్లో కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాల వారీగా ఖాళీలు

1. సివిల్ ఇంజనీరింగ్: 15
2. కెమికల్: 6
3. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ: 3
4. ఎలక్ట్రోటెక్నికల్: 6
5. ఫుడ్ అండ్ అగ్రికల్చర్: 6
6. మెకానికల్ ఇంజనీరింగ్: 7
7. మెడికల్ ఎక్యుప్‌మెంట్ అండ్ హాస్పిటల్ ప్లానింగ్: 2
8. మెటలర్జికల్ ఇంజనీరింగ్: 9
9. పెట్రోలియం, కోల్ అండ్ రిలేటెడ్ ప్రొడక్ట్స్: 5
10. ప్రొడక్షన్ అండ్ జనరల్ ఇంజనీరింగ్: 10
11. టెక్స్‌టైల్: 8
12. ట్రాన్స్‌పోర్ట్ ఇంజనీరింగ్: 7
13. వాటర్ రీసోర్సెస్: 6
14. సర్వీస్ సెక్టార్: 8
15. మేనేజ్‌మెంట్ అండ్ సిస్టమ్: 5
16. ఆయూష్: 4

అర్హత: పోస్టును అనుసరించి టింబర్ సైన్స్ అండ్ టెక్నాలజీ/టెక్నాలజీ ఫారెస్ట్, సివిల్/ఫైర్/మెటలర్జీ, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, కెమికల్, పాలిమర్ ఇంజనీరింగ్/ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో డిగ్రీ, పీజీ డిప్లొమా, ఎంబీఏ ఎంటెక్‌తో పాటు సంబంధిత రంగంలో 5 నుంచి 10 ఏళ్ల పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 65 ఏళ్లు మించరాదు
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 19
వెబ్‌సైట్: www.bis.gov.in/

'సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్'లో సైంటిస్టులు

సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 12

అర్హత: సైన్స్/ఇంజనీరింగ్, సిరామిక్ ఇంజనీరింగ్/సెరామిక్ టెక్నాలజీ/మెటీరియల్స్ ఇంజనీరింగ్/మెటీరియల్స్ సైన్స్/మెటలార్జికల్ అండ్ మెటీరియల్ ఇంజనీరింగ్/ఫిజిక్స్ విభాగాల్లో పీహెచ్‌డీ, ఎంఈ, ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 32 ఏళ్లకు మించకూడదు.
దరఖాస్తు ఫీజు: రూ.500
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 24
వెబ్‌సైట్: https://www.cgcri.res.in/

ఓఎంసీలో మేనేజర్లు

ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ లిమిటెడ్(ఓఎంసీ)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: మేనేజర్(కార్పొరేట్ కమ్యూనికేషన్) ఈ-3 గ్రేడ్
అర్హత: పీజీ, డిగ్రీ, జర్నలిజమ్ డిప్లొమా, మాస్ కమ్యూనికేషన్‌తో పాటు నాలుగేళ్ల సంబంధిత పని అనుభవం ఉండాలి.
ఎంపిక: షార్ట్‌లిస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా
వయోపరిమితి: 38 ఏళ్లు మించరాదు
జీతం: నెలకు రూ.67,700 - రూ.2,08,700
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 30
వెబ్‌సైట్: https://omcltd.in/

ఐఎంయులో ఫ్యాకల్టీ

చెన్నైలోని ఇండియన్ మారిటైం యూనివర్సిటీ, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్(బ్యాక్‌లాగ్) నిర్వహిస్తోంది.

మొత్తం ఖాళీలు: 16

1. ప్రొఫెసర్(నాటికల్ సైన్స్): **1 పోస్టు**
2. అసోసియేట్ ప్రొఫెసర్(నేచురల్ సైన్స్/మెరైన్ ఇంజనీరింగ్): **8 పోస్టులు**
3. అసిస్టెంట్ ప్రొఫెసర్(నేచురల్ సైన్స్/మెరైన్ ఇంజనీరింగ్): **7 పోస్టులు**

అర్హతలు: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 50 సంవత్సరాలు మించకూడదు
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 24
దరఖాస్తు హార్డ్ కాపీ సమర్పణకు చివరి తేదీ: జనవరి 29
వెబ్‌సైట్: www.imu.edu.in/imunew/